

# ఆగని గంటలు

ప్రేమించిన మనిషిని పెద్దలకు భయపడి త్యాగంచేసింది. తాళికట్టినవాడు తెగతెంపులు చేసుకొని వెళ్ళిపోతే ఒంటరిగా మిగిలిపోయింది. అన్నీ కోల్పోయి ఆఖరిక్షణంలో ఆమె భర్తకు ఎలా చేరువయింది?

**మునిపల్లె లక్ష్మీ రమణ కుమారి**



బస్సు రయ్యిన వచ్చి ఆగింది.

అందులోంచి ఒక వ్యక్తి దిగాడు.

అతనికి సుమారు ముప్పై రెండేళ్లు ఉంటాయి. నిర్లక్ష్యంగా పెరిగిన గడ్డం అతని విరక్తిని తెల్పుతోంది.

భుజాన సంచీ తప్ప యింకేసామానూలేదు. లోతుకిపోయి ఎర్రగా ఉన్నకళ్ళు ఎవరినో అన్వేషిస్తున్నట్లుగా ఉన్నాయి. వాటిలోంచి మిణుకు మిణుకు మంటున్నట్లు ఆశారేఖలు అపుడపుడూ తళుక్కుమంటున్నాయి.

చుట్టూ చూశాడతను.

అందమైన వాతావరణం. సాయంత్రం ఆరుగంటలైనట్లుంది. సహజ సౌందర్యంతో ప్రకృతి వెలుగులు విరజిమ్ముతోంది.

రోడ్డుకిరువేపులా పచ్చని పొలాలు. పొలాల పక్కగా కొబ్బరిచెట్లు. చెట్లలోంచి చల్లనిగాలి వీస్తుంటే హాయిగా ఉంది.

ఎటుచూసినా పచ్చదనం. కనువిందుచేసే ఆకుపచ్చదనం. కలతలు లేని మనసైతే ఆ వాతావరణానికి కళ కళలాడుతుంది.

కానీ అతని మొహంలో ఏ మార్పూలేదు.

అదే భావం, అదే దిగులు అదే విషాదం వ్యక్తపరిచే కళ్ళు.

నడక సాగిస్తున్నాడతను.

కాళ్ళు లాగుతున్నాయి.

కానీ అతను మాత్రం ఎక్కడా విశ్రాంతి తీసుకోవాలనే ఆలోచించడంలేదు. అలాగే నడుస్తున్నాడు.

ఎక్కడా గమ్యస్థానం కనబడే సూచనలు లేవు.

అయినా అతనిలోని అంతర్లీనమైన శక్తి ఏదో అతన్ని నడిపిస్తూనే ఉంది.

మూడురోడ్లు కూడలి చేరాడు.

ఎక్కడా నరసంచారం లేదు.

ఒక్కక్షణం ఆగి అన్నివేపులా చూశాడతను.

పక్కనున్న రోడ్డులోంచి ఒక ఒంటెద్దుబండి వస్తూ కనిపించింది. బండి వచ్చిందాకా ఆగాడతను.

బండిరాగానే చేయెత్తి ఆపాడు.

"స్వామి దయానందగారి ఆశ్రయం.."

అతని మొర పూర్తికానేలేదు.

"ఆశ్రమానికేనా"అన్నాడు బండి అతను.

మౌనంగా తల ఊగించాడు.

"వేమా అటే వెళ్తున్నాము. ఆశ్రయందాకా రాము కావి దారిలో దింపుతాము. అక్కడ్నుంచి తేలికే వెళ్ళటం. ఎక్కండి"

బండి అతను ఏవేవో చెప్తూఉన్నాడు.

ఏవీ అతని చెవుల్లో పడటంలేదు.

అతని పరధ్యానం గమనించిన బండి అతను యింక ఏమీ మాట్లాడలేదు.

రెండు రోడ్లు కూడలి వచ్చింది.

బండి ఆపి "ఈదారి గుండా వెళ్ళండి. కొంచెం నడిచాక కనబడుతుంది ఆశ్రమం. కొండమీద ఉంది. ఎక్కవచ్చు ఎక్కువ కష్టం ఉండదు" అన్నాడు బండి అతను.

మౌనంగా తలఊపి "థాంక్స్" అన్నాడు

బండి అతను చిత్రంగా చూసి బండిని వేగంగా నడిపించుకొంటూ పోయాడు.

బండి అతను చూపించిన దారిగుండా నడవసాగాడతను. కొద్దిదూరం నడిచాక ఆశ్రమం కనబడింది.

ఎత్తైన కొండమీద ఉంది ఆ ఆశ్రమం. కొండచుట్టూ ఏవేవో పూలతీగెలు. చెట్లూ దట్టంగా ఉన్నాయి. రంగురంగుల పూలు విరగబూసిన తీగెలు.


ఒకవైపు మెట్లు ఇంకోవేపు కార్లు వెళ్ళేదారి. మెట్లెక్కుతున్నాడతను.

కొండపైకి చేరేసరికి బాగా చీకటిపడిపోయింది.

ఆశ్రమం చేరి తేలికగా ఒక నిట్టూర్పువిడిచాడతను.

అక్కడ ఎదురైన ఒక వ్యక్తిని ఆపి "మీకు సుజాత అనీ.." అంటూ ఏదో అడగబోయాడు.

అతనిమాట పూర్తికాకుండానే ఆవ్యక్తి "మీకెవరైనా కావాలంటే ఆఫీసులో అడగండి.



వారు చెపుతారు. నాకూ ఇక్కడ అంతా కొత్తే'' అన్నాడు.
''ఆఫీసు ఎక్కడ''అన్నాడతను.
అతను గుర్తులు చెప్పాడు.
''మీరు స్వామీజీని కలిశారా?''
అతను అడ్డంగా తలఊపాడు.
ఒక్కక్షణం ఆలోచించాడు.
అన్నను ముందు స్వామివారిని కలుసుకుంటేనే మంచిది. వారికి తను వచ్చిన పని చెపితే అంతా ఆయనే చూసుకొంటారు. పరిస్థితి అర్థం చేసుకొని సుజాతకు నచ్చచెప్పే శక్తికూడా ఆయన కొక్కరికే ఉంది.
ఆ నిశ్చయానికి వచ్చాక ఆఫీసులోకి వెళ్లాడతను.
ఒక గుమస్తా కాబోలు కూర్చుని ఉన్నాడు.
అతను తన పరిచయం ఏమీ చేసుకోలేదు.
''స్వామివారిని కలుసుకోవాలంటే ఈ పూట కుదురునా'' ప్రశ్నించాడు.
''కొద్ది రోజుల్నుంచీ వారు మౌనవ్రతంలో ఉన్నారు. ఈరోజే ఆఖరి రోజు. రేపు మీతో తప్పక మాట్లాడ్తారు'' అన్నాడు ఆ గుమస్తా.
అతను తల పంకించాడు.
''ఈ రాత్రికి పడుకునేందుకు...''
''భోజనం చేశారా''
''లేదు''
''కుడిచేతి వేపుగా వెళ్ళండి ఈదారి వెంట. అక్కడ అతిధులకి భోజనశాల ఉంది. ఉచితమే. అక్కడ భోజనం చేయండి. పక్కనే కొన్ని గదులు ఉన్నాయి. అందులో ఎనిమిదో నెంబరు గది ఖాళీగానే ఉంది. ఈ రాత్రికి అక్కడ నిద్రపోవొచ్చు మీరు.'' అంటూ తాళం చెవి అందించాడు.
అతను తాళం చెవులు అందుకొన్నాడు.
''థాంక్‌యూ'' అన్నాడు.
భోజనశాలలో భోజనం చేసి గదిలోకి ప్రవేశించాడు. కిటికీ దగ్గర నిలుచుని చూస్తున్నాడు.
అతని కళ్ళు సుజాతను అన్వేషిస్తున్నాయి.
ఆశ్రమంలోని స్త్రీలు పురుషులు అన్ని వయసుల వాళ్ళూ కనిపిస్తున్నారు.
వాళ్ళలో సుజాత మాత్రం లేదు.
అతను చిన్నగా నవ్వుకొన్నాడు.
సుజాత యింకా మారలేదన్నమాట.

బయటకు రావటం నలుగురిలో తిరగటం ఆమెకి ఎపుడూ యిష్టం ఉండేదికాదు. పుస్తకాలు చదువుతూ, ఏదో పనిచేసుకొంటూ యింట్లో గడపడమే యిష్టపడేది.

సినిమాలూ, షికార్లూ అంటే అసలు గిట్టదు.

ఎందుకో యిల్లు వదిలి రావటం ఆమెకి యిష్టం ఉండేదికాదు. తన స్నేహితులు ఏమన్నా అంటే నవ్వుకొనేది.

“నాకేం అక్కర్లేదు. ప్రశాంతంగా నాలుగుగోడల మధ్యా నా జీవితం గడిచిపోతేచాలు. ఈ యిల్లే నాకు సర్వస్వం” అనేది. ఎంత చిత్రం. చివరికి ఆకోరిక ఆ చిన్నకోరిక కూడా తీరలేదు.

యిక్కడ ఈ ఆశ్రమంలో ఉన్నా ఆమె పద్ధతులు మారలేదన్నమాట.

మౌనంగా కూర్చుని తన కప్పగించిన పనేదో చేస్తూ కూర్చుని ఉంటుంది.

రాత్రి పదిగంటలు అయింది.

అతను నిట్టూర్చాడు.

కనీసం పొద్దున్న ఆరు గంటలన్నా కానిది తమ స్వామిగారిని కలిసేందుకు వీలులేదు.

అంటే యింకా ఎనిమిదిగంటల నిరీక్షణ.

నిద్రపోవాలి. బలవంతంగా నిద్రపోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

నిద్రపట్టడంలేదు.

యింకా ఎనిమిది గంటలు యిలాగే గడపాలి.

సుజాతను ఎపుడెపుడు కలుద్దామా అని ఉంది.

కళ్ళుమూసుకున్నా కళ్ళముందు ఏవేవో దృశ్యాలు గిరగిరా తిరుగుతున్నాయి.

ఆ దృశ్యాలన్నీ కలుపుతే పెద్ద కథ.

ఆ కథ....

* * *

సుజాత ఆత్రుతగా పేపర్ తిరగేస్తోంది.

## కోతలు



పొలంలో ఎదురయిన పాపయ్యతో

“మా చెరుకుపంట ఈ ఏడాది రికార్డు సృష్టించేలా ఎదిగింది. ఇక వరి పంటయితే చెప్పక్కర్లేదు. ఎకరా దిగుబడి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కుతుందనుకొంటాను. ఇక మిరపకాయ పంటలో ఒక్కో మొక్కకి లక్ష మిరపకాయలు కాసాయి” అన్నాడు వెంకయ్య.

“అయితే కోతలు మొదలెట్టేసారన్న మాట” అని వెళ్ళిపోయాడు పాపయ్య.

—ఎం. వీరేశ్వరరావు (అమలాపురం)

ఒకచోట ఆగిపోయాయాయి చూపులు.

ఎమ్మెస్సీలో సీట్ వచ్చిన వారి నెంబర్లున్నాయి.

కెమిస్ట్రీలో చూసింది సుజాత.

ఆమె కళ్ళు సంతోషంతో మెరిశాయి.

"నాకు సీట్ వచ్చింది" అనుకోకుండా గట్టిగా అరిచేసింది.

సహజంగా చాలా నెమ్మదస్థురాలైన సుజాత అలా గట్టిగా అరవటంతో ఇంట్లో వాళ్ళంతా వచ్చారు.

"నాకు కెమిస్ట్రీలో సీట్ వచ్చింది నాన్నగారూ" తండ్రితో చెప్పింది.

"కంగ్రాచులేషన్స్" సంతోషంగా అన్నారు ఆయన.

సుజాత తల్లి సుభద్రమ్మగారు సంతోషంగా వచ్చారు.

"సుజా సీట్ వచ్చిందా" అంటూ.

చెల్లెలు సునీత అన్నయ్య మోహన్ ఆమెను అభినందించారు.

అందరికీ సుజాతకు తప్పక సీట్ వస్తుందని తెలుసు. ముందే ఊహించినా నిజం అయేసరికి చాలా సంతోషంగా ఉంది.

సుజాతకు మనసునిండా సంతోషం. ఎన్నాళ్ళగానో కెమిస్ట్రీతో ఎం.ఎస్సీ చేయాలనీ తర్వాత రీసెర్చ్ చేయాలనీ ఎన్నెన్నో అనుకొంది. సీట్ రావాలని ఆమె ఎంతో కృషిచేసింది. పగలు రాత్రి అని భేదం లేకుండా ఆమె చదివిన చదువుకి ఫలితంగా బి.ఎస్.సి.లో అన్నిటిలోనూ డెబ్బై ఎనభై అలా వచ్చాయి మార్కులు. కాలేజీకంటే ఫస్ట్ వచ్చినా ఇంకా ఏదో భయమే. ఎం.ఎస్.సీలో సీట్ వస్తుందో రాదోనని. అందుకే సీట్‌రాగానే ఎంతో సంతోషంగా ఉంది.

విమలా, సుభద్రమ్మగారు కలిసి వంట పూర్తి చేశారు. ఆరోజు స్పెషల్‌గా గులాబ్‌జామ్, పులిహోర చేశారు.

డైనింగ్ టేబుల్ దగ్గర సుజాత తండ్రి జగన్నాథంగారు కూర్చుని ఉన్నారు.

ఆయనతో సాధారణంగా డైనింగ్ టేబుల్‌దగ్గర తప్ప యింకెప్పుడూ మాట్లాడే అవకాశం దొరకదు ఎవరికీ. ఎగ్జిక్యూటివ్ యింజనీరుగా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు ఆయన. ఎపుడూ బిజీగానే ఉంటారు. ఎపుడైనా తీరిక దొరికినా ఏదైనా వేదాంత చర్చలూ, ఉపన్యాసాలూ అంటే వెళ్ళిపోతారు. క్షణం తీరిక లేకుండా ఉంటారు.

ఆయనతో అపుడపుడూ సుజాతకూడా వెళుతుంది చర్చలకూ సభలకూ. భగవద్గీత ఉపన్యాసాలంటే తప్పకుండా వెళుతుంది. పిల్లలందరిలోనూ సుజాత అంటే జగన్నాథంగారికి ఒక విధమైన గౌరవం ఉందనే చెప్పాలి. తను కన్నకూతురే అయినా మంచిపేరు తెచ్చుకొంటూ సభలకు సమావేశాలకు తనతోపాటు హాజరవుతూ అందరిలోనూ "మంచి అమ్మాయి" "గుణవంతురాలు" "తెలివైనది" అని రకరకాల బిరుదులు సంపాదించుకొన్న

సుజాతంటే ఆయనకి ఎంతో ప్రేమ.

యింట్లో అంతా సుజాతను ప్రేమతో చూస్తారు. అదోమాదిరి గౌరవంతో భక్తితో చూస్తారు.

సుజాతకు కూడా యివన్నీ తెలుసు. వీటన్నిటికీ కారణం తన ప్రవర్తనేనని తెలుసు.

తనంటే యింట్లో వాళ్ళకున్న అభిప్రాయాన్ని నిలబెట్టుకోవాలని అనుకొంటుంది ఎప్పుడూ.

డైనింగ్ టేబుల్ దగ్గర వెయ్యి రూపాయలు తీసియిచ్చారు జగన్నాథంగారు.

'బాంక్‌కి వెళ్ళి తెచ్చాను సుజా నీ కోసమే. కావలసిన చీరెలు కొనుక్కో'' అన్నారు.

''యిపుడెందుకు నాన్నగారు ఏవో ఉన్నాయి చాలనే'' నసగబోయింది సుజాత.

''ఉన్నా మరేం ఫర్వాలేదు. యూనివర్శిటీకి కొత్తవికూడా కట్టుకెళ్ళవచ్చు'' అంది సునీత.

''సాయంత్రం నువ్వు సునీత వెళ్ళి కొనండి'' అన్నారు సుభద్రమ్మగారు.

తల ఆడించింది సుజాత.

ఆ సాయంత్రం సుజాత సునీత వెళ్ళారు షాపింగ్‌కి. సునీత మొత్తానికి వెయ్యిరూపాయలపైగా ఖర్చు పెట్టించింది.

లైట్‌గా ఉంటాయి అంటూ సిల్కు చీరెలు కొన్నది. ప్రాక్టికల్స్‌కి బాగుంటాయని కాటన్ చీరెలు కొన్నది.

రోజూ హాయిగా కట్టుకోవచ్చు అని నైలెక్స్ చీరెలు కొన్నది. బిల్లు అనుకున్న దానికంటే ఎక్కువే అయింది.

''నాన్నగారు వెయ్యి రూపాయల్లో తెచ్చుకొమన్నారు'' సుజాత సణిగింది.

''అమ్మపైన పడిన వేయమంది. ఇంకా యిచ్చారులే'' అంటూ డబ్బు తీసి యిచ్చేసింది

### విచిత్ర భారతం




భారత దేశంలో అత్యంత ఖర్చుతో కూడిన నగరం వారణాసి అని ఈ మధ్యనే జరిగిన సర్వేలో వెల్లడయింది.

మన దేశంలో అత్యంతపేదరికంతో బాధ పడ్తున్న రాష్ట్రం బీహార్!

మన దేశంలో కాలుష్యంలో అగ్రగామి నగరంగా ఢిల్లీ పెద్దపేరు తెచ్చుకొంటోంది!

అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే నగరంగా ఢిల్లీ మూడవ స్థానాన్ని ఆక్రమిస్తున్నట్లు ప్రపంచ ఆహార సంస్థ వెల్లడిస్తోంది.

—జూపిటర్

సునీత.

డబ్బు సుజాతకిస్తే ఏదో ఒక చీరె చాల్లే అని ఒక చీరెతో వస్తుందని సుభద్రమ్మగారు సునీతను తోడుగా పంపి ఇంకాస్త డబ్బు యిచ్చారు.

"నువ్వు కొనుక్కోవా" అంది సుజాత చెల్లెల్ని ప్రేమగాచూస్తూ

"ఊహు తర్వాత చూస్తాను" అంటూ బయటకు నడించింది సునీత పాకెట్స్ తీసుకొని. సుజాత కొన్ని పాకెట్స్ పట్టుకొని ఆమెతోపాటు బయటకు నడిచింది.

సునీత మెడిసిన్ చదువుతోంది. అందమైనది. అంతా సుజాత మాదిరే. కానీ సుజాతలో ఉన్న నెమ్మదితనం, కాస్త తక్కువపాళ్లలో సునీతలో.

చీరెలు చూసి యింట్లో బాగున్నాయన్నారందరూ. మర్నాడే జాకెట్లన్నీ టైలర్‌కిచ్చేసింది సునీత.

సుజాత ఫీజు కట్టింది.

రోజులు గడుస్తున్నాయి.

ఆ మర్నాటి నుంచి క్లాసులు మొదలు.

* * *

"వెళ్ళొస్తానమ్మా" సుజాత అందరికీ చెప్పి తండ్రితో పాటు బయటకు నడిచింది.

యింట్లో వాళ్ళంతా బయటకు వచ్చారు. అంతకుముందు రోజే ఎన్నో జాగ్రత్తలు చెప్పారు యింట్లో అంతా.

"ఒకవేళ ఎపుడన్నా హఠాత్తుగా బస్సులు కాన్సిల్ చేస్తే ఏం భయపడకు. వెంటనే మాకు ఫోన్‌చేస్తే ఎవరో ఒకరు కారు తీసుకొస్తారు. ఒకవేళ వీలుపడకపోతే నువ్వు ఆటో ఎక్కి యింటికి వచ్చెయ్యి" అని బస్సులు రాకపోతే ఏం చేయాలో చెప్పారు. కాలేజీలో చదివేటపుడు దగ్గరేకావటం చేత నడిచే వెళ్ళేది లేకుంటే రిక్షా వచ్చేది. అంతే గానీ ఎన్నడూ బస్‌ల కోసం వెయిట్ చేసింది లేదు. స్కూల్లో చదివేటపుడూ సునీతా సుజాతా కలిసి రోజూ రిక్షాలోనే వెళ్ళేవారు. మొదటిసారి దూరం బస్సులో ప్రయాణం చెయ్యాలి. అందుకే యింట్లో అంతా అన్ని జాగ్రత్తలు చెప్పారు.

"పాఠాలనీ అర్థం కాకపోతే మొహమాటపడకు. లెక్చెరర్లని అడగవచ్చు. నాకు అర్థం కాలేదంటే వాళ్ళు తప్పకుండా చెప్తారు. సీనియర్‌గా చదివి సందేహాలు అడిగేవాళ్ళని ఎవరైనా లైక్ చేస్తారు."

"పాకెట్‌మనీ కావాలంటే అడుగు నాకింత కావాలి అని. మధ్యాహ్నంపూట కాంటీన్లో ఏదన్నా కావాలంటే తిను. ఆకలితో ఉండకు. డబ్బుకి సందేహించకుండా ఎంత కావాలన్నా అడుగు."

"పుస్తకాలేమన్నా కావాలంటే చెప్పు. యిక్కడ దొరకని దేమన్నా ఉంటే మా ఫ్రెండ్స్‌కి రాసి ఎక్కడన్నా దొరికితే కొని పంపమంటాము."

రకరకాలుగా అభయం ఇచ్చారు.

ఇంట్లో అంతా తనమీద చూపే ప్రేమకి సుజాత ఎపుడూ ఉక్కిరి బిక్కిరి అవుతూ ఉంటుంది.

"వెళ్ళొస్తాను" అందరికీ చెప్పింది.

మొదటిరోజు కాబట్టి జగన్నాథంగారు కార్లో దింపటానికి నిశ్చయించుకొన్నారు.

కార్లో ఎక్కి కూర్చుని అందరి వంకా చూసి చేయి ఊపింది సుజాత.

అంతా చేయిఊపారు.

యూనివర్శిటీ దగ్గర దించారు జగన్నాథంగారు.


"క్లాసు తెలుసామ్మా. అక్కడిదాకా రావాలా" అన్నారు.

"తెలుసు నాన్నగారూ. వెళ్ళగలను" అంటూ బయల్దేరింది సుజాత తన క్లాసుకు చేరుకుంది.

ఇంకా నలుగురు అమ్మాయిలు ఉన్నారు. వాళ్ళని చూడగానె హమ్మయ్య అనిపించింది. అమ్మాయిలు ఉన్నారని తెలుసుగానీ వస్తారోరారో, వేరే ఏదన్నా ఇంట్రెస్టు ఉన్న సబ్జెక్టులో సీటువస్తే వెళ్ళిపోయారో అని సందేహించింది. అందుకే వాళ్ళని చూడగానే మనసు తేలిక పడింది. క్లాసులో మగపిల్లల సంఖ్యే ఎక్కువగా ఉంది.

ఆ రోజు క్లాసులు జరిగిపోయాయి.

యూనివర్శిటీలో క్లాసెస్ అటెండ్ అవుతుంటే సుజాతకు కొండెక్కినంత సంబరంగా



ఉంది. ఎన్నాళ్ళ తన కలలు పండాయి. ఎంతో కష్టంమీద లభించే విద్య తనకు లభిస్తోంది.

సుజాతకు దీనికంతా మూలకారకులైన తల్లితండ్రి జ్ఞాపకం వచ్చారు. నిజంగా వాళ్ళ సహకారం లేకుంటే తనకీ అవకాశం ఉండేదికాదు. తన ఫ్రెండ్సెంత మందో ఉన్నారు బాగా చదివేవాళ్ళు. కానీ ఏం లాభం? డిగ్రీకూడా చేతికి రాకుండా పెళ్ళి చేసేశారు వాళ్ళ యిళ్ళల్లో. తన తల్లితండ్రులు కూడా పెళ్ళి చేసేస్తామని పట్టుబడితే తనకీ ఆనందం చదువుకో గలుగుతున్నందుకు తృప్తి వుండేవి కావు. తనలోని విద్యాతృష్ణవంతా అణుచుకుని ఎవరైనా బాగా చదువుకొన్న వాళ్ళని చూస్తే విచారంగా... ఓహ్. అది తలచుకుంటే ఎలాగో ఉంటుంది. అలా అనుకున్నప్పుడల్లా మనసులోనే తల్లిదండ్రులకి ధన్యవాదాలు అర్పించుకుంటుంది సుజాత. నిజానికి సుజాత తండ్రి జగన్నాథంగారి ఆరోగ్యం అసలు మంచిదికాదు. ఆయనకి హార్ట్ట్రబుల్ ఉంది. దానికితోడు సుజాతకు వెనకే సునీత పెళ్ళికి సిద్ధంగా వుంది. వెంటనే సుజాతకు పెళ్ళిచేసి సునీత చదువు అయేలోపల ఏవో సంబంధం చూసి చదువు అవుతూనే పెళ్లి చేసేయమని సలహా ఇచ్చారు బంధువులందరూ. కానీ జగన్నాథంగారు వాటిని పట్టించుకోలేదు. సుజాతకు చదువంటే ఎంత ఇష్టమో ఆయనకు తెలుసు. బలవంతంగా చదువు ఆపి పెళ్ళి చేయడం ఆయనకు న్యాయం కాదనిపించింది. దానికితోడు సుభద్రమ్మగారి సహకారం కూడా లభించడంతో సుజాత చదువు గురించి ఇంకెవరూ ఏమీ మాట్లాడలేకపోయారు.

* * *

రోజులు గడుస్తున్నాయి.

సుజాతకు క్లాసులో ఎవరితోనూ ఎక్కువ స్నేహం ఏర్పడలేదు. సహజంగా ఎక్కువ మాట్లాడే తత్వంకాదు. దానితో స్నేహితులు తక్కువ. అంతేగాక ఆమె స్వభావం అర్థం చేసుకుని కొందరు గర్విష్టిగా వర్ణించారు కూడా.

ఒకరోజు క్లాసెస్ పూర్తి అయ్యాక లైబ్రరీకి వెళ్ళింది సుజాత.

పుస్తకాలు చదువుతూ పాయింట్స్ రాసుకుంటూ కూర్చుంది.

బస్‌స్టాండ్‌కి రాగానే ఆశ్చర్యం వేసింది.

ఒక్క బస్‌లేదు సరికదా మనుషులుకూడా ఎవరూలేరు.

బస్ స్ట్రయికట.

గుండె పట్టుకున్నట్లయింది సుజాత.

యిపుడు యింటికెలాగ పోవటం?

దగ్గరలో ఫోన్ ఎక్కడుందో!

ఫోన్‌చేసినా ఎవరు వస్తారు. కారు యింట్లో ఉందోలేదో. ఒకవేళ కారు ఉన్నా ఎవరైనా



ఉన్నారో లేదో వచ్చేందుకు.

మరీ పరిసరాలు కూడా పట్టించుకోకుండా చదవటంలో మునిగిపోయింది తను.

పైగా లైబ్రరీలో ఎవరూ ఆ మాట అనుకున్నట్లుకూడా లేదు.

అందుకే తన కెంతమాత్రం తెలియలేదు బమ్మల్లేవవి.

ఇపుడేం చేయాలి?

కాలినడకే యిక తప్పనిసరి.

ఎక్కడి యూనివర్శిటీ. ఎక్కడి హిమాయత్‌నగర్.

మెల్లగా నడుస్తోంది సుజాత.

ఇంతలో ఒక కారు దూసుకొని వచ్చి ఆగింది.

ఎవరా అని చూసింది సుజాత. కారు ముందు సీట్లో కూర్చుని ఉన్నాడు తన క్లాస్‌మేట్ విజయేంద్ర.

చిరునవ్వుతో "హలో" అని "ఎక్కండి" అన్నాడు.

"ఫర్వాలేదండీ. నడిచి వెళ్ళిపోతాను" అన్నది సుజాత. అతను నవ్వాడు.

"హిమాయత్‌నగర్ కదా మీ యిల్లు. అంతదాకా నడిచే వెళ్తారా" అన్నాడు.

సుజాతకేం చేయాలో తోచలేదు. క్లాస్‌మేట్‌గానీ తను అతనితో ఎప్పుడూ సరిగా మాట్లాడిందేలేదు.

"మీ యింటి దగ్గర డ్రాప్ చేస్తాను" అతను బాక్‌డోర్ తెరిచాడు కారుదిగి.

ఇంకతప్పలేదు. ఎక్కికూర్చుంది సుజాత.

"ఇంకెవరన్నా మనవాళ్ళు ఉన్నారా" చుట్టూ చూశాడతను.

"ఎవరూలేరు. మనమే ఉన్నట్లున్నాం" అతను కారు స్టార్ట్ చేశాడు.

కారు కదిలింది.

సుజాత మౌనంగా కూర్చుంది వెనకసీట్లో.

హిమాయత్‌నగర్ వచ్చింది.

"ఎటు వెళ్ళాలి" అన్నాడతను.

సుజాత చెప్పింది.

కారువచ్చి యింటి ముందు ఆగింది.

"లోపలకు రండి" అంది సుజాత.

"ఫర్వాలేదు. వెళ్ళిపోతాను"

"లోపలకు రండి. నాన్నగారిని పరిచయంచేస్తాను" అతను కారు దిగాడు.

లోపలకు వచ్చారిద్దరూ. జగన్నాథంగారు బైట వరండాలోనే ఉన్నారు. అపుడే ఆఫీసునుండి వచ్చారు ఆయన. సుజాత కోసం కారు తీసుకొని బయల్దేరుతున్నారు.

"వచ్చేశావామ్మా. ఎలా వస్తావో అని గాభరా పడుతున్నాం" అన్నారు విజయేంద్రకేసి చూశారు ఎవరన్నట్లుగా.

"ఈయన మా క్లాస్‌మేట్ విజయేంద్ర నాన్నగారు".

విజయేంద్ర వినయంగా నమస్కరించాడు.

ప్రతి నమస్కారం చేశారు జగన్నాథంగారు.

"లైబ్రరీలో లేట్ అయింది నాన్నగారూ, ఈయన కార్లో సమయానికి దింపకపోతే చాలా కష్టం అయేది"

"అలాగా థాంక్స్‌బాబూ" అన్నారాయన.

"దానికేముందండీ" అన్నాడు విజయేంద్ర.

"కూర్చోబాబూ" అని సుజాతతో కాఫీ తెమ్మన్నారు.

"ఇపుడేం వద్దండీ" మొహమాటంగా అన్నాడు విజయేంద్ర.

సుజాత వినిపించుకోకుండా లోపలికి వెళ్ళింది.

పది నిమిషాల్లో కాఫీ వచ్చింది.

కాఫీ తాగుతున్నారు.

విజయేంద్ర యిల్లు పరికించి చూశాడు.

అధునాతనంగా కట్టిన మేడ.

చక్కటి డిజైన్‌లో ఉంది యిల్లు.

గేటు దగ్గర్నుంచి వరండాదాకా దారికి రెండువేపులా పరిచిన పూలచెట్లు, ఒకపక్కగా కారుషెడ్.

బాల్కనీ మీదనుంచి పాకిన సన్నజాజితీగె.

హాల్లో అమర్చిన సామానులోనూ, వాటిని సర్దిన తీరులోనూ యింటి యజమాని అభిరుచి తెలుస్తోంది.

మేడమీద రెండుగదులు మాత్రమే ఉన్నట్లున్నాయి.

చక్కని పెయింట్‌తో మెరుస్తున్న యిల్లు, ఫియట్‌కారు చూసి విజయేంద్ర ఆశ్చర్యపోయాడు.

అతని అభిప్రాయం సుజాత మామూలు మధ్యతరగతి కుటుంబానికి చెందినదై ఉంటుందని.

అప్రయత్నంగా సుజాత వైపుచూశాడు.



వరం

"డాక్టరుగారూ డాక్టరుగారూ మావారి విషయం చూస్తే నాకు భయంగా వుంది. నేనేం మాట్లాడినా అసలేం విననట్టు వులుక్కుండా పలుక్కుండా ఉంటున్నారు. అదేం జబ్బో నాకేం అర్థం కావడంలేదు" కంగారుగా అంది సావిత్రి.

"అది జబ్బుకాదమ్మా. భగవంతుడిచ్చిన వరం. మీరేం కంగారు పడకండి" తాపీగా అన్నాడు డాక్టరు.

—ఎ. అంజనీదేవి (ఒంగోలు)

లేత నీలిరంగు వాయిల్ చీరె. అదే రంగుజాకెట్. వదులుగా వేసిన జడ మోకాళ్ళ వంటు తోంది.

నుదుట పెద్దగా కన్పించే గుండ్రని తిలకం సంధ్యాకాలపు సూర్యబింబాన్ని గుర్తుకు తెస్తోంది.

మెడలోసన్నని గొలుసు, ఒకచేతికి వాచీ. ఇంకోక చేతికి రెండు బంగారు గాజులు. చెవులకు ఒంటిముత్యం దుద్దులు.

సంభాషణలోనూ, అలంకారంలోనూ ఎక్కడా ఆడంబరం కనిపించదు.

ఆమెకన్నా ఎంతో కింద స్థాయిలో ఉన్నవాళ్ళుకూడా ఆమెకన్నా భేషజంగా ఉంటారు.

అందుకే ఆమె అతి సామాన్య కుటుంబానికి చెంది ఉంటుందేమో అనుకున్నాడు.

తీరా ఆమె యిల్లు, కుటుంబం అన్నీ చూస్తేను ఆమె ఆర్థికంగానూ యితరాత్రను ఉన్నతురాలని తెలిసింది.

అతనికి తెలియకుండానే అతని మనసులో సుజాతపై గౌరవభావం ఏర్పడింది.

వెళ్ళొస్తానని శలవు తీసుకున్నాడు.

యింటికి వచ్చి భోజనం చేసి పడుకున్నాక కూడా ఎందుకో తెలియకుండానే సుజాత గురించి ఆలోచనలు వెంటాడాయి.

* * *

ఆ సంవత్సరం పూర్తయేసరికి సుజాత విజయేంద్రల మధ్య మంచి స్నేహం ఏర్పడింది.

నోట్సులకోసం పుస్తకాలకోసం సుజాత యింటికి వస్తాడు విజయేంద్ర.

సుజాత కుటుంబ సభ్యులంతా అతనికి మంచి స్నేహితులయ్యారు.

జగన్నాథంగారికి పురాణగ్రంథాలు, పురాణోపన్యాసాలు అంటే మహాప్రీతి. విజయేంద్ర ఆయనకి పు స్తకాలు తెచ్చిపెట్టేవాడు. ఎవరిదన్నా ఉపన్యాసాలు ఉంటే ఆ కాసెట్స్ తెచ్చి యిస్తుంటాడు:

సుజాతకు తన దగ్గర ఉన్న బుక్సన్నీ యిస్తాడు. గంటల తరబడి కష్టపడి రాసిన నోట్సు లన్నీ యిచ్చేస్తాడు.

సుజాతకు అతన్ని చూడకపోతే ఆ రోజంతా లోటుగా తోస్తోంది.

క్లాసులో ఎంతమందున్నా ఎక్కువ స్నేహం లేదు ఎవరితోటి. ఒక్క విజయ్‌తో మాత్రమే యిలా సంభాషణలూ, నోట్సులు ఎక్స్ఛేంజ్ చేసుకోవటమూను.

ఒక్కరోజు అతను కాలేజ్‌కి రాకపోతే తోచదు. మహాబోర్‌గా అనిపిస్తుంది. ఎపుడెపుడు యింటికి వెళ్ళిపోదామా అనిపిస్తుంది. విజయ్ పరిస్థితికూడా అలాగే ఉంది.

ఎవరికి వారు ఏ మాత్రం బయట పడటంలేదు.

గుట్టుగా ఉంటున్నారు. ఒకర్నొకరు మన్నించుకొంటున్నారు. వాళ్ళ సంభాషణలో బహువచన ప్రయోగమే చోటుచేసుకొంటోంది.

యిలా ఉండగానే రెండు సంవత్సరాలు గడిచిపోయాయి.

యిద్దరికీ తెలుసు ఒకరంటే ఒకరికి ప్రాణం అని. ప్రేమ అని.

ఫైనల్ యియర్ చివరి పరీక్షలు అయాయి.

స్టూడెంట్సంతా కలసి చిన్నపార్టీ మాదిరి చేసుకొంటున్నారు.

ఎవరికి వాళ్ళకి కొద్దిగా దిగులుగా ఉంది.

ఆడిపాడే విద్యార్థి జీవితం గడిచిపోయింది.

యిక జీవితంలోకి అడుగుపెట్టాలి.

ఉద్యోగాల కోసం పెళ్ళికోసం పాట్లుపడాలి.

విడిపోతున్నామని కొద్దిగా బాధగా ఉన్నా కలసి ఉన్న ఆ కాసేపు ఆనందంగా గడపాలని అంతా ఛలోక్తులు విసురుకుంటూ హాపీగా ఉన్నారు.

సుజాత విజయ్ ఒకపక్కగా కూర్చుని స్వీట్ తింటున్నారు.

ఈ రెండేళ్ళలోను సుజాత తెలివికలదనీ బాగా చదువుతుందనీ అందరికీ తెలిసిపోయింది.

క్లాసులో ప్రతిసారీ ఫస్ట్‌రాంక్ సుజాతదే. జయ సుజాత పక్కన వచ్చి కూర్చుంది.

అరటిపండు వొలుస్తూ అంది.

"ఈసారి సుజాతదే గోల్డ్‌మెడల్"

"అవునవును" అంతా అన్నారు.

క్లాసులో బలరాం అనే అతను ఉన్నాడు. కొద్దిగా అసూయాపరుడని ప్రశస్తి.

అతను పెద్దగా నవ్వుతూ అరిచాడు.

"సుజాతగారికి గోల్డ్‌మెడల్ వస్తే విజయ్‌కి పార్టీ ఉందన్నమాట"



## వంటింటి చిట్కాలు

మీ ఇంట్లో ప్రెషర్ కుక్కర్ లేదు, అయినా పప్పు త్వరగా ఉడకాలి! అలాటి సందర్భంలో ఉడుకుతున్న పప్పులో ఓ అరస్పూను 'మావె' వెయ్యండి— మీ కోరిక తీరుతుంది.

ఎలా వండినా... అన్నం మెత్త పడ్తోందా? అయితే అన్నం ఉడుతున్నప్పుడు ఓ స్పూన్ పెరుగుకలపండి— అన్నం చక్కగా పొడిపొడిగా ఉంటుంది.

సాంబార్‌లో కానీ పప్పులో కానీ ఉప్పు ఎక్కువైతే వాలుగైదు బంగాళా దుంప ముక్కలు వేసి మళ్ళీ ఉడికించండి!

—జూపిటర్

సుజాత మొహం ఎర్రబడింది.

"అంటే మీ ఉద్దేశం" ఎంత వద్దనుకొన్నా పదునుగానే వచ్చింది కంఠం.

"కోపం తెచ్చుకోకండి సుజాతగారూ పాపం మీకు విజయ్ ఎన్ని నోట్స్ఇచ్చాడు. మీకు ఫస్ట్‌రాంక్ రావాలని పాపం తను చదివాడో లేదోగానీ అన్నీ మీకే యిచ్చాడు"

సుజాత మొహం ఇంకాస్త ఎర్రబడ్డది.

చాలా అవమానంగా అనిపించింది.

విజయ్ పుస్తకాలు యివ్వనంత మాత్రాన తనకు ఫస్ట్‌రాంక్ రాదా.

తనకు ఎవరు ఏ బుక్స్ యిచ్చారని బి.ఎస్‌సిలో కాలేజ్ ఫస్ట్ వచ్చింది.

మనసులోనే బాధపడింది. పైకి మాత్రం ఏమీ అనలేదు.

ఆమెది స్వతహాగా ఎవరితోనూ వాదించే తత్వం కాదు. అందులోనూ చివరిరోజు అనవ సరంగా వాదించి పోట్లాడి కార్యక్రమం రసాభాస చేసినట్లు ఉంటుంది.

అందుకని ఏమీ మాట్లాకుండా మనసులో బాధపడ్డా ఏమీ అనుకోనట్లే ప్రవర్తించింది.

ఆ సంభాషణ సుజాత మౌనంతో అప్పటికి ముగిసిపోయింది.

అంతా పిక్చర్స్ గురించి మిగతా విశేషాల గురించి మాట్లాడుకొంటున్నారు.

సుజాత విజయ్ కేసి చూసింది.

అతను తన వేపే చూస్తున్నాడు.

చిరుకోపంతో చిరాగ్గా చూసింది.

అతను నవ్వుతూ తల తిప్పేసుకున్నాడు.

సుజాతకు చాలాకోపంగా ఉంది.

విజయ్ బలరాం మాటలకు సంతోషించినట్లున్నాడు.

అసలు తను అతనికింత చనువు యివ్వకుండా ఉండాల్సింది. అపుడు అతని నోట్సులు తీసుకోవటం అనవసరంగా మాటలు పడటం ఉండేదికాదు.

పోనీలే ఏదో అయిపోయింది. ఇలాటి చిన్నచిన్న విషయాలకు అనవసరంగా అతిగా ఆలోచించటం దేనికి.

మొత్తానికి పార్టీ బాగానే అయింది.

ఒకరినొకరు బెస్ట్ విషస్ చెప్పుకొన్నారు.

లెక్చరర్స్ అందర్నీ ఆశీర్వదించారు.

* * *

బస్‌స్టాప్‌లో నిల్చుని ఉంది సుజాత.

ఎదురుగా లేత ఆకుపచ్చరంగు కారువస్తోంది.

విజయేంద్ర కారు నడుపుతున్నాడు.

కారుపక్కగా తెచ్చి ఆపాడు.

"ఎక్కడికండీ" అన్నాడు నవ్వుతూ.

"వసుంధర పుస్తకాలిచ్చేద్దామని.." అన్నది సుజాత.

"నేనుకూడా వాళ్ళింటికే వెళ్తున్నాను"

"అలాగా"

"మీరూ అటేగా ఎక్కండి"

చిరుకోపంతో చూసింది సుజాత.

"నేను ముందు మా ఆంటీ వాళ్ళింటికి వెళ్ళాలండి అక్కడ్నుంచి వెళ్తాను"

"పోనీ అక్కడే దింపుతాను"

"నేను బస్‌లో వెళ్ళగలనండీ. నాకేం కారెక్కి తిరగాలని లేదు. మీరు వెళ్ళండి"

"ఎంతమాట అన్నారండీ. మీకు కారెక్కి తిరగాలని ఉంటే మీ కారే ఎక్కి తిరుగుతారు. యిలా ఊళ్ళో వాళ్ళ కారు ఎక్కుతారా. నిలబడి వెయిట్ చేస్తున్నారు కదా తొందరగా చేరుకోగలరని అన్నాను" అతని మాటల్లో చిరుహాస్యం ఉంది.


సుజాత ఏం మాట్లాడకుండా నిల్చుంది.

రెండు నిమిషాలు గడిచాయి.

విజయేంద్ర కారు పోనీయలేదు.

సుజాత మొహంకేసే చూస్తున్నాడు.

బస్‌స్టాప్‌లో అంతా వింతగా చూస్తున్నారు.



సుజాతకు విసుగనిపించింది. యిక్కడేమన్నా అసహ్యంగా ఉంటుంది.
అతన్ని వదిలించుకోవాలంటే కారెక్కి తప్పదు.
మారు మాట్లాడకుండా కారెక్కి కూర్చుంది. కారు స్టార్ట్ చేశాడు విజయ్.
"అమ్మగారు ఎటు పోనీయమంటారు" అన్నాడు వినయంగా.
సుజాతకు నవ్వు వచ్చింది.
కనపడనీయకుండా పెదవులు బిగించుకొంది.
"నవ్వొస్తే వెంటనే నవ్వేయాలిట. అపుడే ఆరోగ్యానికి మంచిది"
ఆపుకోకుండా నవ్వేసింది సుజాత.

అతను కూడా నవ్వేశాడు.
"అమ్మయ్య. మీకు కోపం పోయిందన్నమాట" అన్నాడు.
సుజాత పెదవులు బిగించుకొంది.
యితని సమక్షంలో తనకేమౌతుంది.
అందరితోను రిజర్వ్‌డ్‌గా ఉంటుంది.
కానీ...కానీ యితన్ని చూడగానే ఆ సీరియస్‌నెస్ అంతా ఎగిరిపోతుంది.
అతన్ని ఏడిపించాలనిపిస్తుంది. వెక్కిరించాలనిపించుతుంది.
అతన్ని వెక్కిరించి వెటకారం చేస్తుంటే చిరుకోపంతో మూతి ముడుచుకుంటాడు అతను. అతను బుగమూతితో తెచ్చిపెట్టుకొన్న కోపంతో చూస్తుంటే ఎంతో బాగుంటుంది.
అంతలోనే ఆ కోపాన్ని మరిచి నవ్వేస్తాడు. ఆ నవ్వులో తను కూడా శృతి కలుపుతుంటే..
ఓహ్. ఎంత మరపురాని మధురక్షణాలు. యిది..యిది ప్రేమా.
సుజాత గుండె ఝల్లుమంది.
చివుక్కున తల ఎత్తి అతని మొహంలోకి చూసింది.
అతను తననే చూస్తున్నాడు.
గలగలా నవ్వేసింది.
"రోడ్డు నా మొహనలేదు. అదీగాక నేనింకా యిన్సూర్ చేయించలేదు" అన్నది.
విజయేంద్రకూడా నవ్వేశాడు.
"మిమ్మల్ని క్షేమంగా దింపే బాధ్యతనాది" అన్నాడు. కారు వచ్చి ఒక ఐస్‌క్రీమ్ సెంటర్ ముందాగింది.
"యిదేంటి యిక్కడ ఆపారు"
"అసలే వేడివేడిగా ఉన్నారు. కాస్త కూల్‌డ్రింక్‌తాగి చల్లబడుతారని" అన్నాడతను నవ్వుతూ. సుజాత సందేహంతో నిలబడింది.

పరాయి మగవాడితో ఇలాగ హోటల్స్‌కి వెళ్ళటం ఏం బాగుంటుంది. ఎవరైనా చూస్తే?

తనను ఎవరు ఏమనుకొన్నా ఫర్వాలేదు. కానీ తన మూలంగా తన తల్లితండ్రులు మాత్రం బాధపడకూడదు. అయ్యో సుజాత మూలంగా ఇలాంటి మాట పడాల్సివచ్చిందే అని తన తల్లితండ్రులు అనుకునే సమయం రాకూడదు.

ఆలోచిస్తూ అలాగే నిల్చుంది.

"ఏంటి ఆలోచిస్తున్నారు పదండి" అన్నాడు విజయేంద్ర ముందు నడుస్తూ.

అతన్ని అప్రయత్నంగా అనుసరించింది సుజాత.

ఎందుకో అతని మాటకు ఎదురు చెప్పలేదు మనసు.

యిద్దరూ లోపలకూర్చున్నారు.

మెనూకార్డు అందిస్తూ "చెప్పండి ఏం తీసుకుంటారో" అన్నాడు.

"ఏమైనా తీసుకుంటాను బిల్లు తప్ప" నవ్వింది.

విజయ్ గలగలా నవ్వేశాడు.

"బాగుంది. మిమ్మల్ని తీసుక వచ్చి మీ చేత బిల్లు పెట్టిస్తానా. చెప్పండి ఏం తీసుకుందామో"

కార్డు చూపించింది సుజాత.

"టూ పైనాపిల్ సన్‌డే" అంది.

"ఫైవ్ సెలక్షన్"

అతనేమన్నా ఎంతో యిదిగా ఉంటుంది సుజాతకు. ఏ మాట మాట్లాడినా ఎంతో చక్కగా మాట్లాడినట్లు అనిపిస్తుంది.

అతనివైపు చూస్తున్న అతని మాటలు వింటున్నా అతనితో కలసి నడుస్తున్నా అసలు అతని సమక్షంలోనే అంతులేని ఆనందం. అతను ఎదురుగా లేకుంటే ఎంతో గంభీరంగా ఉంటుంది.

అతని సమక్షంలో తన సీరియస్‌నెస్ అంతా ఎక్కడికి పోతుందో తెలీదు.

### అరెస్టు



రాత్రిపూట వీధిలో తిరుగుతున్న గంగుల్ని అరెస్టు చేసారు పోలీసులు.

"నన్నెందుకు అరెస్టుచేసారు" అడిగాడు గంగులు.

"నిన్నరాత్రి కిరాణా దుకాణంలో దొంగతనం చేసినందుకు" చెప్పారు పోలీసులు.

"ఓస్ అందుకా మొన్న హత్య, బ్యాంక్ లూటీ వరుసగా చేసినందుకేమోననుకుని భయపడి వచ్చాను. పదండి" అన్నాడు గంగులు.

—పి.వి. నరసింహదాసు విజయనగరం)

అసలు రహస్యమంతా సృష్టిలోనే ఉంది.

లేకపోతే గంభీరంగా సాగిపోయే నది కడలిలో కలిసేటపుడు ఎందుకు ఉప్పొంగిపోతుంది. తన నెమ్మది తనాన్ని మరిచి ఉరకలు వేస్తూంది సాగరునిలో ఐక్యం కావాలని.

దినమంతా ఒకే ఒరవడిలో పడిలేచే కడలి కెరటాలు చంద్రోదయంతోనే అలా ఎగిసిఎగిసి పడతాయెందుకు.

కలువ చంద్రుని చూడగానే వికసిస్తుంది. కమలు సూర్యునిచూసి విచ్చుకొంటుంది.

ఎందుకంటే ఎవరు చెప్పగలరు.

ఏది ఏమయినా ఒకటిమాత్రం నిజం.

అది మనసయిన మనిషితోనే మనసుని ఆనందమని.

"ఏంటి ఆలోచిస్తున్నారు"

ఉలిక్కిపడింది సుజాత.

"ఏమీలేదు" చిరునవ్వునవ్వి ఐస్క్రీమ్ కప్పు ముందుకి లాక్కుంది.

విజయ్ సుజాతను పరీక్షగా చూశాడు. ఎగ్జామ్స్ అయి తీరిగ్గా ఉన్నందుకు కాబోలు ఆరోజు సుజాత కొంచెం శ్రద్ధగానే అలంకరించుకొంది. పచ్చని మొహంలోని విశాల నయనాలు కాటుకతో నల్లగా మెరుస్తున్నాయి. చిగురుటాకులాంటి మృదువైన శరీరం. సూదైన ముక్కు. పన్నని ఎర్రని పెదిమెలు.

లేత గులాబీరంగు కాశ్మీర్ సిల్కు చీరె జాకెట్టు ఆమెకి ఎంతో చక్కగా అమిరాయి. చిత్రకారుడు ప్రత్యేక శ్రద్ధతో గీసిన బొమ్మలాగా ఉన్నది.

"పాపం చాలా కష్టపడుండాలి"

సుజాత కళ్ళెత్తి ప్రశ్నార్థకంగా చూసింది.

"బ్రహ్మదేవుడు మిమ్మల్ని సృష్టించడానికి"

సుజాత కళ్ళు వాల్చుకొంది.

"నిజం సుజాత మీరు చాలా బాగుంటారు"

సుజాత బుగ్గలు ఎరుపెక్కాయి.

"నన్ను మీరు అని మన్నించకండి" చిరుసిగ్గుతో అంది.

"మరేమనమంటారు"

"సుజా అనండి చాలు"

విజయ్ నమ్మలేనట్లు ఆనందంగా ఆశ్చర్యంగా చూశాడు

"థాంక్యూ" అన్నాడు

అతని కళ్ళలోకి చూసింది.

ఆ కళ్ళు తననే ప్రేమగా చూస్తున్నాయి.



చటుక్కున కళ్ళు వాల్చుకొంది.

''ఒక మాట చెప్పనా సుజాతా. బలరాం అలా అనగానే నాకూ చాలాకోపం వచ్చింది. కానీ ఏమన్నా అంటే అనవసరంగా ఆ విషయానికి యింపార్టెన్స్ యిచ్చినట్లుంటుందని ఊరుకున్నాను. అంతేగానీ మీకింత కోపం వస్తుందనుకోలేదు''

"ఫర్వాలేదు. నేనేం అనుకోలేదు"

రెస్టారెంట్ బయటకు వచ్చాక "వెళదామా వసుంధరగారింటికి" అన్నాడు విజయ్.

"యింక ఎక్కడికీ వద్దు యిపుడు" అంది సుజాత.

నిజంగానే ఎటూ వెళదామనిలేదు.

మనసంతా ఏదో తేలిగ్గా హాయిగా ఉంది. తృప్తిగా ఉంది. గుండెనిండా ప్రేమనిండినపుడు ప్రేమించిన వ్యక్తిని ఎదుటే చూస్తున్నపుడు కలిగే ఆనందం, తృప్తి అనిర్వచనీయమైనదంటారు.

యింక ఎక్కడికైనా వెళితే ఈ మూడ్ అంతా పాడైపోతుందేమో అనిపించింది.

వద్దు. ఈ హాయి యిలాగే ఉండాలి.

"మీ యింటి దగ్గర దింపమంటారా"

"అదుగో మళ్ళీ మీరు అంటున్నారు"

"మరేమన మంటారు?"

"సుజా అనండి చాలు"

అతను ఆశ్చర్యంగా, ఆనందంగా చూశాడు. అతనికళ్ళలో సంతోషం తొణికిసలాడింది.

"సుజాతా" అన్నాడు.

అతని కళ్ళలోకి మైమరచి చూస్తూ నిలబడింది సుజాత. కొద్ది నిమిషాలు గడిచాయి.

పక్కన కారు హారన్ వినిపించింది.

ఆ కార్లో ఉన్నతను విసుగ్గా చూస్తున్నాడు.

ఉలిక్కిపడ్డారిద్దరూ. అంతవరకు అలాగే నిలబడిపోయిన వాళ్ళల్లా సర్దుకొని నిల్చున్నారు.

కారు తలుపు తీశాడు విజయ్.

స్టీరింగ్ ముందు కూర్చున్నాడు.

సుజాత వెనుక సీట్లో కూర్చుంది.

కారు వెడుతోంది నున్నని రోడ్డుమీద.

"మీయింటికి తీసుకు వెళ్ళనా"

"వద్దు బస్‌స్టాప్‌లోనే దిగిపోతాను"

"సరే"

బస్‌స్టాప్ వచ్చింది.

దిగిపోతూ "వెళ్తాను బై" అంది సుజాత.

"బై మళ్ళీ ఎపుడు కలుస్తారు"

"మీరే చెప్పండి"

"ఎల్లుండి సాయంకాలం. యిక్కడే బస్‌స్టాప్‌లోనే నిల్చోండి నాలుగు గంటలకు"

"ఓ.కే"

కారు దాటి వెళ్లిపోయింది.
కారు వెళ్ళిపోగానే సుజాతకు తనమీద తనకే కోపం వచ్చింది.
ఏంచేసింది తను.
ఒక పరాయి మగవాడితో అనవసరంగా హోటల్స్‌కి వెళ్ళటం ఎందుకు. అతను మళ్ళీ కలుస్తానంటే ఏదో ఒకటి చెప్పి తప్పించుకోక ఓ.కే అనటం ఎందుకు?
అసలు ఏమిటి విజయ్‌లో ప్రత్యేకత?
ఎందుకు తను అతనంటే అంత యిదిగా ఫీల్ అవుతుంది.
అతను మాట్లాడుతుంటే వినాలని అనిపిస్తుంది.
అతను ఎదురుగా ఉంటే చాలని అనిపిస్తుంది.
అతను కేసి చూస్తుంటే గంటలు గడిచినా తెలియదు.
అయినా అతనంత చనువు తీసుకుంటాడెందుకు?
వేరేవాళ్ళతో మాట్లాడుతుంటే గంభీరంగా మాట్లాడుతాడు. తన దగ్గర కొచ్చేసరికి నవ్వుకుంటూ కబుర్లు చెప్తాడు.
అయినా అతన్ననుకొని ఏంలాభం. ఆడదై ఉండి తనే యింత చనువు యిస్తోంది. తనే అతనికా అవకాశం యిస్తోంది. యిందాక అతను మళ్ళీ ఎపుడు కలుద్దాం అంటే సారీ వాకిలా స్నేహాలు యిష్టంలే ఉండవని చెప్తే అతనేం చేయగలడు.
ఈ స్నేహాన్ని మానుకోవాలి.
ఎల్లుండి మాత్రం అసలు యిటుకేసి రాకూడదు.
అంతే.

## హాస్ కష్టాలు



ఓటో హాన్ బ్రిటన్‌కు చెందిన ఓ ప్రముఖ రసాయనశాస్త్ర సైంటిస్ట్! ఆయన లండన్ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేస్తున్న సమయంలో రేడియో థోరియంను పరీక్షించటానికి ఓ టేబుల్ కావలసి వచ్చింది. ఆ విశ్వవిద్యాలయానికి చెందిన కెమికల్ ఇన్‌స్టిట్యూట్ అంతా వెతికినా ఆయనకు ఖాళీగా టేబుల్ కన్పించలేదు.
చివరకు ప్రతిరోజూ అతికష్టంమీద రాత్రిపూట పది గంటలనుంచి పదకొండున్నర వరకూ ఒక టేబుల్ మీద ఎవరూ పని చేయుటం లేదని తెలుసుకుని దాని మీద తన ఎలక్ట్రానిక్ మైక్రో స్కోప్ ఉంచి రోజుకు గంటన్నర పరిశోధనలతోనే తృప్తి పడేవాడట! ఆ రోజుల్లో అంతటి ఆసక్తితో వారు పరిశోధనలు చేయబట్టే ఈ నాడు మనం ఆధునిక జీవనాన్ని సర్వ సౌఖ్యాలతో గడపగల్గుతున్నాం!
—జూపిటర్

కానీ ఆ రోజు సాయంకాలం వద్దనుకున్నా సుజాత మనసు ఆగలేదు.

అతన్ని రమ్మని చెప్పి తను రాకుండా ఉంటే ఏం బావుంటుంది. మాట నిలకడలేని మనిషి అని అనుకోవచ్చు తన గురించి. ఒకసారి బస్‌స్టాండ్‌లోనే నిలబడి తనకు యిలా ఊరికే స్నేహాలు పెంచుకోవటం యిష్టం ఉండదని చెప్పి శలవు తీసుకుంటేసరి.

అవును అలా చేస్తే బాగుంటుంది.

మూడుమున్నావు కల్లా ముస్తాబు ముగించుకొంది. వద్దు వద్దనుకొంటూనే చాలా శ్రద్ధగా అలంకరించుకొంది. అరచేతి వెడల్పున జరీ అంచున్న ఆకుపచ్చ జార్జెట్ చీరె అదే రంగు జాకెట్.

తలంటుకొన్న కురుల్ని చక్కగా దువ్వి వదులుగా జడవేసింది. బారెడు జడ వత్తుగా మెత్తగా నడుముదాకా వేళ్ళాడుతోంది. సన్నజాజి పూలమాల తురిమింది జడలో.

కళ్ళకు కాటుక మెరుపునిస్తోంది. నుదుట గుండ్రని బొట్టు తళుక్కుమంటోంది.

ముత్యాల లాకెట్‌లో ఉన్న ముత్యాల గొలుసు చెవులకు ముత్యాల జూకాలు. ఒక చేతికి ముత్యాల గాజు ఇంకొక చేతికి వాచీ.

బాగ్ తీసుకొని చెప్పులు వేసుకుంటూ "వేగలా వెళ్ళి వస్తానమ్మా. వసూ వాళ్ళింటికి వెళ్తాను" అంది.

"సరే. చీకటి పడకుండా రామ్మా" అన్నారు సుభద్రమ్మగారు.

"సరేనమ్మా" అంటూ బయటకు వచ్చింది. మెల్లిగా నడుస్తూ వచ్చేసరికి నాలుగయింది. స్టాప్‌లో నిల్చోగానే సర్రున దూసుకువచ్చింది విజయేంద్ర కారు.

అతను కారాపి ముందు డోర్ తెరిచాడు.

కారెక్కేసింది సుజాత.

ఆ సమయంలో ఇంక మరేవీ గుర్తు రాలేదు. అంతకుముందే చేసుకున్న నిర్ణయాలేవీ జ్ఞాపకం రాలేదు.

ఫ్రంట్ సీట్లో కూర్చుంది. అతను తల తిప్పి సుజాతకేసి చూశాడు.

అతను ముగ్ధుడైనట్లు అతని కళ్ళే చెప్పాయి. సిగ్గుపడుతూ తల తిప్పేసుకొంది సుజాత.

"మీరేమనుకోనంటే..."

"తప్పకుండా అనుకుంటాను నమ్మగనక మీరు అంటే" అతను నవ్వేశాడు.

"నువ్వేమనుకోనంటే ఒక మాట చెప్పనా సుజాతా. నువు చాలా అందంగా వుంటావు"

సుజాత సిగ్గుగా నవ్వింది. బుగ్గల్లో కెంపుల ఎరుపు వచ్చింది.

అతను పొగుడుతుంటే చాలా గర్వంగా, ఆనందంగా ఉంది.

కారు పబ్లిక్ గార్డెన్ దగ్గర ఆగింది. నడుస్తున్నారు ఇద్దరూ.

"నీతో ఒక మాట చెప్పనా సుజాతా నువ్వేమీ అనుకోవు కదా"

"ఏమీ అనుకోను చెప్పండి"

"నిన్ను చూసిన క్షణంలోనే నువ్వంటే నాకు చాలా ఏర్పడింది సుజా. ఆ రోజు ప్రైక్ రోజు అందరూ వెళ్ళిపోయినా నువ్వు ఉండిపోయావు ఏదో చదువుకుంటూ. నువ్వు చదువులో పడి ఏమీ గమనించవని నాకు తెలుసు. అందుకే ఉండిపోయాను నేను కూడా. నువ్వు నన్ను గమనించలేదని కూడా తెలుసు. నాన్నగారు ఎటూ నా కోసం కారు పంపిస్తారు. ఆ కార్లో నిన్ను కూడా దింపాలి అనుకున్నాను. నాకు దురుద్దేశమేదీ లేదు కానీ ఒక సంగతి చెపుతాను సుజా. నాకు స్నేహితులెవరూ లేరు. ఉన్న ఒక్క ఫ్రెండ్‌వి నువ్వే. ఐ లైక్ యూ సుజా కాదు ఐ లవ్ యూ "

సుజాత అతని కళ్ళలోకి చూస్తూ వింటోంది. ఐ లవ్ యూ అని అతనంటున్నప్పుడు అతని కళ్ళల్లో కనిపించిన ప్రేమ ఆమెను ముగ్ధురాల్ని చేసింది. స్వచ్ఛంగా నిజాయితీ తొణికిసలాడే ఆ కళ్ళల్లోకి చూస్తూ నిల్చుంది.

పైకి ఏమీ మాట్లాడలేదు కానీ ఆమె మనసు "ఐ టూ విజయ్" అంటోంది.

ఇద్దరూ ఒక్కళ్ళనొకళ్ళు చూస్తూ ఉండిపోయారు. అలా ఇద్దరూ ఒకర్నొకరు చూసుకుంటూ ఉండిపోతే కలిగే ఆనందం ప్రేమించిన హృదయాలకే తెలుస్తుంది.

కదిలి ముందుకు నడిచారు.

"అలా కూర్చుందాం" అన్నాడు.

మౌనంగా అతన్ని అనుసరించింది సుజాత.

రెండు ఐస్‌క్రీమ్‌లు కొని సుజాత కొకటి అందించాడు విజయేంద్ర.

ఆప్యాయంగా అందుకొంది సుజాత.

ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటూ ఏవో మాట్లాడుకుంటూ కూర్చుంటే ఎంత



టైమ్ గడిచిందీ తెలియలేదు.

హఠాత్తుగా వాచీ చూసుకొని కంగారుపడింది సుజాత.

"అబ్బా ఏడయింది" వెళ్తానన్నట్లు చూపింది.

"వెళ్ళిపోదాం పద" అతను లేచాడు. కార్లో కూర్చుని కారు స్టార్ట్ చేశాడు. మౌనంగా ఉన్నారు ఇద్దరూ. అయినా వాళ్ళ మనసులు మాట్లాడుతూనే ఉన్నాయి.

ఏదో తెలీని ఆనందం, అనుభూతి. అదే ప్రేమ చూపించే మత్తు. అది చేసే గమ్మత్తు.

ఆమె కారు దిగి వెళ్ళిపోతుంటే ఎంతో బాధగా అనిపించింది విజయేంద్రకు.

"బై" అంది సుజాత.

"బై మళ్ళీ ఎపుడు కలుస్తావు"

"మీ ఇష్టం" మనసంతా తేలిగ్గా హాయిగా ఉంది. ఏవో తెలియని అనుభూతి ఎదనిండా నింపింది.

అదే తొలి ప్రేమ చూపే మత్తు. అది చేసే గమ్మత్తు. ఆమె కారు దిగి వెళ్ళిపోతుంటే ఎందుకో బాధగా అనిపించింది విజయేంద్రకు.

"బై" అంది సుజాత.

"బై మళ్ళీ ఎపుడు కలుస్తారు."

"మీరే చెప్పండి"

* * *

స్నేహం, ప్రేమ లతల లాంటివి. అందుకే స్నేహలత ప్రేమలత అంటారేమో. పెంచుకొంటే పెరుగుతాయి. తుంచుకుంటే తరుగుతాయి.

విజయ్ సుజాతల స్నేహం ప్రేమలోకి మారింది. విజయ్ వ్యక్తిత్వం, అభిప్రాయాలు సుజాతకెంతో నచ్చుతాయి.

ఏ విషయాన్ని అయినా అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. ఎవరి విషయమైనా మంచి దృష్టితో ఆలోచిస్తాడు. తనకు వచ్చిన విషయాన్ని నిర్మోహమాటంగా చెపుతాడు.

అతని దగ్గర లైబ్రరీ ఉందిట. ఎన్నో మంచి పుస్తకాలు తెచ్చి సుజాత కిచ్చాడు.

అతని అభిరుచి చూస్తూ ఉంటే సుజాతకు ఆశ్చర్యం అనిపిస్తుంది.

ఒక రోజు కలుసుకున్నప్పుడు విజయేంద్ర అన్నాడు.

"నెక్స్ట్ మన్‌డే పదో తారీఖు మా అమ్మగారికి పరిచయం చేస్తాను. అయిదింటికి మీ ఇంటికి వస్తాను. మీ అమ్మగారిని కూడా తీసుకొని రా"

"అలాగే"

"మరి ఉంటాను"

"ఊఁ"

మళ్ళీ ఏదో దిగులు. నెక్స్ట్ సన్ డే దాకా ఎలా గడపాలి అని ఆలోచన.

"వెళ్తాను" సుజాత ముందుకు నడిచింది.

* * *

"అమ్మా ఈరోజెక్కడి కన్నా వెళ్తున్నావా"

సుభద్రమ్మ గారు "లేదే" అన్నారు.

"ఎందుకు సుజా"

"ఏం లేదమ్మా. విజయేంద్ర వాళ్ళ అమ్మగారిని పరిచయం చేస్తాను అంటున్నాడు. ఎప్పుడూ వాళ్ళింటికి రమ్మని అంటూనే ఉంటాడు కదా. వెళ్ళకపోతే బాగుండదు. ఒకసారి వెళ్ళొద్దామా" సుభద్రమ్మగారు ఒక క్షణం ఆలోచించారు.

"మనకు ఇల్లు తెలీదుగా" అన్నారు.

"అతనే వస్తున్నాడు మధ్యాహ్నం ఫోన్ చేశాడు" అనుకోకుండా అబద్ధం ఆడింది. లేకుంటే తను కాలేజీ లేకున్నా అతన్ని కలుసుకొంటున్న సంగతి తెలుస్తుంది. పెద్దవాళ్ళు కాబట్టి బాధ పడతారు. తనేదో తప్పుదారిన నడుస్తున్నదేమో అని కలవరపడతారు.

"ఎన్ని గంటలకు వస్తానన్నాడు"

"అయిందింటికి"

"అలాగే వెళదాంలే"

సుజాత కొండెక్కినంత సంబర పడింది. సంతోషంగా చూసింది తల్లి వైపు.

"అప్పుడే నాలుగయింది. త్వరగా తయారవు. అతను రాగానే వెళ్ళిపోదాం తొందరగా తిరిగి వచ్చేయవచ్చు" అన్నారు సుభద్రమ్మగారు.

"అవునవును"



బహుమతి

"ఏం వదినా మీ ఆయన లాటరీ టిక్కెట్టు కొంటే మూడువేలు బహుమతి వచ్చిందట కదా?" అడిగింది పార్వతమ్మ.

"ఆ ఏం బహుమతి లేమ్మా. పేపర్లో నెంబరు చూసుకుని ఆనందంతో గుండెనొప్పి వచ్చిందాయనకి. హాస్పటల్లో చేర్పిస్తే అయిదువేలు బిల్ అయింది" చెప్పింది వర్ధనమ్మ.

మడగాల గోవిందరావు (అనకాపల్లి)

చకచకా స్నానం ముగించింది సుజాత. జరీబుటాలు, జరీ అంచు కనకాంబరం రంగుబార్డర్ ఉన్న తెల్లని చీరె కట్టుకుంది. అదే రంగు జాకెట్. బారెడు జడలో కనకాంబరాల మాల. కళ్ళకు సన్నగా కాటుక. నుదుట సింధూరం బొట్టు. చెవులకు జూకాలు పెట్టుకొని మెడలో లాకెట్ గొలుసు వేసుకుంది. ఒక చేతికి ఎర్రగాజులు వేరొక చేతికి వాచీ.

ముస్తాబు ముగించుకొని డ్రాయింగ్ హాల్లో కూర్చుంది వీక్లీ చదువుతూ

సుభద్రమ్మ కూడా వంట పూర్తి చేసి తయారయ్యారు.

గడియారం అయిదు గంటలు కొడుతుండగానే విజయేంద్ర కారు వచ్చి ఆగింది.

లోపలకు వచ్చాడతను.

"నమస్కారమండీ" అన్నాడు సుభద్రమ్మగారిని చూసి—

"నమస్కారం బాబూ. రా కూర్చో"

"కూర్చుంటానండీ. ఈరోజు మీరు మా ఇంటికి రావాలి. ముందుగానే చెప్పాను సుజాతకు. మా అమ్మగారు మిమ్మల్నందర్నీ తీసుకుని రమ్మన్నారు."

"మేమిద్దరం వస్తున్నాం" అన్నారు సుభద్రమ్మగారు. విజయేంద్ర సంతోషంగా చూశాడు.

"బయల్దేరుదామా మరి" అన్నాడు.

"ఊ కాస్త కాఫీ తీసుకొని వస్తాను బాబూ"

"వద్దండీ" వారించాడు విజయేంద్ర.

"ఇప్పుడే తాగాను. ఇంక మళ్ళీ తాగలేను"

"మనం బయల్దేరుదామా"

"అలాగే పదండి"

కార్లో కూర్చున్నారు ముగ్గురూ.

సుజాతకు కొంచెం ఆదుర్దాగా ఉంది. విజయ్‌వాళ్ళ అమ్మగారు తనను చూసి ఏమంటారో. వాళ్ళ అమ్మగారు ఊ అంటే వాళ్ళ ఫాదర్ కూడా ఓ.కే. అంటారన్నాడు విజయేంద్ర.

కారు పెద్ద భవంతి ముందు ఆగింది. పెద్దగేటు, గేటు లోపల నుండి ఇంట్లోకి వెళ్ళే దారి. దారి కిరుపక్కలా పూల చెట్లు విరగపూసి ఉన్నాయి. జీనియాలు, డాలియాలి, మేరిగోల్డ్ రకరకాల పూలు నవ్వులొలికిస్తున్నాయి. వాటికి కంచెలాగా వేసి చక్కగా కత్తిరించిన క్రోటన్ చెట్లు. మధ్యమధ్య అశోక వృక్షాలు పెద్ద పెద్ద పూలకుండీలలో గులాబీలు. గుత్తులు గుత్తులుగా వేలాడుతున్న తీగె గులాబీలు. ఎక్కడ చూసినా శోభాయ మానంగా ఉంది.

గేటుమంచి లోపలకు నడిపి పోర్టికోముందు కారాపాడు విజయేంద్ర. కారు ఆగిన శబ్దం వినగానే ఒక నౌకరు పరుగెత్తుకొని వచ్చాడు. కారు తలుపు తీసి పట్టుకొన్నాడు వినయంగా.

"రండి" అన్నాడు విజయేంద్ర.

లోపలకు నడిచారు.

తెరచి ఉన్న అద్దాల తలుపుల లోంచి లోపల పెద్ద హాల్‌లోకి ప్రవేశించారు.

హాలులో ఒక వైపు సోఫాలు, మధ్యలో టీపాయ్, హాలు మధ్యలోంచి మేడమీదికి స్టెయిర్ కేస్ ఉంది.

"అమ్మగారికి చెప్పు" అన్నాడు విజయేంద్ర నౌకరుతో.

నౌకరు వెంట ఒక స్త్రీ వచ్చింది. పచ్చని శరీరం, అందమైన మొహం, హుందాగా కనపడే విగ్రహం, రవ్వల దిద్దులు రవ్వల హారం, నీలిరంగు పట్టు చీర, జాకెట్, నాలుగు పేటల గొలుసు చేతులకున్న బంగారు గాజులు ఆమె నడుస్తుంటే కదలికకు మోగుతున్నాయి.

"మా అమ్మగారు"

"నమస్తే" వినయంగా నమస్కరించింది సుజాత.

"నమస్కారం. కూర్చోమ్మా. రండి కూర్చోండి" అంటూ సుజాతను సుభద్రమ్మ గారిని కూర్చోపెట్టారు ఆవిడ.

"నీ గురించి చెప్తు ఉంటాడమ్మా విజయ్. బాగా చదువుతావట. ఫస్టు వస్తావట, చాలా సంతోషంగా ఉందమ్మా నిన్ను చూస్తుంటే"

"ఏదో చదువుతానండీ, మీ విజయ్ నోట్సులు అవీ చూస్తుంటే నాదీ ఒక చదువేనా అనిపిస్తుంది. ఈ సారి తనే ఫస్టు రావచ్చు" సుభద్రమ్మగారు ఆవిడ మాట్లాడుతూ కూర్చున్నారు.

సుజాత మనసు మనసులో లేదు.

విజయేంద్ర ఇంత శ్రీమంతుడా.

ఎందుకోగాని అతను తమలాంటి వాడేననుకొంది. కాని ఇంత ధనవంతుడనుకోలేదను.

## వంట చెరకు వ్యాధులు



ఈ నాటికీ పల్లెటూళ్ళలో చాలా మంది స్త్రీలు కట్టెలు, బొగ్గు, పేడతో చేసిన పిడకలతో వంటచేస్తూనే ఉన్నారు! అయితే... వీటి వాడకంవల్ల కాస్త డబ్బు ఆదా చేస్తున్నా... వాటిని కాలుస్తున్నప్పుడు వెలువడే పొగను పీల్చటం వల్ల వారు అనేక రకాలైన శ్వాస కోశవ్యాధులతో బాధపడటమేకాక చివరకు గొంతు, ముక్కు క్యాన్సర్ కూడా వారికి రావటానికి అవకాశం ఉందని ప్రపంచ ఆహార సంస్థ హెచ్చరిస్తోంది!

ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాలలో 40 నుంచి 50 కోట్ల మంది దాకా ప్రజలు ఇలాటి వ్యాధులతో బాధ పడ్తున్నట్లు ఈ సంస్థ జరిపిన సర్వేలో వెల్లడయింది.

— జూపిటర్

అతని కార్ల ఖరీదు చేసేటట్లు లేదు తమ అప్తంతా పార్వతమ్మ గారు ఏదో మాట్లాడుతున్నారు.

మౌనంగా వింటోంది సుజాత.

సుభద్రమ్మ గారు ఏమేమిటో కబుర్లు చెప్తున్నారు.

ఎవరో మేడ దిగి వస్తుంటే తల ఎత్తి చూసింది సుజాత.

భారీ శరీరంలో ఫుల్ సూట్‌లో ఉన్న ఒక వ్యక్తి మేడ మెట్లు దిగి వస్తున్నాడు.

''మా నాన్నగారు'' పరిచయం చేశాడు విజయ్.

''నమస్కారమండీ'' వినయంగా లేచి నమస్కరించింది సుజాత.

''నమస్కారమమ్మా విజయ్ ఈ అమ్మాయేనా మీ క్లాస్ మేట్ సుజాత''

''అవును నాన్నగారూ''

''కూర్చోమ్మా వీరు మీ అమ్మ గారా''

''అవునండీ''

''కూర్చోండి, నేను వెళ్తాను టైమ్ అవుతోంది. మా కంపెనీలో మీటింగ్ ఉంది.''

ఆయన వెళ్ళిపోయారు.

''మీ అమ్మాయికి సంబంధాలు చూస్తున్నారా?''

సుజాత గుండె దడదడ కొట్టుకుంది.

అమ్మ ఏమంటుందో?

''లేదండీ. ఇంకా ఏం చూడలేదు. అమ్మాయి చదువుకొంటోందని వాళ్ళనాన్నగారు ఆ విషయమే ఆలోచించలేదు. బాగా చదివే వాళ్ళకి పెళ్ళి చేసి చదువు చెడగొట్టకూడదనే వారు. అందుకే ఏం సంబంధాలు చూడలేదు ఇంత వరకు. ఇక చూడాలి'' అన్నారు సుభద్రమ్మ గారు.

'మా విజయ్‌కి కూడా చూడాలండీ. ఇక వాళ్ళ నాన్నగారి బిజినెస్ అంతా చూసుకోవాలి కదా. ఆయన అంతా విజయ్ కప్పగించి నేను విశ్రాంతి తీసుకుంటాను అంటున్నారు. వీడేమో ఎం.బి.ఏ చదువు బిజినెస్ మానేజ్ చేసుకోవటం తేలికంటే వినలేదు. అసలు ఇంటర్‌లోనే కామర్స్ తీసుకోమంటే వినకుండా నా కిదే ఇంట్రెస్ట్ అని సైన్స్ తీసుకున్నాడు ఇంకా రీసెర్చ్ చేస్తాను అని అంటున్నాడు కానీ వాళ్ళ నాన్నగారు ఒప్పుకోవడం లేదు. చదివింది చాలు. బుద్ధిగా పెళ్ళి చేసుకొని బిజినెస్ చూసుకోమంటున్నారు'' నన్నారు పార్వతమ్మ గారు.

తన పెళ్ళి గురించి వచ్చేసరికి విజయ్ మొహం కొద్దిగా ఎర్రబడింది. ఏదో పని కల్పించుకొని అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయాడు.

పెళ్ళిళ్ళ గురించి సంబంధాల గురించి కబుర్లు చెప్పుకుంటున్నారు పార్వతమ్మగారు, సుభద్రమ్మగారూను విజయ్ ఫలహారం పళ్ళాలు తెచ్చాడు.



తర్వాత ఒక నౌకరు కాఫీలు తీసుకువచ్చాడు.
కాసేపాగి లేచారు సుజాత. సుభద్రమ్మగారు.
''వెళ్లొస్తామండీ. చీకటి పడుతోంది'' అన్నారు.
''విజయ్. వీరివి ఇంటి దగ్గర దింపు'' పనిమనిషి పళ్ళెం తెచ్చి ఆవిడ చేతికిచ్చింది.

అందులో నుండి కుంకుమ భరిణె తీసి ఇద్దరికీ బొట్టు పెట్టి మామిడపళ్ళు అందించారు ఆవిడ.

"వెళ్ళొస్తామండీ, మీరు కూడా మా ఇంటికి రావాలి"

"అలాగే. తప్పకుండా వస్తాను" అన్నారు పార్వతమ్మగారు. కార్లో ఇంటి దగ్గర దింపాడు విజయేంద్ర.

మర్నాడే ఫోన్ చేశాడు విజయేంద్ర.

సుజాతే రిసీవ్ చేసుకొంది.

"హలో" అంది.

"హలో సుజాతేనా"

"అవును"

"నేను సుజా. విజయ్‌ని. మా అమ్మగారికీ నాన్న గారికీ అంతా చెప్పాను. వాళ్ళు నిన్ను చూసి చాలా సంతోషించారు. మన పెళ్ళికి ఒప్పేసుకున్నారు."

"నిజంగానా"

"నిజంగా"

ఇద్దరికీ ఏదో చెప్పలేని ఆనందం

ప్రేమ సఫలమవబోతుంటే కలిగే ఆనందం.

"సాయంత్రం మీ ఇంటికి వస్తాను. మీ నాన్నగారితో మన సంగతి మాట్లాడుతాను"

"ఇప్పుడే వద్దు. నెమ్మదిగా చెపుతా"

"అలాగే"

"మరి పెట్టేయనా"

"సరే. సాయంకాలం బస్‌స్టాండ్ దగ్గర నిల్చోకూడదూ. అలా బిర్లామందిర్ కేసి వెళదాం"

"ఒకే పెట్టేస్తున్నాను. బై"

"బై" అవతల ఫోన్ పెట్టేసిన శబ్దం వినిపించింది.

* * *

టాంక్‌బండ్‌లో రైలింగ్ నానుకొని నిలుచుని ఉన్నారు సుజాత విజయేంద్ర.

సుజాత చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు విజయ్.

సుజాత ఒళ్ళు పులకరించింది. తన్మయంగా చూసింది అతని కళ్ళల్లోకి.

అతను కూడా అలాగే ఉన్నాడు.

"సుజా. నీకు ఒకటి చెప్పనా"

"చెప్పండి"

"నేను కిందటి జన్మలో చేసిన పూజలో ఈ జన్మలో చేసిన పుణ్యమో నీలాటి స్త్రీ నాకు భార్య కాబోవటం. నిజంగా నిన్ను కాక ఎవరినీ పెళ్ళి చేసుకోలేను సుజా. నీవు కాక ఎవరైనా నా కింత ఆనందం ఉండేది కాదు. నువ్వంటే నా కెంత ప్రేమో మాటల్లో చెప్పలేను సుజా"

సుజాత చిరునవ్వు నవ్వింది. అంతనికేసి ప్రేమంగా చూసింది.

తను మాత్రం తక్కువ అదృష్టవంతురాలా. నిజంగా విజయ్ లాటి వ్యక్తి తన భర్త కాబోవటం ఎంత అదృష్టం.

"నిజంగా సుజాత. ముఖ్యంగా నువ్వు ఒప్పుకుంటా ననుకోలేదు. మన కులాల అంతరము.." సుజాతకు గుండె ఆగినట్లయింది.

అతను చెప్పే మాటలు వినబడటం లేదు.

సడన్‌గా చెవులు పని చేయటం మానేసినట్లు అయింది.

"కులాల అంతరం"

తను ఆ సంగతి ఇంతవరకు ఆలోచించనే లేదు.

తన కులం విజయ్ వాళ్ళ కులం ఒకటి కాదు.


తన తల్లితండ్రులు ఈ పెళ్ళికి ఒప్పుకుంటారా?

ఒప్పుకున్నా తను కులాంతర వివాహం చేసుకుంటే సునీతకు సరిగా పెళ్ళవుతుందా.

సుజాత కళ్ళలో నీరు తిరిగి చెక్కిళ్ళ మీద నుండి జారింది.

"భగవాన్ నా కెందుకీ శిక్ష" అనుకుంది బాధగా.

"సుజా..." విజయ్ కంగారుగా పిలిచాడు.



"ఏంటి సుజా. ఎందుకిలా బాధ పడుతున్నావు" అతను గాభరా పడ్డాడు.
"ఏమీ లేదు" రూమాలుతో కళ్ళు తుడుచుకుంది సుజాత.
"ఏంటో ఉంది. నాకు చెప్పు సుజా"
సుజాత ఒక్క క్షణం ఆలోచించింది విజయ్‌కి చెప్పేస్తేనే మంచిది.
"సారీ విజయ్. నువ్విపుడు అనగానే నాకు కులాల ప్రసక్తి తెలుస్తోంది. నిన్ను పిచ్చిగా ప్రేమిస్తూ అసలు వేరే విషయాలే పట్టించుకోలేదు నేను. ఆ ఆలోచనలే రాలేదు. మన పెళ్ళి కష్టం విజయ్. అది అసంభవం. మా వాళ్ళు ఛాదస్తులు. ఎంత మాత్రమూ ఒప్పుకోరు"
విజయ్ మొహం చిన్నబోయింది. మొహంలో దాచుకున్నా దాగని ఆవేదన.
"సుజా నువ్వు ఇంత చదువుకొని కూడా ఇలాగ ఆలోచిస్తావా"
సుజాత సమాధానం చెప్పలేదు.
తలవంచుకొని కన్నీళ్ళు అతనికి కనబడకుండా ఉండాలని ప్రయత్నిస్తోంది.
"సుజా నువ్వు కాదనకు. నేను వచ్చి మీ ఇంట్లో అడుగుతాను. వాళ్ళు కాదంటే అప్పుడు ఆలోచిస్తాను"
సుజాత తల అడ్డంగా ఊపింది.
"వద్దు" అంది.
తన మీద ప్రేమతో తల్లి తండ్రులు ఒప్పుకోవచ్చు. కానీ దాని వలన సునీత పెళ్ళి కావడం కష్టం. తన బంధువులలో తల్లితండ్రులకు గౌరవం తగ్గవచ్చు. ఇవన్నీ లేకపోయినా వాళ్ళే మనసులో బాధ పడవచ్చు. వద్దు. తనకీ ప్రేమ వద్దు. తన వారిని తనను కన్నవారిని బాధ పెట్టే ప్రేమ తనకి అక్కర్లేదు. ఇందువల్ల విజయ్ మనసు బాధ పడవచ్చు. కానీ ఇందరి మనసులను కష్టపెట్టేకన్నా ఒకరి మనసు కష్ట పెట్టడమే మంచిది.
గట్టి నిశ్చయంతో విజయేంద్ర మొహంలోకి చూసింది సుజాత.
"ఇదంతా మర్చిపో విజయ్"
"అసంభవం" విజయ్ గట్టిగా అరిచాడు.
"సుజా. బాగా ఆలోచించుకో. అనవసరంగా బంగారు లాంటి జీవితాన్ని పాడు చేసుకోకు. వ్యర్థమైన మూఢనమ్మకాలకు మన ప్రేమను బలిపెట్టకు చెప్పు సుజా. మనుషుల మధ్య ఈ అంతరాలు ఎందుకు. పశువులకు కూడాలేని ఈ భేదాలు మనకెందుకు. నువ్వే చెప్పు సుజా. ఈ భేదాలను మా అమ్మా నాన్నగారు కూడా పాటిస్తే వాళ్ళు ఈ పెళ్ళికి ఒప్పుకొనే వాళ్ళేనా. మన మధ్య కులాల అంతరమే కాక ధనం అనే అడ్డుగోడ కూడా ఉంది. మామూలుగా చూస్తే మీరు ధనవంతులే కావచ్చు. కానీ మా ముందు మీ రెంత? నేనిలా అంటున్నానని కోపం తెచ్చుకోకు సుజా. మీ ఆస్తి అంతా కూడా మా అమ్మగారి జువ్వెలరీలో సగం కూడా ఉండదు. మరి మా ఇతర ఇస్తుల మాటేమిటి. ఎన్ని రకాలుగా ఉంది మా ఆస్తి.

వీటన్నిటికీ నేను ఏకైక వారసుణ్ణి కాదా. ఎన్నో లక్షల కట్నంతో వస్తున్నారు ఆడపిల్లల తండ్రులు. కానీ మా అమ్మ నాన్న అవి ఆశించలేదే. వాటి కోసం వాళ్ళు నన్ను కాదన్నారా. వాళ్ళు డబ్బు అనే తేడా గురించి ఆలోచించటమే లేదు. ఈ లోకంలో అన్నిటి కన్నా ముఖ్యమైనది డబ్బు. ఆ డబ్బే మన మధ్య అడ్డుగోడ కానప్పుడు ఈ కులాల గురించి సుజా. కాదనకు. అనవసరంగా మన ప్రేమను విఫలం చేయకు'' వేడుకొన్నాడు విజయ్.

బతిమాలాడు.

నచ్చ చెప్పాడు.

వేటికి చలించలేదు సుజాత.

అతను ఎంత చెప్పినా వినలేదు.

అన్నిటికీ ఒక్కటే సమాధానం.

''నేను మా అమ్మా నాన్నలను నొప్పించలేను. ఆ ప్రసక్తి ఇక తేవద్దు. నన్ను మర్చిపో''

బాధతో విసుగుతో చూశాడు విజయ్.

''సుజా. నేను శుక్రవారం వరకు చూస్తాను. శుక్రవారం అయిదింటికి ఫోన్ చేస్తాను. నీవు బాగా ఆలోచించుకొని జవాబు చెప్పు. నేను చెప్పినవన్నీ విన్నావుగా. అన్ని విషయాలు ఆలోచించు. పెద్ద వాళ్ళు కొన్నాళ్ళు కోపగించుకొన్నా తర్వాత వాళ్ళే మెత్తబడి మనల్ని ఆదరిస్తారు''

''వాళ్ళు మెత్తబడతారా లేదా అన్నది కాదు సమస్య. నా కోసం ఇంత చేసిన వాళ్ళు నన్ను కని పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు చెప్పించి నేను ప్రయోజకురాలినైతే చూసి సంతోషిద్దామనుకొన్న వాళ్ళు... వాళ్ళకి...వాళ్ళకి ప్రతిఫలంగా నేను ఇచ్చేది అశాంతా. వద్దు విజయ్ వద్దు. నాకు ఈ ప్రేమ వద్దు. నీకు కోపం వచ్చినా నేను ఒక మాట చెప్తాను విజయ్. నేను ఎక్కువ ఎవరికి విలువ ఇస్తాను అంటే నా తల్లిదండ్రులకే ఇస్తాను. వారి సుఖమే నాకు ముఖ్యం. వారి శాంతే నాకు సర్వస్వం."

విజయ్ మొహం కోపంతో ఎరుపెక్కింది.



సినిమా

సినిమాహాల్లో టైపిస్టు సరళతో కలసి కనిపించాడని భర్త భలేరావుని సాధిస్తోంది స్వరాజ్యం.

''ఏమిటే గొడవ. నేను సినిమాకి వెళ్ళలేదంటే నమ్మవే. అంతగా నన్ను సినిమాహాల్లో చూసినదానివి అక్కడ ఎందుకడగలేదు'' అన్నాడు భలేరావు చిరాగ్గా.

''ఆ అడిగేదాన్నే. కానీ నాతో మన పక్కింటాయన ఉన్నాడు కాబట్టి మీరు బతికిపోయారు'' అంది స్వరాజ్యం.

—వేలాల మురళీవేణు (హైదరాబాద్)

“నీ ఖర్మ సుజా. నువ్వు అలా అంటే ఇక నేనేం చేస్తాను. కానీ ఒక్క మాట సుజా. నేను శుక్రవారం దాకా చూస్తానన్నాను కదా. బాగా ఆలోచించి నీ నిర్ణయం చెప్పు  నీ నిర్ణయం ఏమైనా సరే. నేను నిన్నిక విసిగించను”

అతని కంఠం రుద్ధమైంది.

అతను ఎంత బాధ పడుతున్నాడో ఆ కంఠం వింటేనే తెలుస్తుంది.

అతని మొహంలోకి చూసే ధయిర్యం లేక మౌనంగా కారెక్కి తల దించుకొని కూర్చొంది సుజాత.

అతను ఏమీ మాట్లాడలేదు. మౌనంగా కారు డ్రైవ్ చేశాడు.

ఇద్దరి మనసుల్లోను బాధ.

సుజాత కళ్ళల్లో నీటి పొర.

అతని కళ్ళల్లో అంతులేని విషాదం.

అతనికి లోపల కొద్దిగా విసుగ్గా కోపంగా ఉంది సుజాతపైన. కనీసం తల్లితండ్రుల్ని అడగటానికి కూడా ఒప్పుకోవటంలేదు. వాళ్ళు బాధపడతారట వింటే. ఇంత భక్తి పరురాలైన కూతుర్ని కన్నవాళ్ళు చాలా అదృష్ట వంతులు” అనుకున్నాడు.

కంటనీరు తుడుచుకొంది సుజాత. అతను తల తిప్పుకొన్నాడు. ఓదార్చే ప్రయత్నం చేయలేదు.

బస్ స్టాప్ దగ్గరే దిగిపోయింది సుజాత. దిగి కారు తలుపు వేస్తు అతని కళ్ళల్లోకి చూసింది.

అతను సూటిగా చూస్తున్నాడు.

అతని కళ్ళు దిగులుగా అదోక మాదిరిగా ఉన్నాయి.

లోకంలోని విషాదమంతా మూర్తీభవించినట్లు ఉన్నాడతను.

అతన్ని అలా చూస్తుంటే సుజాత గుండె కలుక్కుమంది.

అతనికీ బాధ తన మూలంగానే.

కానీ తను మాత్రం ఏం చేయగలదు.

“వెళతాను” అన్నది చిన్నగా.

అతను తలఊపాడు.

అతనికి దూరమవాలంటే అమితమైన బాధ.

అది ప్రేమించిన హృదయాలకే అవగతం. అతని మొహం సామ్రాజ్యాలు పోగొట్టుకున్న మహారాజులా ఉంది.

సుజాత పరిస్థితి కూడా అలాగే ఉంది.

నిజమే మరి. వారు పోగొట్టుకొంది ప్రేమ సామ్రాజ్యం.

బరువెక్కిన కంటి రెప్పలు ఎత్తి ధారలుగా కంటనీరు కారుతుంటే సెలవు తీసుకొంది

సుజాత.

తన గుండెను ఎదలో బలవంతంగా కోసి తీసుకు పోతున్నట్లుంది విజయ్‌కి.

అలాగే శిలలా కూర్చున్నాడు స్టీరింగ్ ముందు.

ఆమె కనుమరుగైనాక ఎప్పటికో కారు స్టార్ట్ చేసి కదిలాడు.

TANGUDU RANGA RA
NEWS AGENT
MADAPAM.

* * *

ఇంటికి ఎలా వచ్చిందో సుజాతకే తెలీదు.

నిద్రలో నడుస్తున్న దానిలా వచ్చి నేరుగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

బాత్‌రూమ్‌లోకి వెళ్ళి మొహం సబ్బుతో కడుక్కొని పౌడర్ రాసుకొని బొట్టు పెట్టుకొంది.

మనసులో బాధ పడుతున్నట్లు పైకి తెలియకూడదు. బాధ పడుతున్నట్లు కనిపిస్తే అమ్మా నాన్నగారూ కలవరపడతారు. వాళ్ళకి ఈ విషయం ఎంత మాత్రం తెలియకూడదు అని నిశ్చయం చేసుకొంది.

కానీ మనసు నిలువనీయటం లేదు. ఊగిస లాడుతోంది.

తల్లిదండ్రులపై మమకారమూ గౌరవమూ ఒక వైపు, ప్రియుని మీద ప్రేమాభిమానాలు మరో వైపు లాగుతున్నాయి.

స్థిర నిర్ణయం చేసుకోలేక పోతోంది.

మనసు నిశ్చితా నిశ్చితాల మధ్య కొట్టుమిట్టాడు తోంది.

అన్నం సహించలేదు.

రాత్రంతా నిద్ర పట్టలేదు.

మనసు విజయ్ కోసం పలవరించుతోంది. మొహంలోని అణువణువూ విజయ్ విజయ్



కళ్ళదేవుడు

డాక్టర్ అనే పదం... ఎంతో పవిత్రమైనది? ఆ పవిత్రతను కాపాడు కోనటానికి డాక్టర్లంతా కృషిచేయాలి! అందుకు సరైన ఉదాహరణ డాక్టర్ యస్.సి.మోడీ! ఈ కంటి డాక్టరు గారు 1943 నుండి 1987 దాకా 4,64,234 కంటి ఆపరేషన్లు చేశారట! ఒకే రోజున ఆయన చేసిన అత్యధిక ఆపరేషన్ల సంఖ్య 833.

ఈ రెండూ కూడా ప్రపంచ రికార్డులే కావటం— మోడీ గారిపేరు గిన్నిస్ పుస్తకంలో నమోదు కావటంకూడా మనందరికీ గర్వకారణం! కీప్ ఇట్ అప్ సర్!

—జూపిటర్

అని కలవరిస్తోంది.

ఆ రాత్రంతా ఆలోచనలు వేధిస్తూనే ఉన్నాయి.

తను విజయ్‌ని శాశ్వతంగా దూరం చేసుకోలేదు.

అది అసంభవం.

ఇక తల్లితండ్రుల మాట... మళ్ళీ ఆలోచనలు.

మనసు ఒక నిర్ణయాన్ని తీసుకోలేక పోతోంది.

విజయ్...

తనవాళ్ళు...

ఒకరి తర్వాత ఒకరు కళ్ళ ముందు కదలాడుతున్నారు.

ఎవరు ముఖ్యం?

జీవితంలో ప్రేమికుడ్ని పోగొట్టుకొంటే తిరిగి పొందటం కల్ల.

మరి జన్మనిచ్చిన తల్లితండ్రులో. ఎవరైనా లభించవచ్చు కానీ తల్లితండ్రులు మాత్రం లభించరు.

రాత్రంతా ఆలోచిస్తూనే ఉంది.

తను విజయ్‌ని విడిచి ఉండలేదు. అతను లేని జీవితం తనకు నరకం.

తల్లితండ్రులను అడగాలి. వారు ఒప్పకోకుంటే అప్పుడు ఆలోచించాలి.

తెల్లవారింది.

కాఫీ కప్పులో నాన్నగారి గదిలోకి వెళ్ళింది సుజాత.

జగన్నాథం గారు పేపర్ చూస్తున్నారు.

'కూర్చోమ్మా' అన్నారు.

సుజాత గ్రహించింది. నాన్నగారు ఏదో మాట్లాడదల్చుకొని ఉంటారు. లేకపోతే ఇలాగ కూర్చోమనరు.

"మొన్న మనింటికి వచ్చాడు చూడమ్మా నా ఫ్రెండ్ సూర్యారావుతో కలిసి... ఆ అబ్బాయి శేఖర్ జ్ఞాపకమున్నాడా.."

సుజాత తల ఆడించింది.

శేఖర్ పరిచయం చేశారు నాన్నగారు.

ఏదో కంపెనీలో ఆఫీసరని చెప్పారు.

"అసలు అతన్ని చూపినప్పుడు ఆ ఉద్దేశమేమీ లేదమ్మా. కానీ సూర్యారావు చెప్పాడు. అతను పెళ్ళి చూపు ల కోసం వచ్చాడట. ఆ సంబంధం నచ్చలేదట. సూర్యం అంటున్నాడు మీ సుజాత కయితే బావుంటుందని. నిన్ను అడిగి ఏ విషయమూ చెపుతానన్నానమ్మా. నీ అభిప్రాయం ఏమిటి"

సుజాత గుండె గతుక్కుమంది.

"నేను ఆలోచించుకోవాలి నాన్నగారూ" మనసు ఇదే సమయం విజయ్ గురించి చెప్పమంటోంది.

కానీ ఎందుకో చెప్పబుద్ధి కావటం లేదు మళ్ళీ.

నాన్నగారంటే తనకు భయంలేదు. కానీ భక్తి మాత్రం ఉంది. ఆయన ఎంతో చనువిచ్చినా ఆయన దగ్గర ఎన్నడూ హద్దులుమీరలేదు. ఈ నాడూ తన ప్రేమ వృత్తాంతం చెప్పాలంటే ఏదో బెరుకు.

'వెళ్తాను నాన్నగారూ" అంటూ కదిలింది.

సమయం పది గంటలు దాటింది.

భోజనాలుచేస్తున్నారు అందరూ. సుభద్రమ్మ గారు వడ్డిస్తున్నారు.

ఫోన్ మ్రోగింది.

వడ్డిస్తున్న గిన్నె పక్కన పెట్టి సుభద్రమ్మ గారు వెళ్ళారు ఫోన్ రిసీవ్ చేసుకోవటానికి.

"ఎవరుచేసింది..." జగన్నాధంగారి మాటలు పూర్తి కాలేదు.


సుభద్రమ్మగారి గొంతు కంగారుగా వినిపించింది. మాట్లాడలేనట్టుగా ఉంది ఆవిడ గొంతు.

అందరూ గాభరగా వెళ్ళారు.

వీళ్ళని చూస్తూనే ఆవిడ రిసీవర్ జగన్నాధం గారికి అందించి సోఫాలో కూర్చుని వెక్కి వెక్కి ఏడవ సాగారు.

జగన్నాధంగారు కంగారుగా మాట్లాడుతున్నారు ఫోన్‌లో.

"ఆ... ఆ... బయల్దేరుతున్నాం. పెట్టేస్తున్నాను" అంటూ ఫోన్ పెట్టేసి కంగారుగా వెనక్కి తిరిగారు.



"ఊరుకో... బాధపడకు" సుభద్రమ్మగారిని ఓదార్చారు ఆయన.

"ఏమిటి... ఏమైంది" అందరూ ఏక కంఠంతో అడిగారు.

"రాజ్యం పిన్ని పోయిందిట..."

"ఆ..." ఎవరికీనోట మాట రాలేదు. రాజ్యం పిన్ని అంటే సుభద్రమ్మగారి చెల్లెలు హార్ట్ పేషెంట్. అయినా ఇంత హఠాత్తుగా చనిపోతుందను కోలేదు ఎవ్వరూ.

"నేను అమ్మా ఊరు వెళతాం. మీరంతా ఇక్కడే ఉండండి సుజా. నువ్వూ సునీతా ఇల్లు కని పెట్టుక్కొని ఉండండి అన్నయ్యకు వండి పెట్టేందుకు ఎవరైనా ఉండాలిగా. ఎలాగో సర్దుకోండి. నేను వెళ్ళి తొందరగానే వచ్చేస్తాను. అమ్మను అక్కడే ఉంచుతాను అవసరమైతే" గబగబా చెప్పేసి సుభద్రమ్మగారిని ఓదారుస్తూ, ప్రయాణానికి సిద్ధం చేయసాగారు జగన్నాథం గారు.

సుజాతా సునీత వెక్కి వెక్కి ఏడుస్తున్నారు పిన్నిని తలుచుకొని.

"మేమూ వస్తాం నాన్నగారూ"

"వద్దమ్మా"

నాన్నగారు ఒకసారి అంటే ఇక ఆ మాటకు తిరుగులేదు. సుజాత సునీతా ఏడుస్తూనే వాళ్ళ ప్రయాణానికి కావలసినవన్నీ సర్దుతున్నారు.

వదిన, పిల్లలు సెలవులని ఊరికి వెళ్లారు. ఏమేం చేయాలో అన్నీ చెప్పి ఇల్లు అప్పగించి వెళ్ళారు జగన్నాధంగారు.

మూడోరోజుకల్లా ప్లేన్‌లో తిరిగి వచ్చేసారు జగన్నాధంగారు.

"ఎలా ఉన్నారు నాన్నా అక్కడ అంతా. ఎలా పోయిందిట పిన్ని" మోహన్ అడిగాడు.

"ఏం ఉందిరా. ఈ రోజుల్లో పిల్లలతో ఏం సుఖం చెప్పు. ప్రసన్న ఎవరినో పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయిందిట. ఆ మాట అంటే ఇలా పెళ్ళి చేసుకొంటున్నానని కూడా ఎవరికీ చెప్పలేదుట. అది వినగానే అసలే హార్ట్ పేషంట్ కదా పిన్నికి హార్ట్ అటాక్ వచ్చి పోయిందిట. ఈ పిల్లలతో సుఖం లేదు సరికదా కష్టాలొచ్చి పడుతున్నాయి. పోయిన పిన్ని సంగతి సరే. బాబాయి పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఆయనక్కూడా బి.పి అవీ ఉన్నాయి కదా. బ్లడ్ ప్రెషర్ కాస్త పెరిగితే ఆయన్ని హాస్పటల్లో చేర్చారు. కనీసం ఆయనన్నా బతికి బాగుంటే నయం. లేకుంటే ఆ మిగిలిన పిల్లల సంగతి పరమాత్మునికే ఎరుక."

సుజాత గుండె ముక్కలయింది. పిన్ని కూతురు ప్రసన్న ఎవరినో చేసుకుందా తల్లిదండ్రులకు చెప్పకుండా? దానికి పిన్ని హార్ట్ ఎటాక్ వచ్చి పోయిందా.... ఈ రెండు సంఘటనలతో బాబాయి ఆరోగ్యం పాడయి హాస్పటల్లో చేరారా.

కళ్ళముందు చీకట్లు కమ్ముతున్నాయి. ప్రసన్న పెళ్ళి ఇన్నింటికి దారితీసిందా.

రేపు తను విజయ్‌ను చేసుకున్నా అంతేకదా. నాన్నగారు హార్ట్ పేషంట్, అమ్మకి బి.పి



ఉంది. వీళ్లు మాత్రం దానికి తట్టుకోగలరా.

కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి.

ఆపలేని కన్నీటితో అంతులేని ఆవేదనతో వేళ్లాడిపోతున్న చేతులలో మొహం దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తూ మెట్లు ఎక్కుతోంది సుజాత.

ఒక్కొక్క మెట్టు ఎక్కుతుంటే ఒక్కొక్క దృశ్యం కనబడుతోంది.

నాన్నగారు పోయినట్లు... అమ్మ శోకిస్తున్నట్లు... ఇంట్లో అందరూ దుఃఖిస్తున్నట్లు.

"భగవంతుడా" ఊపిరి బిగబట్టి అనుకొంది సుజాత.

ఆ సంఘటనలేవీ జరుగకూడదు.

తను ఏమైనా ఫరవాలేదు. ఎంత కష్టపడ్డా ఫర్వాలేదు. కానీ... కానీ... తన వారంతా సుఖంగా ఉండాలి. తన్ను కన్నందుకు తన తల్లితండ్రి ఏ బాధా పడకూడదు. వాళ్లు శాంతిగా ఉంటే చాలు. దానికోసం తను ఎంత బాధనైనా అనుభవిస్తుంది. ఎంత ఆవేదననైనా అనుభవిస్తుంది. ఏ కష్టాన్నైనా భరిస్తుంది. ఏమైనా అవుతుంది.

అంతే.

అంత వరకు పరస్పర విరుద్ధ భావాల మధ్య కొట్టుమిట్టాడుతున్న సుజాత మనసు స్థిర నిర్ణయానికి వచ్చింది.

ఎవరు ప్రదానం అనే ప్రశ్నలో విజయ్ తేలిపోయారు. తల్లిదండ్రులే మొగ్గుచూపారు.

తనకు ప్రేమ ముఖ్యంకాదు. ఈ ప్రేమ విఫలమైతే తన కొక్కతికే బాధ. కానీ సఫలమైతే అందరికీ బాధ. తన సుఖంకోసం ఇందర్ని బాధ పెట్టలేదు.

విజయ్‌ని మర్చిపోవాలి.

అంతే.

* * *

శుక్రవారం సరిగ్గా అయిదు గంటలకు ఫోన్ మోగింది.

వెళ్ళి రిసీవర్ ఎత్తింది సుజాత.

"హలో" విజయేంద్ర కంఠం వినిపించింది.

"హలో" అంది.

"సుజాతేనా"

"అవును." అవతలనుంచి ఏమీ విన్పించలేదు.

విజయ్ మౌనంగా ఉన్నాడు. ఎలా అడగాలా అని ఆలోచిస్తున్నట్లున్నాడు.

"సుజాతా"

"ఊ"

"ఆ సంగతి ఆలోచించావా..." అతని గొంతులో ఆత్రుత ఉంది.

"అయామ్ సారీ. నాకిష్టం లేదు" ఆ మాట చెప్పాలంటే సుజాతకు గొంతు పెగిలి రాలేదు. బలవంతాన అన్నది.

"సుజా... అంతే నంటావా. నేను చెప్పినవన్నీ ఆలోచించు సుజా... వాళ్ళను అసలు అడిగి ఆ తర్వాత వాళ్ళా కాదంటే..." విజయ్ ఏదో చెప్పబోయాడు.

"ప్లీజ్ నన్ను విసిగించకు" కటువుగా అని ఫోన్ పెట్టేసింది సుజాత.

గదిలోకి వచ్చి కళ్ళనీళ్లు తుడుచుకుంది.

అమ్మయ్య. అతనికి ఈ మాట చెప్పటం ఎలాగ అని బాధ పడింది. కానీ చెప్పేసింది. ఎంతో కష్టం అనుకొన్న ఒక పని జరిగిపోయింది.

ఇక విజయ్‌ని తనవాడు అని అనుకోవడానికి వీలులేదు. తనకున్న క్లాస్‌మేట్స్‌లో, స్నేహితులలో అతనూ ఒకడు. అంతే... ఏ అనుబంధాలూ ఉండవు.

అతన్ని చూడకుండా ఉండగలదా. ప్రయత్నిస్తే కాని దేముంది.

ఆ సాయంకాలమే రిజల్ట్స్ వచ్చాయని తెలిసింది.

రిజల్ట్స్ పేపరుకి ఇచ్చారుట.

వెళ్లి చూసుకోవాలన్న ఆసక్తి కుతూహలం లేవు సుజాతకు. రేపు పేపర్లో చూడవచ్చు అనుకొంది నిరాసక్తిగా.

తనేనా ఇలా ఆలోచిస్తోంది. ఫస్టున రావాలని ఆశపడి వేయి దేముళ్ళకు మొక్కుకొని రాత్రింబవళ్ళు కష్టపడి చదివిన తనేనా రిజల్ట్స్ గురించి ఆసక్తి లేకుండా పట్టించుకోకుండా ఉంది.

అంతే. జీవితంలో నిన్న ఎంతో ముఖ్యమైంది ఇవాళ అవసరం లేనిదవుతుంది. ఇవాళ పనికిరానిది రేపు ప్రీతిపాత్రమవుతుంది.

మర్నాడు పొద్దున్న పేపర్ చూసి సంతోషంగా పిలిచారు జగన్నాథంగారు.

"నీకు యూనివర్సిటీ ఫస్టు వచ్చిందమ్మా నీ పేరు వేసారు"

"అలాగా నాన్నా"

జగన్నాథం గారు విస్మయంగా చూసారు. యూనివర్సిటీ ఫస్టు గురించి రాత్రింబవళ్ళు కృషి చేసిన సుజాతేనా ఇలా అంటున్నది.

బహుశా పిన్ని పోయిన దుఃఖం కాబోలు అనుకున్నారాయన.

క్లాసుమేట్స్, తెలిసినవాళ్లు అందరూ ఫోన్‌చేసి కంగ్రాట్స్ చెప్పారు.



### నిద్ర

రాత్రి ఓ డ్రాక్యులా సినిమా చూసొచ్చిన అలివేలుకు జ్వరమొచ్చింది.

"అంత భయంకర సినిమాకి ఎందుకెళ్ళారమ్మా పోనీ వెళ్తే వెళ్ళావు. సినిమా చూడకుండా కళ్ళుమూసుకోలేక పోయావా?" అన్నాడు డాక్టరు.

"ఎలా డాక్టరుగారు! మా ఆయన పక్క సీట్లల్లో ఇద్దరాడాళ్ళు కూర్చున్నారు. నేను కళ్ళు మూసుకుంటే ఆయనేం డ్రామా మొదలెడతారో అని సినిమా చూడక తప్పింది కాదు" చెప్పింది అలివేలు.

—వేదాల మురళీవేణు (హైదరాబాద్)

"థాంక్స్" అంది నిర్లిప్తంగా అందరితో.

విజయేంద్ర మాత్రం ఫోన్ చేయలేదు. అతను యూనివర్శిటీ సెకండ్ వచ్చాడు.

ఆ రోజు సాయంత్రం అడిగారు జగన్నాథం

"రిజల్ట్స్ కూడా వచ్చాయి కదమ్మా. నేను చెప్పిన శేఖర్ విషయం ఆలోచించావా. నీ అభిప్రాయం ఏమిటి?"

"మీ ఇష్టం నాన్నగారూ"

"అంటే నీకిష్టమేనామ్మా"

మౌనంగా తల ఊపింది సుజాత. అక్కడ్నుంచి కదిలింది.

* * *

సుజాత శేఖర్ పెళ్ళి నిశ్చయమయింది.

ఆరోజు మధ్యాహ్నం ఇల్లు సర్దుతోంది సుజాత. ఇంట్లో ఎవరూ లేరు. పెళ్ళి పనులమీద అంతా బయటకు వెళ్ళారు.

కాలింగ్ బెల్ మోగింది.

సుజాత వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా విజయ్ నాన్నగారు.

చూడగానే చెప్పవచ్చు ఆయన దేనికో బాధపడుతున్నారని.

"లోపలకు రావచ్చునామ్మా" ఆయన నవ్వుతూ అడిగారు.

సుజాత ఆయనను చూడగానే విజయ్ జ్ఞాపకాలతో ఈ లోకాన్ని మర్చిపోయింది.

ఆయన అలా అనగానే తుళ్ళిపడి పక్కకు తప్పుకొంది.

"సారీ. ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాను. రండి" అంటూ లోపలకు దారితీసింది. డ్రాయింగ్ రూమ్‌లోని సోఫాల్లో కూర్చున్నారు ఇద్దరూ.

"కంగ్రాచ్యులేషన్స్ అమ్మా. యూనివర్శిటీ ఫస్ట్ వచ్చావుట కదా"

"థాంక్సండీ" నెమ్మదిగా అంది.

"ఇంట్లో ఎవరూ లేరామ్మా"

"లేరండీ పనిమీద వెళ్ళారు"

ఆయన కొద్దిసేపు మౌనంగా ఉన్నారు. ఎలా మొదలు పెట్టాలా అని ఆలోచిస్తున్నట్లు ఉంది ఆయన మొహం.

"విజయ్ పరిస్థితి ఏమీ బాగా లేదమ్మా" నెమ్మదిగా అన్నారాయన.

సుజాత గుండె కలుక్కుమంది. ఏమైంది విజయ్‌కి.

"ఆరోగ్యంలో శ్రద్ధ తీసుకోడు. సరిగా తిండి తినటం మానేసాడు. ఎప్పుడూ ఏదో

ఆలోచిస్తూ కూర్చుంటాడు. వారం రోజుల్నుంచి జ్వరం. మందు తీసుకోడు"

సుజాత మౌనంగా వింటోంది.

"నీ పెళ్ళి నిశ్చయమయిందిట" ఆయన సూటిగా అడిగారు.

సుజాత మౌనంగా తలాడించింది.

"నువ్వేమీ అనుకోనంటే...."

"ఫరవా లేదు చెప్పండి...."

"విజయ్ చాలా మంచి పిల్లవాడమ్మా. నా కొడుకని చెప్పడం కాదు. నిజంగా అలాంటి వ్యక్తిని భర్తగా పొందగలగడం అదృష్టమే అనుకోవాలి. నీ గురించి ఇది వరకు విజయ్ చెప్పాడు. మీరిద్దరూ వివాహం చేసుకోవాలను కుంటున్నారని చెప్పాడు. మరి ఇంతలో నీ మనసెందుకు మార్చుకున్నావో అర్థం కావటంలేదు. నా మాట మన్నిస్తే నేను మీ నాన్నగారితో మాట్లాడి మీ పెళ్ళి జరిగేటట్లు చూస్తాను" అన్నారాయన.

సుజాత అడ్డంగా తలాడించింది వద్దన్నట్లుగా ఆయన మొహం ఎర్రబడింది.

"మళ్ళీ ఒకసారి ఆలోచించు" అన్నారాయన. సుజాత నుండి సమాధానం రాలేదు.

"నేను ఇట్లా మాట్లాడటం నీకు భావ్యంగా అనిపించక పోవచ్చు. ఎందుకంటే నీకు పెళ్ళి నిశ్చయమై సన్నాహాలు కూడా జరుగుతున్నాయి కాబట్టి. కానీ నాది తండ్రి గుండెమ్మా. ఒక్కగానొక్క కొడుకు. వాడి సంతోషమే మా సంతోషంగా బతుకుతున్నాం. వాడు ఇట్లా అన్నం నిద్రా మాని రోగిష్టి వాడిలా తయారవుతుంటే చూడలేక అడిగాను" ఆయన గొంతులో దిగులు ధ్వనించింది.

సుజాత రాయిలా కూర్చుంది.

"అంటే... నీ నిర్ణయం మారదా. మరి నేను వెళ్ళి రానామ్మా"

సుజాత సమాధానం చెప్పలేదు.

## మగువల మాటలు



ఆడవారి నోట్లో నువ్వు గింజ కూడా నానదనటం నిజమేనేమో? ఎందుకంటే ఈ మధ్యనే జరిగిన ఓ సర్వేలో సగటున స్త్రీలు రోజుకు కనీసం 12,620 పదాలు మాట్లాడతారని వెల్లడయింది. వ్యాపారవేత్త 11,580 పదాలు, పోలీస్ 10,660 పదాలు, మత ప్రవక్త 3,423 పదాలు మాట్లాడతారని కూడా ఈ సర్వేలో తేలింది!

అంటే ప్రపంచంలో అతి ఎక్కువ పదాలు మాట్లాడే వారు స్త్రీలే నన్నమాట! అయ్యా ఎందుకైనా మంచిది! ఈ రికార్డు ఫైనలైజ్ చేసేముందు మా దేశ రాజకీయవేత్తల్ని కూడా ఓసారి పరికించి చూడండి!

జూపిటర్

"కాఫీ తెస్తాను" అన్నది లేవబోతూ.

"అక్కర్లేదమ్మా, నీతో మాట్లాడాలనుకొన్నాను మాట్లాడాను. చాలు. ఇక ఆ భగవంతుడి దయ. ఎలా జరగాలనుంటే అలా జరుగుతుంది. కానీ ఒక్కమాట అనకుండా ఉండలేక పోతున్నానమ్మా. నువ్వు స్త్రీనా పాషాణానివా అని అనుమానంగా ఉంది. నీ నిర్ణయంలో మార్పులేకపోతే పోయింది. కనీసం విజయ్ ఆరోగ్యం గురించైనా పరామర్శించలేదు. చాలమ్మా వెళ్ళొస్తాను" ఆయన వెళ్ళిపోయారు.

సుజాత అలాగే శిలలాగా కూర్చుంది.

* * *

వైభవంగా జరిగిపోయింది సుజాత వివాహం. పెళ్ళికి సుజాత స్నేహితులంతా వచ్చారు. ఊహించనట్లుగా విజయ్‌కూడా వచ్చాడు. సుజాతకుచందనపు స్టాండ్‌లో ఉన్న శివపార్వతుల బొమ్మ కానుకగా ఇచ్చాడు.

ఏ లోటూ లేకుండా పెళ్లి జరిపినా మగ పెళ్ళివారు మాత్రం సంతృప్తి పడలేదు.

ఎక్కడికక్కడ పుల్ల విరుపు మాటలు, సాధింపుతో అందర్నీ హడలగొట్టారు.

తాము ఇవ్వాల్సిన కానుకలేమన్నా ఉంటే మాకు అనవాయితీ లేదని ఎగ్గొట్టారు. రావల్సినవన్నీ మాత్రం ఖచ్చితంగా పుచ్చుకున్నారు.

అయినా ఖర్చుకి జగన్నాథంగారు విచారించలేదు కానీ ఇలాటి మనుషులలో ముందు జీవితం ఎలా ఉంటుందో అని ఆయన బాధపడ్డారు.

కానీ వెంటనే సరిపెట్టుకున్నారు. ఏదో పెళ్ళి అవగానే అత్తగారు, ఆడపడుచులు గొడవ చేయక మానరు. అంతమాత్రాన జీవితమంతా అలాగే ఉంటారని అనుకోకూడదు.

అప్పగింతలు పెడుతుంటే జగన్నాథం గారికీ, సుభద్రమ్మ గారికీ గుండె బరువెక్కింది.

ఇక భర్తతో కాపరానికి వైజాగ్ వెళ్ళిపోతే మళ్లీ అతను ఎప్పుడుపంపిస్తాడో సుజాతను. మళ్ళీ ఎన్నాళ్ళకి చూడగలరో.

కళ్ళనీళ్ళు తుడుచుకొని అల్లుడికి అప్పగించారు.

సుజాత అందరిదగ్గర వీడ్కోలు తీసుకుంది.

ఆదర్శ జీవితం గడపాలనీ, భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ అన్నిటా సహధర్మచారిణి అనిపించుకోవాలనీ అనుకుంటూ, వేయి కోర్కెలతో కోటి ఆశలతో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది సుజాత.

* * *

వర్షం జల్లు పడుతోంది.

బయట ఆరేసిన బట్టలు తీసుకొచ్చి ఇంట్లో వేసింది సుజాత.

ఆమెకు బయటేకాదు తుఫాను ఇంట్లో కూడా వస్తుంది సుమా అని తెలుస్తోంది.
ఇంట్లో ఉన్న అందరి మొహాలూ కోపంగా ఉన్నాయి.
ఆ ఇంట్లోని మనుషులకు సుజాత ఒక వినోదపు వస్తువు.
ఆమెను మాటలని హింసించి భర్తతో నాలుగు చెప్పి అతను తిట్టి కొడుతుంటే చూసి ఆనందిస్తారు.

ఏమైనా పనిచేస్తే ఎందుకు చేసావని పోట్లాడుతారు. చెయ్యకపోతే ఎందుకు చెయ్యలేదని దెబ్బలాడుతారు.

"ఉమెన్స్ కాలేజీలో లెక్చరర్ పోస్టు ఉందిట. నేను అప్లై చేయనా" అడిగింది సుజాత తన పెళ్ళయిన కొత్తలో.

"అక్కర్లేదు. ఆడదానికి ఉద్యోగం ఎందుకు. ఏదో వంటచేసి తగలడు చాలు. నువ్వు సంపాదించింది నాకేం పొయ్యక్కర్లేదు." కటువుగా తిరస్కరించాడు శేఖర్.

"ఇపుడే కాదు. ఎపుడూ ఆ ప్రసక్తి తేకు" హెచ్చరించాడు.

ఉద్యోగం చేసి... సంపాదిస్తుంటే... అతని మనసులో ఆశ తొంగి చూసింది. కానీ అంతలోనే ఆ ఆశను తొక్కిపట్టి అణచివేసాడు. ఉద్యోగం చేసి సంపాదించడం సంగతి దేవుడెరుగు. నాలుగు రాళ్ళు సంపాదిస్తుంటే ఇక తనమాట వింటుందా అమ్మో... ఇంకా నయం అనుకున్నాడు.

ఈ రోజు ఆ ఇంట్లో అందరూ కోపంగా ఉండటానికి కారణం పక్కింటావిడ రమ్మంటే మార్కెట్‌కి వెళ్ళింది సుజాత.

సుజాత ఎవరితోనూ కలవడంకానీ స్నేహం చేయడం కానీ వాళ్ళకెవరికీ ఇష్టం ఉండదు.



అందుకే ఏదో ఒక వంక చెప్పి శేఖర్‌తో నాలుగు అనిపించాలని కూర్చున్నారు. శేఖర్ రాగానే అతన్ని పిలిచి ఏవో చెప్పింది సుజాత అత్తగారు వరహాలమ్మ.

శేఖర్ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వచ్చాడు సుజాత దగ్గరకు.

"మార్కెట్లో ఎవడితోటి మాట్లాడుతున్నావట" గద్దించాడు.

సుజాత సమాధానం చెప్పకుండా లోపలకు వెళ్లబోయింది.

"ఆగు" దారికి చెయ్యి అడ్డుపెట్టాడు.

"అడుగుతుంటే సమాధానం చెప్పకుండా పోతావేంటి అంత నిర్లక్ష్యమా"

"అదెందుకు చెపుతుందిరా. నిన్ను చూస్తే భర్తను చూసినట్లు ఉందా దానికి. ఎవర్నో ఒకర్ని కట్టుకోవాలి కాబట్టి నిన్ను కట్టుకుంది. ఒకణ్ణి భర్తగా ప్రకటించుకొంది కదా. ఇక దానికి అడ్డేంటి. నీ కళ్ళు కప్పి నానా నాటకాలు ఆడుతోంది. అయినా భార్యకు అంత చనువియ్యకూడదురా శేఖరం. కాస్త అదుపులో వుంచితేనే గానీ, అలుసిస్తే మాత్రం ఆడది నెత్తికెక్కి భరతనాట్య మాడుతుంది" వరహాలమ్మా, ఆమె చెల్లెలు వెంకాయమ్మ కలిసి శేఖర్‌కి ఎక్కించారు మెల్లమెల్లగా.

ఆ మాటలకు పౌరుషంతో కోపంతో వణికిపోయాడు శేఖర్.

కోపంగా సుజాత జుట్టు దొరకపుచ్చుకున్నాడు. ఎడంచేత్తో జుట్టు పట్టుకొని కుడిచేత్తో ఆమె చెంపలు ఛెళ్ళున వాయించాడు.

సుజాత మౌనంగా అతని పట్టునుంచి విడిపించుకొంది. అతని మొహంలోకి చూసింది.

ఆమె కళ్ళలో కనబడుతున్న జుగుప్సని అసహ్యాన్ని స్పష్టంగా చదవ గలిగాడు అతను.

ఏం చెయ్యలేక 'లోపలికి తగలడు' అన్నాడు.

లోపలకు వెళ్ళి బాత్‌రూమ్‌లో మొహం కడుక్కుంది సుజాత.

వరహాలమ్మా, వెంకాయమ్మ నిర్ఘాంతపోయి చూస్తున్నారు.

వాళ్ళ ఆశ్చర్యం అన్ని దెబ్బలు తినికూడా సుజాత కిక్కురుమనకుండా లోపలికి వెళ్లిపోవడం, కంట ఒక్కచుక్క నీరైనా ఒలికించకపోవడం.

"నువ్వు తన్నినా లక్ష్యం లేదురా" అన్నారు.

తల ఆడించాడు శేఖర్.

వంట పూర్తి చేసింది సుజాత.

అందరికీ వడ్డించి లోపలకు వెళ్లిపోయింది. ఆమె పిలుస్తుందేమోనని ఎదురు చూసారు.

చివరికి వాళ్లే వెళ్లి టేబుల్ ముందు కూర్చుని కంచాలు ఖాళీ చేసారు.

సుజాత ఆ పూట భోజనం చెయ్యలేదు. చెయ్యమని అడిగినవారూ లేరు.

శేఖర్ కోపం తగ్గలేదు.

సుజాతను కసితీరా కొట్టినా అతనికి ఏదో లోటుగానే ఉంది.

"అది వచ్చి క్షమించమని కాళ్లు పట్టుకొంటేనే దానితో మాట్లాడేది. ఎవరూ

మాట్లాడకండి దానితో'' అని హుకుంజారీ చేసాడు.

సుజాత ఏమీ మాట్లాడకుండా పడుకొంది. ఏవేవో ఆలోచనలు. నిద్రపట్టడం లేదు. లోకంలో స్త్రీ ఎన్ని చదువులు చదివినా ఉద్యోగాలు చేసినా ఆమెకు మగవాడి అండ లేనిదే మనుగడ కష్టం.

తీగె ఎంత అందమైనదైనా ఎంత బలమైనదైనా ఏం లాభం? ఆధారం లేనిదే నిలవ లేదు.

కంచం బంగారుదైనా, వెండిదైనా గోడ చేర్పులేనిదే నిలవలేదు.

ఆడది తీగైతే మొగవాడు పందిరి.

అందుకే అతని కంత అహంకారం.

ఆడదాన్ని చూస్తే అంత చులకన.

పసుపు తాడుకు మూడు ముడులు వేసి బిగించగానే పశువుమెడలో పలుపుతాడు కట్టినట్లు ఫీల్ అవుతాడు.

పశువు తన యజమానిని విడిచి ఎక్కడికీ పోదు. పోతే రక్షణ ఉండదు. బందుల దొడ్డి గతి అవుతుంది.

ఆడది భర్తను విడిచి ఎక్కడికీ పోదు. ఎంతైనా భర్త నీడన ఉన్న రక్షణ భర్త లేకుంటే రాదు.

తను తప్ప గతి లేదని తెలిసాక ఎవరికయినా అహంకారం ఉంటుంది. కానీ మంచి మనిషయితే ఆ అహంకారానికి చోటు ఉండదు. స్త్రీకి జీవితంలో ఎంత ప్రాముఖ్యం ఉందో గ్రహిస్తాడు కాబట్టి ఇవ్వవలసిన గౌరవం ఇస్తాడు.

అదే శేఖర్ లాంటి మూర్ఖుడయితే అతనికి భార్య అయినా స్త్రీ బతుకు అతి దుర్భరమవుతుంది.

ఇందులో మగవాడినని ప్రయోజనం ఉండదు. ఎందుకంటే భార్యాభర్తలు విడిగా కాపురం ఉన్నప్పటి కంటే ఉమ్మడి సంసారంలోనే స్త్రీకి కష్టాలు ఎక్కువ.

ఇలా కష్టాలను సృష్టించడంలో అత్తా, ఆడపడుచులు ప్రముఖ పాత్ర వహిస్తారు. మరి వారు ఆడవాళ్లు కారా. సాటిస్త్రీని హింసింపచేయడం న్యాయమేనా అని వారెన్నడైనా

## సినిమా ద్వారం



తను కట్టించిన సినిమా హాలుని స్నేహితులకి చూపిస్తున్నాడు కోటేశ్వరరావు.

"అదేమిటోయ్. ఇంత పెద్ద సినిమాహాలులో మరీ ఒకటే చిన్నద్వారం వుంచావ్. కష్టం కదూ'' అడిగాడు స్నేహితుడు.

"ఈ మధ్య వస్తున్న సినిమాలను దృష్టిలో పెట్టుకుని ఈ హాలు కట్టించానులే. అందరూ ఒక్కసారిగా బయటకు పారిపోడానికి వీల్లేకుండా'' చెప్పాడు కోటేశ్వరరావు.

సిరిసిల్లా రశీద్ శిక్షక్ (జంగంపల్లి)

భావిస్తారా.

మగవాడే దౌర్జన్యం సాగిస్తాడన్న మాట. కనక నిజమైతే కోడలి నెత్తిమీద కిరసనాయిల్ పోసి అంటించే అత్తలకు తావెక్కడ.

ఉన్నది మగవాడి దౌర్జన్యమూ కాదు. ఆడదాని ఆధిక్యతాకాదు.

కేవలం బలవంతుల ఆధిక్యత.

కొన్ని కాపురాలు చూస్తుంటే డార్విన్ మహాశయుడి సిద్ధాంతం జ్ఞాపకం వస్తుంది.

ఎవరు బలవంతులో వారిది పైచేయిగా ఉంటుంది. ఆ బలవంతులు అత్తయితే అత్తది, కోడలైతే కోడలిది పైచేయి. భార్య భర్తల్లో ఎవరు బలవంతులో వారిది పైచేయి.

ఆలోచనలతోనే తెల్లవారింది.

లోకానికి తెల్లవారినా సుజాత బ్రతుకులో చీకటులు తొలగలేదు.

అలాటి సుప్రభాతాలు ఎన్నో వచ్చాయి. కానీ ఏం లాభం.

చేసిన ప్రతి పనికి వంకలు.

తీర్చని లాంఛనాల గురించి తగవులు.

కట్నం చాలలేదని సాధింపులు.

రోజు రోజుకీ బతుకు దుర్భరమవుతోంది. ఏనాడైనా కొద్దిగా తీరిక దొరికితే ఆలోచనలు చుట్టుముట్టుతున్నాయి.

ఎంత మార్పు జీవితంలో.

ఎంత మారిపోయింది బతుకు. అందంలో, చదువులో, తెలివిలో అన్నిటిలో అందరి ప్రశంసలు పొందింది ఆ సుజాత.

ప్రతిదానికి వంకలతో వెటకారాలతో అవమానాల పాలవుతోంది ఈ సుజాత.

అద్దం ముందు నిల్చుంది సుజాత.

అద్దంలో ప్రతిబింబం పల్చని జుట్టులో, లోతుకు పోయిన కళ్ళతో పాలిపోయిన ఛాయలో వికృతంగా కన్పించింది.

తనలో ఇంత మార్పా.

తను దేనికీ చలించనదనుకొంది. తన హృదయం ఒక బండరాయి అనుకొంది.

కానీ తనలో ఇంత మార్పా. ఈ మార్పు చెప్పక చెపుతోంది తను చాలా మానసిక బాధను అనుభవిస్తున్నదని. ఇన్ని అనుభవాలు అయ్యాక కూడా తనలో ఇంత మార్పు దేనికి? ఇంత బాధ దేనికి.

దాదాపు పాతికేళ్ళు గడిచాయి. ఇంకొన్నేళ్ళు గడిపితే బతుకు గడిచిపోతుంది.

దానికింత బాధెందుకు.

సుఖంలో ఉన్నా సూర్యాస్తమయం తప్పదు. దుఃఖంలో ఉన్నామని రోజుకి ముప్పయ్ గంటలు ఉండవు. కష్టంలోనూ, సుఖంలోనూ రోజుకి ఇరవై నాలుగు గంటలే.



అందుకే ఎలాగో బిగబట్టుకుని జీవితం గడపగలవని భావిస్తూ వచ్చింది ఇన్నాళ్ళూ. కానీ తనకు తెలియకుండానే ఇంత బాధ అనుభవిస్తు ఉందన్నమాట.

వీల్లేదు. ఈ రోజునుంచి తను బాధపడకూడదు. దైవధ్యానంలో శాంతి ధైర్యం పొంది బతకాలి.

రోజూ పూజ చేయడం అలవాటు చేసుకొంది సుజాత.

ఇంటి లోపల పెరట్లో, నందివర్ధనం, పారిజాతం, మందార, మల్లె, చేమంతి మొదలైన పూలచెట్లు ఎన్నో ఉన్నాయి.

నీళ్ళు పోసే నాథుడు లేక కొనప్రాణంతో ఉండేవవి సుజాత రాకముందు.

సుజాత రోజూ నీళ్ళు పోయడంతో అవి విరగబూయడం మొదలు పెట్టాయి.

పొద్దున్నే లేచి స్నానం చేసి పూలసజ్జ నిండా పూలుకోసి ఆ తాజా పూలను దేవుడికి పెట్టి పూజ చేస్తుంటే ఏదో శాంతి లభించేది.

రామాయణం చదవడం మొదలు పెట్టింది.

నెమ్మదిగా బాధలకు దెబ్బలకు ఓర్చుకోవడం మొదలుపెట్టింది మనసు.

* * *

వంటింట్లో సింక్ ముందు నిల్చుని కంచాలు, గ్లాసులు కడుగుతోంది సుజాత.

ఇంట్లో ఎవరూ లేరు.

శేఖర్ ఇంట్లో లేడు. వరహాలమ్మా, వెంకాయమ్మా ఎవరో బంధువులింటికి వెళ్ళారు.

గేటు తీసిన చప్పుడయింది.

ఎవరా అని హాల్లోకి వచ్చింది.

విజయేంద్ర చరచరా లోపలకు వస్తున్నాడు. గుండె లయ తప్పినట్లయింది సుజాతకు. ఒక పక్క ప్రాణ మిత్రుణ్ణి చూసిన ఆనందం. ఇంకొక పక్క ఇపుడు ఎవరైనా వస్తే ఎలాగ అని భయం.

అన్ని సంశయాలు పక్కకుపెట్టి లోపలకు ఆహ్వానించింది.

''ఎలా వున్నావు సుజాత. ఎలా ఉంది కొత్త ఊరు కొత్త జీవితం. కొత్త మనుషులు'' అంటూ కూర్చున్నాడు విజయేంద్ర.

సుజాతవైపు ఆప్యాయంగా చూసాడు.

సుజాతకు దుఃఖం ఉప్పొంగి వచ్చింది.

పూర్వపు రోజులు జ్ఞాపకం వచ్చి ఆపుకోలేనంత ఏడుపు వచ్చింది.

తన ప్రాణమిత్రుడు, తన శ్రేయోభిలాషి, తన ప్రేమ పూజారి. తనను జీవిత భాగస్వామి కమ్మని ప్రార్థించిన ప్రేమమూర్తి.

కాదని తోసిరాజన్నా నిండుమనసుతో అర్థం చేసుకొని అంత బాధనూ దిగమింగుకొని తన పెళ్ళికి వచ్చి తనను మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన సహృదయుడు.

ఇతన్ని కాదని వచ్చినందుకే ఇన్ని బాధలు, ఇన్ని కష్టాలు. ఆనాడు అతను అంత

వచ్చిచెప్పినప్పుడు అతను చెప్పినట్లే విని ఉంటే బతుకెంత సుఖంగా ఉండేది.

ఛీ తన మనసెంత హీనంగా ఆలోచిస్తోంది. పరాయి వ్యక్తి గురించి ఇలా ఆలోచించడం....

ఆలోచనలు పక్కకు పెట్టి అతని వైపు చూసింది.

"బాగానే ఉన్నాను" అన్నది.

అతను ఆమె వైపు పరీక్షగా చూసాడు.

చిక్కి శల్యమైన శరీరం. కళా విహీనమైన మొహం స్పష్టంగా చెపుతున్నాయి ఆమె సుఖంగా లేదని.

"కూర్చో సుజాతా" అన్నాడు. ఆమె కూర్చుంది.

అతను ఏవో కబుర్లు చెప్తున్నాడు.

ఆమెకేమీ వినబడడం లేదు. ఆమె ఆలోచనల్లో ఆమె ఉంది.

విజయ్ తన బ్రీఫ్‌కేస్ లోంచి ఒక పాకెట్ తీసి సుజాతకు ఇచ్చాడు.

సుజాత తెరిచి చూసింది.

లేత గులాబీ రంగులో చిన్నచిన్న జరీ బుటాలు పెద్ద బార్డర్ ఉన్న బెనారస్ చీరె. అదే రంగు జాకెట్ బట్ట.

"తీసుకో సుజాత. మా అమ్మగారు నీకిమ్మని ఇచ్చారు" అన్నాడు.

"వద్దు" అంది సుజాత దృఢంగా.

"ఇప్పుడివేవీ వద్దు. మీ పెళ్ళికి వస్తానుగా అపుడు పెడుదురుగాని" అన్నది.

"అప్పుడింకోటి పెడతాలే. ప్రస్తుతం ఇది తీసుకో"

"ఊహు వద్దు"

విజయేంద్ర ఆమె మొహంలోకి చూసాడు. విషాదమూ, ఆందోళనా వ్యక్తం చేస్తున్న ఆ మొహం చూసి వెంటనే ఆ పాకెట్‌ని బ్రీఫ్ కేస్‌లో పెట్టేసాడు. ఏదో కారణం లేనిదే సుజాత



## ఏడుపు పోటీ

ప్రపంచంలో అనేక రంగాలలో పోటీలు జరుగుతూ ఉంటాయి. అయితే ఏడుపుపోటీ జరగటం మటుకు నిజమైన విచిత్రమే! ఇండోనేషియాలోని 'సెమారంగ్'లో ఈ మధ్యనే ఏడుపు పోటీలు జరిగాయి. 28 మంది ఆ పోటీలో ఫైనల్స్‌కు చేరుకొన్నారు. వారంతా రకరకాల ఏడుపులు ఏడుస్తూ న్యాయ నిర్ణేతల్ని ఆ కట్టుకోవటానికి కృషి చేశారు. భర్త చనిపోయినప్పుడు ప్రేయసి తనని వదిలేసి మరొకరిని ప్రేమించినప్పుడు వంటి కొన్ని సంఘటనల్ని తీసుకొని ఏడిచారట పోటీదారులు! అదే స్థలంలో నవ్వు, విజిల్ వంటి మరికొన్ని పోటీలనుకూడా నిర్వహించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయట! శుభం!

జూపిటర్

ఇంత ఖచ్చితంగా తిరస్కరించదు.

ఏదో మాట్లాడుతున్నారు కాలం గడవటానికి. అతను ఏమి మాట్లాడుతున్నా అతని మాటలకు అవును కాదు అని తప్ప ఏమీ సమాధానం చెప్పడంలేదు సుజాత.

లోపల భయంగా ఉంది.

శేఖర్ లంచ్ టైమ్‌లో అపుడపుడూ ఇంటికి వస్తాడు.

అసలే అనుమాన పిశాచం ఉంది.

దానికి తోడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో విజయేంద్రను చూస్తే...

ఏం చెప్పినా నమ్మడు.

పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చన. శేఖర్ గుణం నీచమైంది. అతనికి మంచి అభిప్రాయాలు ఎన్నడూ కలగవు.

సుజాతకు బిక్కుబిక్కు మంటోంది గుండె.

విజయ్‌ని వెళ్ళిపొమ్మంటే? ఏం బాగుంటుంది.

ఇన్నాళ్ళకి తనని చూద్దామని తన ఆత్మీయులొకరు వస్తే కప్పు కాఫీ కూడా ఇవ్వలేని బతుకయింది.

మౌనంగా అతను మాట్లాడేది వింటోంది. గేటు తీసిన చప్పుడయింది.

శేఖర్ లోపలకు వచ్చాడు. వెనకే వరహాలమ్మా వెంకాయమ్మా ఉన్నారు.

సుజాత హడలి పోయింది.

శేఖర్ రాగానే విజయ్‌ని చూసాడు.

''మా క్లాస్‌మేట్ విజయేంద్ర''

''గుర్తుంది పెళ్ళిలో చూసాముగా బాగున్నారా''.

సుజాత ఆశ్చర్యపోయింది.

''బాగున్నానండీ, గుర్తున్నానన్నమాట'' వినయంగా అన్నాడు విజయ్.

''కూర్చోండి. నిలబడ్డారేం సుజా కొంచెం కాఫీ తీసుకురా. మీరు భోజనం చేసారాండీ... అయ్యో లేదా అయితే మా ఇంట్లో ఇవాళ మీరు లంచ్ తీసుకోవాలి తప్పదు. అలా చూస్తూ నిలబడతావేం సుజా... వెళ్లి కాఫీ తీసుకువచ్చి భోజనానికి ఏర్పాటు చెయ్యి...''

సుజాతకు కలయో వైష్ణవ మాయయో అన్నట్లుంది.

లోపలకు వెళ్లి కాఫీ తెచ్చి వంట ప్రయత్నాలు చేసింది.

ఆలుగడ్డలు వేయించింది. వంకాయ ముద్దకూర చేసింది. దోసకాయ పచ్చడి చేసి అప్పడాలు వడియాలు వేయించి డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్దింది.

''భోజనానికి రండి'' పిలిచింది.

వరహాలమ్మ వెంకాయమ్మ కూడా కూర్చున్నారు టేబుల్ దగ్గరే.

చేతులు కడుక్కొని వచ్చారు శేఖర్, విజయేంద్ర. నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ

"నువ్వు కూడా కూర్చో సుజాతా" అన్నాడు విజయ్.

సుజాత వద్దన్నట్లు తల ఊపింది.

"ముందు మీరు కానీయండి" అంది.

ఆమెకు విజయ్ తొందరగా వెళ్లిపోతే బాగుండునని ఉంది. విజయ్‌కి ఇంకా తనమీద ప్రేమాభిమానాలు అలాగే ఉన్నట్లున్నాయి. ఇతను తనతో ఆప్యాయంగా మాట్లాడుతుంటే తనకి ఎంతో బాధగా ఉంది.

అమూల్యమైన ప్రేమాభిమానాలను ప్రేమించే వ్యక్తిని పోగొట్టుకుంది తను.

వ్యర్థమైన పరువు ప్రతిష్ఠలకు తన జీవితాన్నే పణంగా పెట్టింది.

ఆత్మీయుల చేయినవదిలి శత్రుమూకలోకి వచ్చిపడింది.

నిజంగా తను ఎంత దురదృష్ట వంతురాలు. తన వివాహం విజయ్‌తో జరిగితే పరువు ప్రతిష్ఠలు దెబ్బ తింటాయనుకుంది.

కేవలం ఒక ఇంట్లోని ఒక వ్యక్తి పెళ్లిమీద ఆధారపడి ఉంటాయా పరువు ప్రతిష్ఠలు. అంత తుమ్మితే ఊడేముక్కు ఎన్నాళ్లుంటుంది?


యుగం మొదలైనప్పుడు ఎక్కడ ఉన్నాయి ఈ కులాలు మతాలు. కేవలం వృత్తిని విభజించడానికి ఏర్పరచిన ఈ కులాలు చివరికి మనిషికి మనిషికి మధ్య అడ్డుగోడలయ్యాయి.

మానవులందరిదీ ఒకే కులం అయే రోజు ఎపుడొస్తుందో?

"ఏంటి బొమ్మలా నిలబడ్డావు. వారికేం కావాలో అడుగు" శేఖర్ మాటలతో ఈ లోకంలోకి వచ్చింది సుజాత.

"ఏంవద్దండీ!" మొహమాటంగా అన్నాడు విజయేంద్ర.

"ఇంకొంచెం అన్నం వడ్డించుకోండి" శేఖర్ విజయేంద్ర ప్లేట్‌లో అన్నం వడ్డించి



కొంచెం అలుగడ్డ వేపు డు వేశాడు.

సుజాతకి మాత్రం ఇంకా అర్థం కావడంలేదు. ఎందుకింత ప్రేమ వటిస్తున్నాడు.

చివరికి అనుమానించదు కదా.

అతని తత్వం కనుక్కోవడం కష్టం.

మంచిగా ఉన్నట్లే ఉండి చివరికి నానా తిట్లూ తిట్టికొట్టిన రోజులు ఎన్నో.

అందుకే బిక్కుబిక్కు మంటోంది మనసు.

"మీ గురించే చెప్తూంటుందండీ సుజాత ఎల్లప్పుడూ. చాలా మంచివారని, ఎందరికో సహాయాలు చేశారని..."

ఇదేంటి తనెప్పుడు చెప్పింది అలాగ. సుజాత ఆశ్చర్యపోయింది.

"మీ నాన్నగారు రాజా స్టీల్ లిమిటెడ్‌కి డైరెక్టరట కదా?"

"అవునండీ!" అన్నాడు విజయ్.

"మా చిన్నకొడుకు బికామ్ పాసయ్యాడండీ. వాడికి ఆ కంపెనీలో అకౌంటెంట్‌గా ఏమన్నా వీలుంటుందాండీ?"

ఇదా సంగతి. అందుకే కాబోలు. అంత ప్రేమ నటిస్తున్నాడు. వెంకాయమ్మ కొడుకు కృష్ణ గురించి కాబోలు అడిగేది. బికామ్ ఆరుసార్లు రాసి పాసయిన కృష్ణ అకౌంటెంట్‌గా చేయగలడా? అదీగాక రాజాస్టీల్స్ వాళ్ల అకౌంటెంట్‌గా చార్టెర్డ్ అకౌంటెంట్‌గానీ, కాస్ట్ అకౌంటెంట్‌గానీ అయితేనే తీసుకుంటారు.

అదే మాట చెప్పాడు విజయ్.

"మా కంపెనీలో చార్టెర్డ్ అకౌంటెంట్ అయితేతప్ప తీసుకోరండీ. పోనీ ఒకటి చేద్దాం. అకౌంట్స్ అసిస్టెంట్స్‌గా చేరనీయండి ముందు. తర్వాత నెమ్మదిగా ఎక్స్‌పీరియన్స్‌మీద మంచి ఉద్యోగం రావచ్చు."

"జీతం ఎంత ఉంటుందో?" వెంకాయమ్మ దీర్ఘం తీసింది.

"వెయ్యి పన్నెండొందల మధ్య ఉండవచ్చు" వాళ్ల మొహాలు వికసించాయి.

"ఏదో ఒకటి చూసిపెట్టండి. సుజా ఎప్పుడూ అంటూనే ఉంటుంది విజయ్‌కి చెపితే ఏదో ఒకటి చూస్తాడని" అన్నాడు శేఖర్.

సుజాత ఏం మాట్లాడకుండా మౌనంగా విల్చుంది.

విజయ్ తలెత్తి ఆమెకేసి చూశాడు.

మొత్తానికి ఏదో గందరగోళం జరుగుతోందని పసికట్టాడు.

సుజాత మొహం చూస్తేనే ఆమె సుఖంగా లేదని తెలుస్తోంది. ఆమె భర్త వచ్చేవరకు తను చెప్పిన మాటలన్నీ మౌనంగా వినడమే కానీ తనకు తను నోరువిప్పి ఒకటీ మాట్లాడలేదు.

తనని శేఖర్ పలకరించినపుడు ఆమె మొహంలో ఆశ్చర్యం కనిపించింది.

సుజాతతో తనకున్న సాన్నిహిత్యంవల్ల ఆమె మనసెలా ఉందో తేలికగా కనిపెట్టగలడు.

ఈ మనుషులంతా పరమ కర్కోటకుల్లా కనిపిస్తున్నారు. తెచ్చిపెట్టుకున్న ప్రేమా, మర్యాదా కనిపిస్తున్నాయి.

పెళ్లిలోనూ తరువాత వీళ్ల చేసిన గొడవలు ఇప్పటికీ జ్ఞాపకం ఉన్నాయి.

నెస్‌కేఫ్ తప్ప తాగమని గొడవచేస్తే ఎవరికీ వీలుకాకపోతే చివరికి తమ క్లాస్‌మేట్ వినోద్‌వెళ్లి నెస్‌కేఫ్ డబ్బాలు తీసుకొచ్చాడు.

ప్రతిదానికీ వంకలుపెడుతూ వెటకారం చేస్తూ గుణుస్తూ సాధిస్తూ పెళ్లిలో గొడవగొడవ చేశారు.

డబ్బు మనుషులు కాబట్టి తన డబ్బుని చూసి తనకు విలువ ఇస్తున్నట్లున్నారు.

అతని మనసు బాధగా నిట్టూర్చింది.

పాపం సుజాత. కొంతమందిని విధి ఎందుకో చిన్నచూపు చూస్తుంది. వాళ్లు ఎంతో ఎడాప్టబుల్ నేచర్ కలిగి ఎక్కడికక్కడ పరిస్థితులకు రాజీపడి సర్దుకుపోతుంటారు. కానీ వాళ్లకు అలా సర్దుకుపోవడానికి కూడా వీలులేని పరిస్థితులొస్తూ ఉంటాయి.


తనతో పెళ్లి జరిగితే ఇంట్లో వాళ్లకు కష్టం కలుగుతుందని వాళ్లు చూపిన సంబంధమే ఒప్పుకుంది సుజాత. అలా చేయడానికి ఆమె మనసు ఎంత కష్టపడిందో ఎంత బాధపడిందో తనకు తెలుసు.

తర్వాత భర్తతో సరిపెట్టుకు పోవాలని బాగానే ప్రయత్నించి ఉంటుంది. సుజాతతత్వం తనకు బాగా తెలుసు. పెళ్లికార్డు ఇచ్చినపుడు తనను మరిచిపోతున్నానని, శేఖర్ భార్యగా పూర్తి బాధ్యతలు స్వీకరిస్తున్నానని చెప్పింది.

ఆమె సిన్సియారిటీ తనకు తెలుసు.

అంటే శేఖర్ ఆమెని బాధ పెడ్తున్నాడా?

అతనికి గుండె ఆగిపోయినట్లు అనిపించింది.



### నడక

లెక్కల పాఠం చెబుతున్నాడు మాష్టారు.

"ఏరా గోపీ... ఒక వ్యక్తి పొద్దున పదిగంటలకు మన వూరు మర్రి చెట్టు నుండి బయల్దేరి కొంతదూరం నడిచి కుడివైపుకి తిరిగాడు. ఆ తర్వాత కొంతసేపటికి ఎడంవైపు తిరిగాడు. మరి కాసేపు నడిచి మళ్ళీ ఎడంవేపు ఆ తర్వాత కుడివైపు కుడినుంచి ఎడంవైపు తిరిగాడు. అయితే ఇప్పుడతను ఏ దిశలో నడుస్తున్నాడు" అని అడిగారు మాష్టారు.

"ఇంకా నడకేమిటండీ... ఆయనెవరోగానీ పాపం మూర్ఛవచ్చి ఎప్పుడో పడిపోయుంటాడు" చెప్పాడు గోపీ.

—హెచ్.ఎస్. సురేష్‌కుమార్ (మాళ్లూరుపేట)

ఇప్పటికీ అతని హృదయంలో సుజాత స్థానం చెక్కుచెదరలేదు. సుజాత బాధ పడుతోందంటే గుండెని పిండుతున్నట్లు అనిపిస్తున్నది.

బలవంతాన ఆ అభిప్రాయం మార్చుకున్నాడు.

ఎందుకలా అనుకోవాలి?

శేఖర్ బాగానే చూసుకుంటున్నాడేమో?

సుజాతకి ఇవాళ మూడ్ సరిగా లేక అలాగ ఉందేమో?

అలా అనుకోగానే ఎంతో శాంతిగా అనిపించింది.

భోజనాలైనాక కొద్దిసేపు కూర్చుని వెళ్తానంటూ లేచాడు.

శేఖర్ చిరునవ్వుతో వీడ్కోలిచ్చాడు.

కృష్ణ సంగతి మళ్లీ గుర్తు చెయ్యబోతే"నేను తప్పకుండా ట్రై చేస్తాను. మీరిక ఆ విషయం మరిచిపోండి"అన్నాడు విజయ్.

అతన్ని పంపి లోపలకువచ్చాడు శేఖర్.

''నిజంగా చూస్తాడ్రా ఉద్యోగం'' వరహాలమ్మ అడిగింది.

''చూస్తాడు ఎవడికోసం చూస్తాడు'' అన్నాడు శేఖర్.

వంటింట్లోకి వచ్చాడు.

సుజాతను చూస్తూ అన్నాడు.

''ఏంటి ఆశ్చర్యపోతున్నావు. నీ మాజీ ప్రియుడిని ఈ మాత్రమైనా మర్యాద చేయనక్కర్లేదా... పాపం కరిగిపోయి ఉద్యోగం చూసేస్తానంటూ బయల్దేరాడు''

సుజాత నిశ్చేష్టలుడిగి నిల్చుంది.

''ఏం నాకెలా తెలిసిందను కుంటున్నావా. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతుందిట. నాకు ఏం తెలీదేమో నని రోషాలు వేషాలు వేయబోయావు. ఇంక పిచ్చివేషాలేయక చచ్చినట్టు పడుండు''

సుజాతకు అర్థమైంది.

భర్త తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు.

''ఇంక నీకు వేరే దిక్కులేదు సుజాతా. నేను కొట్టినా తిట్టినా పడుండాల్సిందే. కాదని నీ ఇంటికి పోయావా నీ పాత ప్రేమికుడ్ని మరిచిపోలేక నన్ను అవమానించి బాధిస్తున్నదని, భర్తగా చూడడంలేదని చెపుతాను. వాడింకా రాకపోకలు సాగిస్తున్నాడని చెప్తాను. వాళ్ళ నమ్మకేం చేస్తారు. నీ ప్రేమాయణం ఊరంతా తెలిసిందే. దాంతో నిన్ను తిట్టి, తన్ని తగలేస్తారు. నా కాళ్లదగ్గరకు తెచ్చి పడేస్తారు. అర్థమయిందా. బుద్ధిగా ఉండు''

సుజాత సమాధానం చెప్పలేదు. తల వంచుకుని గిన్నెలన్నీ శుభ్రంగా కడిగి బోర్లించింది. ఇంక బాధ పడి ప్రయోజనం లేదు. రోజూ ఉండేవాటిని ఎన్నాళ్లని ఏడవడం. ఈ మాటలేవీ పట్టించుకోకుండా తన పని తను చేసుకుపోవాలి.

ఒకటి మాత్రం తేటతెల్లమైంది. తనకు ఈ ఇల్లు తప్ప భర్తతప్ప గతిలేదు. ఇక్కడ్నుంచి తప్పించు కోవడానికి వీలులేదు.

వీల్లేంచేసినా భరించాల్సిందే.

తను ఇక్కడ బందీ, ఇది తనకు యావజ్జీవ కఠిన కారాగారశిక్ష.

తను నిస్సహాయురాలు.

సుజాతకు పొంగిపొర్లి దుఃఖం వచ్చింది.

చేతుల్లో మొహం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

ఎక్కడికి పోతుంది తను.

ఎవరున్నారు తన వారు?

ఎక్కడైనా తనకు ఏదో ఒక ఉద్యోగం దొరకకపోదు. తన బతుకు తను బతకవచ్చు.

కానీ ఏం లాభం. ఏ ప్రయోజనాన్ని ఆశించి తను ఈ పెళ్లి చేసుకున్నదో ఆ ప్రయోజనమే లేకుండా పోతుంది.

తన తల్లీ తండ్రీ తను అలాగ భర్తను విడిచి బతుకుతుంటే చూసి సహిస్తారా? పరువు మర్యాదలేమవుతాయి. అదీగాక శేఖర్ అన్నట్టు వాళ్లకు కూడా అనుమానం వస్తుంది. శేఖర్ అన్న మాటలన్నీ నమ్ముతారు.

తను ఆ ఊహే భరించలేదు. తప్పదు ఇక్కడే బతకాలి ఉన్నన్నాళ్లూ. ఆ రాత్రంతా ఏడుస్తూనే గడిపింది సుజాత.

* * *

కష్టాలు పడేవాళ్లకి ఇంకా కష్టాలు పెడుతూనే ఉంటాడు భగవంతుడు.



## గూడులేని అభాగ్యులు

మన దేశంలో తినటానికి తిండి సంగతి అటుంచి గూడుకూడా లేని నిర్భాగ్యుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ఈ మధ్యనే సేకరించిన ఓ సర్వే ప్రకారం కలకత్తాలో 48,440 మంది, ఢిల్లీలో 26,777 మంది, బొంబాయిలో 50,185 మంది ఉండటానికి ఎలాటి గూడూ లేకుండా ఫుట్ పాత్‌ల మీద వెల్ల కింద కాలక్షేపం చేస్తున్నారు.

మరి ఇంతమంది అభాగ్యులు అలా... నానా యాతనలు పడుతోంటే ఈ పేద ప్రజాస్వామ్య దేశాన్నేలే రాజకీయ నాయకులు మాత్రం ఎంతటి స్వర్గ సౌఖ్యాలలో తేలియాడుతున్నారో.... తెలియని దెవరికి సార్!

జూపిటర్

బతుకులో రాజీపడి బతుకుతున్న సుజాతకు అనుకోని అవాంతరం వచ్చి పడింది.

శేఖర్ వ్యాపారం చేయాలనుకున్నాడు. ఫ్రెండ్సంతా వ్యాపారాలు చేసి బాగా సంపాదించారు. ఉద్యోగం చేస్తే ఎన్నాళ్లయినా ఎదుగూబొదుగూ ఉండదు.

కానీ అదే వ్యాపారమైతే అంతా లాభమే.

ఉద్యోగానికి రిజైన్ పెట్టాడు.

పెట్టుబడి ఎక్కడ్నుంచి వస్తుంది?

ఉపాయం చెప్పారు వరహాలమ్మా, ఆమె చెల్లెళ్లూ.

"మీ మామగారిని అడగరా. తన కూతురి కోసమేగా ప్రస్తుతానికి లక్ష రూపాయలు ఇమ్మను. అప్పుగానే తీసుకో. మనకెందుకు వాళ్ల డబ్బు?"

"వింటున్నావా? ఒకసారి మీ ఊరెళ్లి మీ నాన్నను అడిగి డబ్బు తీసుకురా. లేకపోతే..."

సుజాతకు ఓర్మి నశించింది.

"లేకపోతే..." రెట్టించింది కోపంగా.

"లేకపోతే నువ్వింక ఈ ఇంట్లో అడుగు పెట్టక్కర్లేదు."

సుజాతకు నోటమాట రాలేదు.

లక్ష రూపాయలు.

ఎక్కడ్నుంచి తెస్తారు వాళ్లు.

అప్పుఅని పేరుకి మాత్రమే. అవి ఇక తిరిగిరావు. తిరిగి రావడానికి అసలు అవి ఉంటాయా?

లేకపోతే ఇక తనతో తెగతెంపులు చేసుకోవచ్చు శేఖర్.

"అంత డబ్బు హఠాత్తుగా ఇమ్మంటే ఎక్కడ్నుంచి తెస్తారండీ. మీరు అలాగ అంటే ఎలాగ" సుజాత కంఠం రుద్ధమైంది.

"మీ నాన్న రిటైర్ అయాడుగా బాగానే వచ్చి ఉంటాయి. ఇమ్మారెన్నలు అవీ..." గోదావరమ్మ అన్నది.

సుజాతకు అసహ్యం వేసింది.

గోదావరమ్మ తెలివితేటలు అమోఘం. ఆవిడ తెలివికి ఉద్యోగం చేయలేదుగానీ చేస్తే ఏమయి ఉండేదో. రిటైరైన డబ్బులున్నాయని క్షణాలమీద చెప్పింది.

"మా చెల్లెలు పెళ్లికి ఉందికదా. ఇంకా ఎన్నో ఖర్చులున్నాయి మా నాన్నగారికి" అన్నది.

"ఓహో లక్ష రూపాయలు కట్నం ఇస్తాడా. నీకు ముప్పయివేలేగా ఇచ్చింది" అన్నది గోదావరమ్మ.

"అదంతా నాకు తెలీదు"

శేఖర్ కలుగజేసుకున్నాడు.

"ఇంతకూ ఏమంటావు. డబ్బు తీసుకు రావంటావా. అసలు వెళ్లి అడిగి చూడు



ఆయనేమంటాడో. నువే ముందు ఏదో అని ఏడుస్తావేం'' అన్నాడు.

సుజాత ఏం మాట్లాడకుండా నిల్చుంది.

''రేపటి ట్రెయిన్‌కి రిజర్వేషన్ చేశాను. సామానేదన్నా ఉంటే సర్దుకో'' అన్నాడు శేఖర్.

సుజాతకు అర్థమైంది. ఇదంతా వాళ్లు ముందుగానే ఆలోచించుకుని చేసిన వ్యవహారం. ఇక తను ఏం మాట్లాడినా లాభం ఉండదు. తను పోనన్నా మెడబట్టి పంపిస్తారు.

మౌనంగా గదిలోకి వెళ్లిపోయింది.

* * *

ఆటో దిగిన సుజాతను చూసి ఆశ్చర్య పోయారందరూ.

"ఇదేంటి ఇలా చెప్పకుండావచ్చావ్?"

"ఎన్నాళ్లకొచ్చావక్కా?"

"ఏంటి ఇంత చిక్కిపోయావ్. బెంగ పెట్టుకున్నావా?"

"అత్తా మాకేం తెచ్చావు?"

* * *

అందరికీ చిరునవ్వే సమాధానంగా లోపలకు నడిచింది.

"ఇదేంటమ్మా ఉత్తరం రాస్తే స్టేషన్‌కి వచ్చేవాళ్లం కదా" ఆప్యాయంగా పలకరించారు జగన్నాథం గారు.

"బాగున్నారా నాన్నా?"

"బాగున్నానమ్మా. రిటైర్ అయామకదా. ఇంటిపట్టునే ఉంటున్నాను. ఏంటి ఏదైనా పనిమీద వచ్చా వా?"

"చెప్తాను నాన్నా" సుజాత లోపలకు వెళ్లి కాళ్లుచేతులు కడుక్కుని తల్లి అందించిన కాఫీ తీసుకుంది.

సుజాతకేసి పరీక్షగా చూశాడు జగన్నాథంగారు. ఆమె కళ్లకింద నల్లని గీతలు, చిక్కిన శరీరం, పాలిపోయిన శరీరఛాయ చూడగానే గ్రహించాడు సుజాత దేనికో బాధ పడుతోందని.

"ఆయన మంచివారేగామ్మా. నిన్ను బాగానే చూసుకుంటారా?"

"మంచివారే నాన్నా. బాగా చూసుకుంటారు."

సుజాత అందరితోటీ సంభాషణలో పడింది.

భోజనాలైనాక పైన పడుకునేందుకు వెళ్ళిపోయారందరూ.

సుజాత కిందే ఉండిపోయింది.

తండ్రి గదికేసి చూసింది.

ఏదో చదువుకుంటున్నారు ఆయన. గుమ్మం దగ్గరకు వెళ్లి నిల్చుంది.

"రామ్మా" ఆప్యాయంగా పిలిచారాయన.

లోపలకు వెళ్ళి కుర్చీలో కూర్చుంది సుజాత. ఎలా మొదలు పెట్టాలో అర్థం కావడంలేదు. రెండురోజుల్లో డబ్బు అడిగి తీసుకురమ్మన్నాడు శేఖర్. ఏమని అడగాలి?

''ఆయన్ని కూడా రమ్మనాల్సిందమ్మా''

అమ్మయ్య అనుకొంది సుజాత. సంభాషణ ఆ దారిలోకి మళ్ళించవచ్చు.

''ఆయన వ్యాపారం చేద్దామనుకొంటున్నారు నాన్నా దాని పనులమీద బిజీగా ఉన్నారు''

''వ్యాపారమా''

''అవును నాన్నగారూ పెట్టుబడి కోసం తిరుగుతున్నారు. మీరేమన్న సర్దగలరా''

ఆయన ఆశ్చర్యపోయారు. సుజాతేనా అడుగుతోంది అనిపించింది.

''నేనేం సర్దగలనమ్మా''

సుజాతకు అర్థమైపోయింది. బహుశా తండ్రికి ఎంతమాత్రమూ వీలు కాదేమో. లేకుంటే ఆయనింత త్వరగా చెప్పేవారు కాదు. కనీసం చూద్దాం అనైనా అనేవారు.

ఆయన సుజాతకేసి చూస్తున్నారు.

సుజాత తల దించుకొంది.


తను చచ్చిపోవాలి.

తను చచ్చిపోతే ఎంత బాగుంటుంది.

ఎవరికీ ఏ బాధలూ ఉండవు.

సమస్యలన్నీ చిటికెలో పరిష్కారమైపోతాయి.

కానీ ఎలాగ? తనని కని పెంచి పెద్దచేసి పెళ్లిచేసి తను సుఖంగా బతకాలని కోరుకుంటూ ఉన్న తన తల్లిదండ్రులు లేమవుతారు.



ఈ పెద్ద వయసులో వారికి అది ఎంత దెబ్బ. కన్న కూతురు కళ్ళ ఎదుటే మరణించడం కన్నా దుఃఖం ఉంటుందా.

సుజాత ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన విరమించుకుంది.

ఇలాగే బతకాలి. క్షణం క్షణం చంపుతూ ఉంటాడు శేఖర్. రోజూ చస్తూ శాశ్వత నిద్రకోసం ఎదురు చూస్తుండాలి.

అసలు తనని శేఖర్ తిరిగి రానిస్తాడా.

ఈ ఆలోచన రాగానే భయంతో వణికిపోయింది సుజాత. డబ్బు లేకుంటే తిరిగి రానక్కర్లేదని స్పష్టంగా చెప్పాడు.

తనని ఇక రానిస్తాడని నమ్మకం ఏంటి? సుజాత కళ్లల్లో నీళ్ల తిరిగాయి.

అంతా గమనిస్తూనే ఉన్నారు జగన్నాథం గారు.

లేచి వచ్చి సుజాత తలమీద చేయివేసారు.

"దేనికో బాధ పడుతున్నట్లున్నావు సుజా. నా దగ్గరేం దాచకమ్మా. చెప్పు ఎందుకు బాధపడ్తున్నావు" అన్నారు.

వెక్కి వెక్కి ఏడ్చింది సుజాత.

విర్హాంతపోయారు జగన్నాథంగారు.

శాంతంగా గంభీరంగా ఉండే సుజాత తెలివితేటల్లో, చదువులో ఫస్టున నిలిచే సుజాత ఏ సమస్యనైనా తెలివిగా పరిష్కరించు కోగలిగిన సుజాత, సుజాతకి కూడా కన్నీళ్ళా. ఆమె అలా వెక్కి వెక్కి ఏడుస్తున్నదంటే ఎంత క్షోభ అనుభవిస్తూ ఉందో తెలుస్తునే ఉంది.

"చెప్పమ్మా. ఏంటి నీ బాధ" అన్నారు. చెప్పలేక చెప్పింది సుజాత.

శేఖర్ ప్రవర్తనా, అత్తగార్ల ఆరడీ, ఆడపడుచుల అజమాయిషీ అంతా చెప్పింది.

"ఇప్పుడు లక్షరూపాయలు తేకపోతే ఇంక నన్ను రావద్దన్నారు నాన్నా" కుళ్ళి కుళ్ళి ఏడ్చింది సుజాత.

మౌనంగా విల్చున్నారు జగన్నాథంగారు. కూతురి భగ్నజీవితం తెలుసుకొన్నాక ఆయన గుండెల్లో అగ్ని పర్వతాలు లేస్తున్నాయి.

ఎట్లా ఈ సమస్య పరిష్కరించాలి?

ఈసారికి పోనీ లక్షరూపాయలు ఇవ్వవచ్చు అష్టకష్టాలుపడి. కానీ దాంతో అతను తృప్తిపడతాడని ఏంటి నమ్మకం.

మళ్ళీ మళ్ళీ పీడిస్తాడు. ఇవ్వకపోతే సుజాతను చావగొడతాడు. ఆఖరి అస్త్రంగా అతను చెప్పినట్లే సుజాతని వదిలేస్తాడు కూడా.

పూజలూ పునస్కారాలు, దైవ ప్రార్థనలతో మనిషి చాలా ధైర్యస్థులయారు కాబట్టి ఆయన దీనికి తట్టుకోగలిగారు.

ఈ సమస్యకు ఇది కాదు పరిష్కారం.

సుజాతకు ఏదో ఒక దారి చూపించాలి.

ఆమె కాళ్లమీద ఆమె నిలబడగలిగినప్పుడు భర్త ఇంత దౌర్జన్యం చేయలేకపోవచ్చు.

ఏదో ఆలోచించుకొన్నారాయన.

"నువ్వేం భయపడకమ్మా. నేను ఏదో ఒకటి చూస్తాను" అన్నారు.

తండ్రి ఆ మాట అనగానే కొండంత ధైర్యం వచ్చింది సుజాతకు.

ఆయనకే వదలివేస్తే ఆయనే చూసుకొంటారు. బహుశా శేఖర్ని పిలిచి నచ్చచెప్పవచ్చు.

రాత్రికల్లా ఈ విషయం ఇంట్లో అందరికీ తెలిసింది. అందరిలోనూ హుషారు చచ్చిపోయింది.

ఎందుకిట్లా జరిగిందా అని ప్రతి ఒక్కరూ బాధ పడుతున్నారు.

"ఇన్ని బాధలు పడ్డావా సుజాతా. మీ ఆడపడుచు నీ వయసుదే కదా. అర్థం చేసుకొని స్నేహంగా ఉండదా" అంది విమల.

"అలాటి మనుషులైతే యిక బాధ దేనికి. ఆ తల్లి ఎంత క్రూరురాలో చూశావుగా. ఆ తల్లికి పుట్టిన పిల్లలు యింకెలా ఉంటారు" అన్నాడు అన్నయ్య.

"వాళ్ళ పిల్లకే యిలా అయితే తెలుస్తుంది"

"వాళ్ళు యిలా ఎందుకు చేసుకుంటారు? మనం మంచి వాళ్ళం కాబట్టి అంతా మంచివాళ్ళేననుకొని చేసుకొంటాం. వాళ్ళు అలా కాదు. వాళ్ళు ఎంత దుర్మార్గులో వాళ్ళకి తెలుస్తూనే ఉంటుంది కాబట్టి బాగా చూసుకొని అమాయకుల్ని నోరులేని వాళ్ళను చేసుకొంటారు. అటు కోడలి మీద యిటు అల్లుడి మీదకూడా వాళ్ళదే పైచేయి" అంది సునీత.

"నేనొక నిర్ణయానికి వచ్చాను" అన్నారు జగన్నాథంగారు. అందరూ ఆయనకేసి చూశారు.

"అతన్ని పిలిపిస్తాను. నచ్చచెపుతాను. వినక పోతే..."

### హంతకుడు



హత్య జరిగిన స్థలానికి వెళ్ళారు ఇన్‌స్పెక్టర్ విశ్వనాథం, కానిస్టేబుల్ కామేశం అంతా చూసారు.

"ఏమయ్యా కామేశం... హత్య జరిగిన స్థలంలో హంతకుడి వేలిముద్రలు లేవుకదా... దీన్నిబట్టి నీకేం అర్థం అవుతోంది" అడిగాడు ఇన్‌స్పెక్టర్ విశ్వనాథం.

"హంతకుడికి చేతులయినా లేకపోయి వుండాలి. లేదా చేతికి వేళ్ళయినా లేకపోయి వుండాలి" ఠక్కున అన్నాడు కామేశం.

—హెచ్.ఎస్. సురేశ్‌కుమార్ (మాళ్లారుపేట)

వినకపోతే? ఏం చేస్తారు.

అందరూ చెవులు నిక్కబెట్టుకొని వింటున్నారు.

"వినకపోతే... విడాకులకి ప్రయత్నిస్తాను" బాంబు పేల్చారు జగన్నాథంగారు.

అందరూ వింటున్నారు. ఏ ఒక్కరిలోనూ చలనం లేదు. విడాకులంటే విపరీతమే. కానీ ఏం చేస్తారు. పరిస్థితి అలాగ ఉంది.

సుజాత నిర్ఘాంతపోయి చూస్తోంది.

"విడాకులకి అప్లికేషన్ పెట్టు సుజాతా. నీకు రీసెర్చిలో సీట్ తప్పక వస్తుంది. రీసెర్చి చెయ్యి. విదేశాలకు వెళ్ళు. విజ్ఞానం సంపాదించు. నలుగురికీ సహాయాలు చేయి. మనిషికి జీవితంలో పెళ్ళి భర్తా ముఖ్యమైన వాటిలో ఒకటి కావచ్చు కానీ అవే ముఖ్యంకావు. నువు అక్కడ బతకలేవు" స్థిరంగా అన్నారాయన.

సుజాత కంగారు పడింది.

"వద్దు నాన్నగారూ... అంతమాట అనకండి. నేను ఆయన కాళ్ళు పట్టుకుని ఎలాగో అలాగ వెళ్తాను. ఆ ఇంట్లో దాసిగానైనా పడుంటాను."

"అంటే నువ్వు అతన్ని అంత ప్రేమిస్తున్నావా"

"లేదు నాన్నగారూ... నాకు అతని మీద ప్రేమా లేదు. కోపమూ లేదు. ప్రస్తుతం నాకు ఎవరిమీదా ఎలాంటి భావాలూ లేవు. కానీ నేను విడాకులు పుచ్చుకొని ఇక్కడ ఉంటే మన కుటుంబానికి మచ్చ కాదా. ఎవ్వరి గురించీ ఆలోచించవద్దు. కానీ సునీత పెళ్లి సంగతేమిటి. దానికి మంచి సంబంధాలు వస్తాయా, వద్దు నాన్నగారూ. నా బాధలు నేను పడతాను. నా మూలంగా ఇంకొకరికి అన్యాయం జరక్కూడదు" అంది సుజాత.

సునీత ఏడుస్తూ వచ్చి సుజాతను కౌగిలించుకుంది.

"వద్దక్కా. అలా అనొద్దు. ఎంత కష్టంగా లేకపోతే నువ్విలా ఉండగలవు. నా పెళ్ళి కోసం నువ్వక్కడికి వెళ్లకక్కా. నన్ను మెచ్చినవాడు వచ్చినప్పుడే చేసుకుంటాను. అంతేకానీ కేవలం నీ కోసం నన్ను కాదనుకొన్నవాడ్ని నేనసలు చేసుకోను. పెళ్ళి అయి నువ్వేం సుఖ పడుతున్నావక్కా. నేను ఆజన్మాంతం బ్రహ్మచారిణిగా ఉన్నా భరిస్తాను. అంతేకానీ నువ్వు అక్కడికి తిరిగి వెళ్ళే ప్రయత్నం చేయకక్కా" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఇంకేం ఆలోచించకు సుజా. నీ తండ్రిగా ఏం చేస్తే బాగుంటుందో నాకు తెలుసు. అనవసరంగా పిచ్చి ఆలోచనలు చేయకు" లోపలకు వెళ్ళిపోయారు జగన్నాథంగారు.

* * *

శేఖర్ని స్టేషన్నుంచి తీసుకొచ్చాడు మోహన్. "రండి బావగారూ" అంటూ ఇంట్లోకి తీసుకొచ్చాడు.

మొహం ముటముట లాడిస్తూ అల్లుడి హోదా చూపిస్తూ లోపలకు వచ్చాడు శేఖర్.

ఇంటిల్లిపాదీ పలకరించారు.

అందరికీ అంటీ ముట్టనట్లు సమాధానం చెప్పాడు. అతనికి లోపల అనుమానంగా ఉంది. ఎందుకు పిలిచారు తనను... నాలుగు చివాట్లు పెట్టరు కదా.

మళ్ళీ తనను తను సమాధాన పరచుకున్నాడు.

ఎలా తిడతారు.

తను ఎవరు? వాళ్ళ అల్లుడు. అల్లుడయినాక వాడెంత వెధవైనా మామ ఎంత గొప్పవాడైనా అతని ముందు తలవంచక తప్పదు. ఇదీ లోకం పోకడ.

తనను వీళ్ళేం చేయగలరులే.

ధీమాగా అన్ని పనులూ ముగించుకొన్నాడు. ఇడ్లీ తిన్నాడు. ఫిల్టర్ కాఫీ తాగాడు. స్నానం చేసి భోజనం చేసాడు.

మేడమీద గది ఏర్పాటు చేసారు అతనికి. గదిలోకి వెళ్ళి నిద్రపోయాడు. మధ్యాహ్నం తిరిగ్గా టీ తాగుతున్నారు అంతా. అంతటా ప్రశాంతత అలుముకొని వుంది.

అది తుఫాను ముందు ఉండే ప్రశాంతత. మౌనంగా టీ తాగుతున్నారు అందరూ. హాల్లో కూర్చుని టీ తాగడం ముగించి కప్పు పక్కన పెట్టాడు శేఖర్.

జగన్నాధంగారు మౌనాన్ని ఛేదించారు.

''మీరు ఏదో వ్యాపారం పెడతానన్నారుట''

అమ్మయ్య అనుకున్నాడు శేఖర్.

తను ఎలా తేవాలా ఆ ప్రసక్తి అనుకొంటుంటే ఈయనే తెచ్చాడు అనుకున్నాడు.

''అవును పెట్టుబడి ఎక్కువ లేదు''అన్నాడు.

''మరి లేనివాళ్లు వ్యాపారం అంటూ ఎందుకు మొదలు పెట్టారు'' అన్నారు

## అద్భుత టమోటా



మనకు 'టమోటా' కూరగాయ అయితే వృక్ష శాస్త్రవేత్తలకు మాత్రం అది పండే! రెండు వందల సంవత్సరాల క్రితం అమెరికాలో 'టమోటా'ను విష పదార్థంగా భావించేవారట! అలాగే లార్డ్ మౌంట్ ల్యాటిన్ కూడా 'టమోటా' పేరు వింటేనే అసహ్యించుకొనే వాడట. మెక్సికో జన్మస్థానంగా వినుతి కెక్కిన టమోటాలు ఇటలీలో మాత్రం మహారుచిగా ఉంటాయి. విటమిన్–ఎ, సి లతో పాటు కాల్షియం, ఫాస్పరస్, ఐరన్‌లను కూడా పుష్కలంగా కలిగి ఉన్న టమోటా... ఖచ్చితంగా అద్భుతమైనదే, ఇంకేం... దీనిని దగ్గరకు రానివ్వని వారెవరైనా ఉంటే... వెంటనే టమోటాను తినటం ప్రారంభించండి.

—జూపిటర్

జగన్నాథంగారు మాటిగా.

"మిమ్మల్ని అడగమన్నాను సుజాతని అడిగిందా" అన్నాడు వినుగ్గా.

"అడగబట్టే అడుగుతున్నాను"

"అంటే ఏమిటి మీ ఉద్దేశం"

"ఏమీ లేదు. మీ దగ్గర ఉంటే చేయండి లేకుంటే మానుకోండి. కానీ అందర్నీ అడిగితే ఎవరిస్తారు"

"అందరూ ఎవరు? మీ కూతురి కోసం కూడా ఇవ్వరా"

"నా కూతురి కోసం ఇవ్వను. నా కూతురు బాగు కోసం అయితే ఇస్తాను."

"ఏమొచ్చిందో ఇపుడు ఆవిడకు బాగుకి"

"ఏమొచ్చిందో అనవసరం. కానీ సుజాతను డబ్బుకోసం వేధిస్తే ప్రయోజనం ఉండదు. మీకు ఇవ్వాల్సిన దానికన్నా ఎక్కువే ఇచ్చాము. భార్యకి ఇవ్వవలసిన గౌరవం ఇచ్చి ఆమెని ప్రేమగా చూసుకొని ఆమె బాధ్యతలు స్వీకరించాల్సిన బాధ్యత భర్తగా మీకుంది. అంతేగానీ తన్నులూ, తిట్లూ సాధింపులతో ఆమె జీవితాన్ని నరకం చేయడానికి ఎవరిచ్చారు అధికారం. ఒక మనిషిని ఇల్లా హింసించడం అన్యాయం. ఇప్పటికైనా గ్రహించి సుజాతను తీసుకువెళ్ళి భర్త ప్రవర్తించవలసిన తీరులో ప్రవర్తించండి."

రెచ్చిపోయాడు శేఖర్.

తనకు ఈయన బోధించడమా ఊరుకోకూడదు. వీళ్లని ఇలాగ మాట్లాడనిస్తే ఎన్నయినా మాట్లాడతారు.

ఆఖరి అస్త్రం ప్రయోగించాలి.

ఆడదానిమీద మగవాడు ప్రయోగించగల బ్రహ్మాస్త్రం అదే విడాకులు.

"సుజాతా— అలా గుడ్లు పెట్టుకొని చూస్తూ నిలబడతావేం. డబ్బుగా ఇవ్వలేకపోతే మీ అమ్మ నగలైనా ఇమ్మను" అన్నాడు.

"ఇవ్వగలగడం ప్రశ్నేలేదు. ఏ విధంగానూ ఇవ్వను" ఖచ్చితంగా చెప్పారు జగన్నాథంగారు.

"అయితే మీ అమ్మాయిని మీ ఇంట్లోనే ఉంచుకోండి విడాకులు పారేస్తాను"

"మంచిది"

"ఆ" నిర్ఘాంత పోయాడు శేఖర్.

వీళ్ళేం మనుషులు

విడాకులనగానే కాళ్ళమీద పడతారనుకొన్నాడు. బాబ్బాబు ఆ పని చేయకు, నీక్కావలసింది ఇస్తాము అంటారనుకొన్నాడు.

సుజాతకేసి చూసాడు. ఆమె నిశ్చలంగా నిలబడి ఉంది.

ఈ ప్రసక్తి ఆమెతో సంప్రదించి చేసిందేనని తెలుస్తూనే ఉంది.

అంతా మౌనంగా కూర్చుని ఉండడం చూసాడు.

వీళ్ళంతా ఆలోచించుకునే చేస్తున్నారన్నమాట.

"మీరేం మనుషులు ఒక కాపురం నిలువునా కూలిపోతుంటే చూస్తూ ఊరుకుంటున్నారా" అన్నాడు కోపంగా.

మోహన్ లేచి నిలబడ్డాడు.

"మహాశయా, కేవలం డబ్బుమీదే నిలబడ్డ కాపురాలు ఏనాటికైనా కూలిపోక తప్పదు. అది ఇప్పుడే జరిగితే మంచిది. ఇంకా చిన్న వయసేకాబట్టి చదువుకొంటుంది, ఉద్యోగం చేస్తుంది. ఎక్కడ ఉన్నా నీ దగ్గర ఉన్నదానికన్నా సుఖంగానే ఉంటుంది" అన్నాడు.

పళ్ళు నూరాడు శేఖర్.


గబాలున లేచి సుజాత జుట్టు పట్టుకుని ఆ చెంపా ఈ చెంపా ఛెళ్ళున వాయించాడు.

"ఆగు దుర్మార్గుడా" గట్టిగా అరుస్తూ అతని పట్టులోంచి సుజాతను విడిపించారు జగన్నాథంగారు.

"నా నిర్ణయం ఎంత సమంజసమయిందో నాకు ఇప్పుడు స్పష్టమయింది. ఇప్పుడే ఇక్కడ్నుంచే వెళ్ళిపో. నీకు ఇక ఈ ఇంటికి రావలసిన అవసరం లేదు"

"పోతాను. మీరు ఏమైనా చావండి. ఇక ఈ క్షణం నుంచి మీ అమ్మాయికీ నాకూ సంబంధం లేదు. ఆమె నాకు లేదు. నేను విడాకులకి కూడా అప్లయ్ చెయ్యను. శుభ్రంగా వేరే పెళ్ళి చేసుకుంటాను. కళ్ళకద్దుకొని ఇస్తారు ఎవరైనా నాకు. మీరంతా ఏమన్నాకండి!" గర్జిస్తూ, తిడుతూ శాపనార్థాలు పెడుతూ తన సూట్‌కేస్ తీసుకొని ఆ ఇంటినుంచి సుజాత జీవితంనుంచీ నిష్క్రమించాడు శేఖర్.

అంతా మౌనంగా నిల్చున్నారు.



ఇంట్లో పరిస్థితి ఏదో చావు జరిగినట్లుగా వుంది. సుజాతకు ఎటువంటి భావాలు కలగలేదు.

పైగా మనసు ఏదో తేలికపడ్డట్లు వుంది.

ఆ బాధలు తిప్పలూ ఉండవిక. ఆ కన్నీళ్ళూ కష్టాలూ ఉండవు.

కాకపోతే అవమానం ఉంటుంది భరించాలి తప్పదు.

పోతే ఇంకొక దిగులు కూడా ఉండదు.

భర్త ఏం చేస్తే తనను వదిలిపెట్టేస్తాడోనని బిక్కు బిక్కుమంటూ బతకఖ్కర్లేదు.

ఏ క్షణాన తనను ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటాడోనని భయపడక్కర్లేదు.

మొత్తానికి సుజాత ఎక్కువ బాధ పడలేదు.

* * *

"సుజాతా"

లాబ్‌లో ఎక్స్‌పెరిమెంట్ చేస్తున్న సుజాత ఉలిక్కిపడింది.

ఎదురుగా విజయేంద్ర.

బలవంతాన చిరునవ్వు తెచ్చుకొంది.

"బాగున్నారా" అంది.

"బాగానే ఉన్నాను. ఏమిటి ఇక్కడ రీసెర్చ్ చేస్తున్నావట కదా, ఎన్నాళ్ళయింది హైదరాబాద్ వచ్చి. ఆయన ఎలా ఉన్నారు" గుక్క తిప్పుకోకుండా ప్రశ్నించాడు విజయ్.

"అంతా బాగానే ఉన్నారు. నేను హైదరాబాద్ వచ్చి చాలా రోజులయింది. ఇక్కడే ఉండి రీసెర్చ్ చేస్తున్నాను" చెప్పింది సుజాత.

"అంటే..."

"అంటే అంతే" నవ్వింది సుజాత.

విజయేంద్ర కోపంగా చూసాడు.

"ఏంటి సుజాతా. ఇక్కడెందుకు నువ్వు రీసెర్చ్ చెయ్యడం అక్కడ సీట్ దొరకదా"

"అక్కడ సీట్ దొరుకుతుందో లేదో నాకు తెలీదు. కానీ భర్త వదిలిన ఆడది పుట్టింటి దగ్గర ఉండాలిగా. అందుకని హైదరాబాద్‌లోనే ప్రయత్నించాను."

"ఆ" బాధతో ఆశ్చర్యంతో విజయ్‌కి నోటమాట రాలేదు.

"ఇలా కూర్చో సుజా" అన్నాడు. లాబ్‌లో ఎవరూ లేరు.

బయట మేఘాలు కమ్ముకుంటున్నాయి. వర్షం వచ్చేట్టుగా వుంది.

"వర్షం పడేట్లు వుంది నేను వెళ్లిపోతాను విజయ్"

"ఫర్వాలేదు సుజాతా. నేను దింపుతానులే ఇంటి దగ్గర" స్టూల్ మీద కూర్చున్నాడు



విజయ్.

సుజాతకు తప్పలేదు ఇక.

''ఏంటి చెప్పు సంగతి'' ఆతనికి చాలా ఆందోళనగా ఉంది.

''ఏమీ లేదు''

"చెప్పు సుజాతా నేను నీ సుఖమే కోరుతాను. నువ్వు శాంతిగా సుఖంగా ఉండాలని కోర్తుకునే స్నేహితుడి దగ్గర కూడా నీకు రహస్యమా" చేతుల్లో మొహం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది సుజాత.

"మా వారు పెట్టిన కష్టాలన్నీ భరించాను విజయ్. కానీ చివరికి వాళ్లడిగిన లక్షరూపాయలూ తేలేదనే కోపంతో నన్ను వదిలిపెట్టి వెళ్లిపోయారు. నేనిప్పుడు దిక్కులేని దాన్ని విజయ్. జీవితమంతా బాధలూ అవమానాలూ పడమని నా నొసట రాసిపెట్టి ఉంది."

విజయ్ స్థాణువులా కూర్చున్నాడు. అతనికి మతిపోయినట్లు ఉంది.

ప్రాణానికి ప్రాణమైన నెచ్చెలి సంసార జీవితం భగ్నమైంది. విఫలమైన కాపురంలో మోపులా తనముందు కూర్చుని ఉంది.

తనను కాదన్నా ఆమె ఎక్కడో అక్కడ సుఖంగా ఉండాలని భావించాను. ఆశించాను. కానీ అలా జరగలేదు.

అయ్యో. సుజాత మనసు ఎంత కోమలమైంది. ఈ బాధకు ఎలా తట్టుకుంటుందో.

ఆమె ఎవరికీ ఏ అపకారమూ చేయలేదే. ఎన్నడూ ఎవరినీ కనీసం పరుషమైన మాటలైనా అనలేదే. ఆ నిర్మల హృదయకు ఎందుకిన్ని కష్టాలు.

ఏం చేయాలి?

"బాధ పడకు సుజా. మేమంతా లేమా. అతనికి నచ్చ చెపుతాను. నీ జీవితం సుఖంగా ఉండటానికి నేను ఏమైనా చేస్తాను. ఆఖరికి నేను చచ్చినా సరే" అన్నాడు.

సుజాత అతని కేసి చూసింది. అతనెంత బాధ పడుతున్నాడో తెలుస్తూనే ఉంది. అతనింత బాధపడతాడనే తను యిన్నాళ్ళు అతనికి కనిపించలేదు. అతను అతని కంపెనీ వ్యవహారాలు చూసుకొంటూ బిజీగా ఉంటాడు. యివాళ ఏదో పనిమీద వచ్చాడు కాబట్టి తను అతని కంట బడింది.

"ఏమీ చేయక్కర్లేదు విజయ్. నువ్వు విన్నదంతా మర్చిపో" అంది సుజాత.

అతను జవాబు చెప్పలేదు. ఏదో ఆలోచించుకొంటూ ఉండిపోయాడు.

కార్లో కూడా ఎక్కువ మాట్లాడలేదు.

యింటి దగ్గర దిగలేదు సుజాత. బస్‌స్టాప్‌లో దిగి పోతానన్నా అతను అభ్యంతరం చెప్పలేదు. అతని ఆలోచనలేమిటో అర్థం కాలేదు సుజాతకు.

* * *

"నమస్తే"

శేఖర్ వెనక్కు తిరిగి చూశాడు.

"విజయేంద్ర"

"నమస్తే" ముభావంగా అన్నాడు.

"ఎటు వెళుతున్నారు" విజయేంద్ర అడిగాడు.

"అలా బీచ్‌కి"

"పదండి నేనూ బీచ్‌కే"

ఇద్దరూ నడుస్తున్నారు బీచ్‌లో కలిసి.

విజయేంద్ర శేఖర్‌కోసమే వచ్చాడు కానీ శేఖర్ ఎదురవటంతో ఆ సంగతి చెప్పలేదు. ఊరికే ఏదో పని మీద వచ్చినట్లు చెప్పాడు.

బీచ్‌లో కూర్చున్నారు యిద్దరూ.

విజయేంద్ర చూస్తున్నాడు. ఎలాగ ఆ విషయం కదపాలా అని.

"సుజాత..." అన్నాడు.

"నన్ను వదిలి వెళ్ళిపోయింది" అన్నాడు శేఖర్.

"ఏవో భేదాభిప్రాయాలు వచ్చినంత మాత్రాన మీరిలా పట్టుబట్టుక్కూర్చోవటం..."

"నేను ఏం పట్టుబట్టలేదండీ. ఏదో ఒక వ్యాపారం చేద్దామనుకొన్నాను. సంపాదించి అంతా నా నెత్తినే పోసుకుంటానా. తన కోసమేగా చేసేది. వాళ్ళ నాన్నగారిని అడగమంటే వెళ్ళింది. అంతే రమ్మని ఉత్తరం రాస్తే వెళ్ళాను. అంతా కలిసి నా మీద విరుచుకు పడి నువ్వు వద్దు నీతో కాపురం వద్దు అన్నారు."

విజయ్‌కి అసహ్యం వేసినా ఎలాగో అణచుకొన్నాడు. డబ్బుకోసం తన్ని తగిలేసి భార్యను పుట్టింటికి పంపించింది చాలక యిదొక ఆరోపణ.

"డబ్బుకోసం విడిపోవడం ఎందుకండీ. మీరు ఏమనుకోకుంటే నేనో మాట చెపుతాను"

"చెప్పండి"

"మాకు బిజినెస్ ఉందికదా. నమ్మకమైన పార్ట్నర్స్ దొరకక చాలా యిబ్బంది పడుతున్నాం. మీరూ బిజినెస్ అంటే ఉత్సాహం చూపిస్తున్నారు కాబట్టి ఒక పని చేద్దాం. మీరు పైసా యివ్వొద్దు. కానీ పార్ట్నర్‌గా ఉండండి. యింకా క్లియర్‌గా చెపుతాను. వ్యాపారం మానేజ్ చేస్తూ ఉండండి లాభాల్లో పావలా వంతు పుచ్చుకోండి. అంటే నెలకు ఏడెనిమిది



## సూర్యుడు

నిర్మాత నీలకంఠాన్ని ఇంటర్వ్యూ చేస్తున్నాడు విలేకరి.

"మీ సూర్య చరిత్ర సినిమాకి దర్శకుడు సూర్యకుమారి, హీరో జయసూర్య, రచయిత సూర్యారావు మొదలయిన ప్రముఖులు పనిచేసినా ఎందుకు ఫెయిలయిందంటారు" అడిగాడు విలేకరి.

"సూర్యుళ్ళెక్కువయి వడదెబ్బ తగిలింది" టక్కున చెప్పాడు నీలకంఠం.

—హెచ్.ఎస్. సురేశ్‌కుమార్ (సూళ్లూరుపేట)

వేలు రావచ్చు. అదీగాక మానేజ్ చేసినందుకు కారు మొదలైన సదుపాయాలు కూడా ఉంటాయి. మీరు కనక వ్యాపారాన్ని వృద్ధిచేసే మెళుకువలు నేర్చుకొంటే యింక పార్టనర్ షిప్ మానేసి మీరే సొంతంగా బిజినెస్ చెయ్యవచ్చు".

యితని చేతిలో వ్యాపారం పెట్టి పావలా వంతు లాభాలిస్తే యిక కోతికి కొబ్బరికాయ యిచ్చినట్లే. కానీ సుజాత కాపురం చక్కబడాలంటే యింత కన్నా మార్గంలేదు. డబ్బు మనిషి కాబట్టి యిక మీద కుదురుగా ఉండవచ్చు.

శేఖర్ లోపల ఆనందించినా పైకి ఏమీ కనబరచకుండా జాగ్రత్త పడ్డాడు.

"వద్దండీ నాకిపుడెలాంటి ఆశలూ లేవు. అంతా అయిపోయింది" బెట్టుచేశాడు.

అతన్ని బతిమాలి ఒప్పించాడు విజయేంద్ర. యిద్దరిదీ నటనే. కానీ ఒకరికి తెలియకుండా యింకొకరు నటిస్తున్నారు.

చిట్టచివరికి హైదరాబాద్ బయలుదేరడానికి ఒప్పుకొన్నాడు శేఖర్.

కానీ విజయేంద్ర ఆలోచన తల్లకిందైంది. జగన్నాథంగారు ఎంత మాత్రమూ ఒప్పుకోలేదు ఆ విధంగా చేయటానికి.

"డబ్బుకోసం వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. డబ్బుకోసం తిరిగి వచ్చాడు. మళ్ళీ ఆ డబ్బు లేక పోతే తిరిగి వదిలివేస్తాడు. అలాటి మనిషితో కలసి బతకటం కష్టం" అన్నాడు.

విజయేంద్రకు కోపంవచ్చింది.

"అందుకని ఏం చేస్తామండీ. రేపు పొద్దున్న మీరంతా దాటి పొయ్యాక తనెలా బతుకుతుంది ఒంటరిగా. మీరు యిలా పట్టుదలతో ఉండకూడదు" అన్నాడు.

శేఖర్ సుజాత యింటికి రావడానికి ఒప్పుకోకపోవడంతో తమ యింటికే తెచ్చాడు విజయేంద్ర. అతని యింట్లోనే ఈ మాటలన్నీ జరుగుతున్నాయి.

సుజాత వంక చూశాడు విజయ్.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

శిలలా కూర్చుని ఉంది.

శేఖర్ కోపంగా విరుచుకు పడ్డాడు.

"యిష్టం లేనపుడు పిలవడం దేనికి" అన్నాడు.

"మేము పిలవలేదు" అన్నాడు జగన్నాథం గారు.

"నేను తీసుకువచ్చాను. ఆ విషయం ఎందుకు. ఎవరు పిలిచినా వాళ్ళిద్దరూ సుఖంగా ఉండాలనే కదా. ఆయన ఏదో తొందరపడిఉండవచ్చు. ఇపుడు దానికి బాధ పడుతున్నారు" అన్నాడు విజయ్.

"అతను మారాడంటే నేను నమ్మను. కాకి తెల్లగానన్నా ఉండవచ్చు కాని యితని గుణం మాత్రం అంతే" అన్నారు జగన్నాథంగారు.

"నువ్వు చెప్పు సుజాతా" అన్నాడు విజయ్.

"నాన్నగారి అభిప్రాయమే నాది"

శేఖర్ అణచుకొన్న కోపాన్ని వెళ్ళగక్కాడు.

"నువ్వెందుకు వస్తావే. బాగా సుఖం మరిగావు. నీ సరదాలు తీర్చుకోనేందుకు వీడొకడు దొరికాడు కదా. యిక నేనెందుకు" అన్నాడు.

"మీరు తొందర పడుతున్నారు. అనవసరంగా అపార్థం చేసుకొంటున్నారు" సర్ది చెప్పబోయాడు విజయ్.

"బాగానే అర్థం చేసుకొన్నాను. ఏ సంబంధమూ లేకుండానే యింత తాపత్రయం పడుతావా దానికోసం. ఎంతమంది క్లాస్‌మేట్లు లేరు. నువ్వే ఎందుకింత యిదైపోతున్నావు. నీ దగ్గరే యిద్దర్నీ అట్టే పెట్టుకొని దానితో ఆటలాడాలని చూశావు. నీ కన్నా తెలివైంది అది. అసలు మొగుడే అక్కర్లేదనుకొంది".

"ఛీ ఆపండి" అరిచాడు విజయ్.

"మీరు సుజాత భర్త కాబట్టి ఊరుకొన్నాను. అదే యింకొక రైతే..."

"ఏం చేస్తావు. మీ సంగతి బయట పెట్టాననేగా అంత ఎగిరి పడుతున్నావు" అరుస్తూ పైకి వెళ్ళి తన సూట్‌కేస్ తెచ్చుకొని విజయేంద్రనీ సుజాతనీ కలిపి తిడుతూ సుజాత జీవితం నుంచి శాశ్వతంగా నిష్క్రమించాడు శేఖర్.

దేనికీ చలించకుండా అలాగే కూర్చుంది సుజాత.

ఆమె మొహం నిర్లిప్తంగా ఉంది.

అసలేం జరగనట్లుగా ఉంది.

జగన్నాధంగారు మాత్రం కొద్ది కోపాన్ని వ్యక్తంచేశారు.

"అనవసరంగా అతన్ని తీసుకొచ్చావు విజయ్. ఈ మాత్రం చేయలేక నేను ఊరుకున్నాను అనుకున్నావా. అతనితో సుజాత సుఖ పడుతుందనుకొంటే డబ్బుదేముంది తల తాకట్టు



## అవును, నిజం

అమెరికాలో ప్రతి నిముషానికీ పన్నెండు కార్లు ఉత్పత్తి అవుతున్నాయి.

మన దేశంలోని మొత్తం భూ వైశాల్యం ధర 1971లో 61,500 కోట్ల రూపాయలైతే 1975లో దాని ధర 98,000 కోట్లకు పెరిగినట్లు రిజర్వు బ్యాంకు అంటోంది! ప్రస్తుత ధర 5,00,000 కోట్ల రూపాయలకు పైగా ఉండవచ్చునట!

మన దేశంలో 70 మిలియన్ల మంది అంగ వికలులున్నారు! ప్రపంచ జనాభాలో నేడు ప్రతి పదిమందికీ ఒక అంగ వికలుడున్నాడు!

—జూపిటర్

పెట్టయినా యిచ్చేవాణ్ణి"

తల దించుకొన్నాడు విజయ్.

తను శేఖర్ బొత్తిగా యిలాటి మనిషని అనుకోలేక పోయాడు.

అతనికే నవ్వు వచ్చింది.

ఎలాటి మనిషి కాకపోతే సుజాత లాంటి నెమ్మదస్తురాలు సర్దుకుపోయే తత్వంగల స్త్రీ తెగతెంపులు చేసుకొంటుంది. స్త్రీ జీవితంలో అందరికన్నా ఎక్కువ ప్రాముఖ్యత యిచ్చేదీ అందరికన్నా ఎక్కువగా ప్రేమించేదీ భర్తను. అలాటి భర్తనే విడిచి పెట్టాలని నిర్ణయించుకొందంటే ఆమె ప్రాణం ఎంత విసిగి పోయి ఉండాలి.

భారంగా నిట్టూర్చాడు అతను.

యిక తనేం చేయలేదు.

సుజాత మోడులా బతకాల్సిందే.

* * *

కాలం గడుస్తూనే ఉంది.

అలాగే ఏడాది కాలం గడిచింది.

ఈ ఏడాదిలో శేఖర్ వేరొక వివాహం చేసుకున్నాడు శేఖర్ సుజాతలు విడిపోగానే.

దేశంలో ఆడపిల్లలకు కొరతలేదు. అలాగే నలుగురు ఆడ పిల్లల తండ్రి తన మూడవ పుత్రికనిచ్చి ముప్పయి వేలతో కాళ్ళు కడిగి కన్యాదానం చేశాడు.

అతని పెళ్ళి గురించి విని కూడా సుజాత చలించలేదు.

విజయేంద్రే తెలుసుకున్నాడు శేఖర్ పెళ్ళి జరిగిందని. సుజాతతో ఆ విషయం చెప్పాడు.

"ఓహో" అని మాత్రం ఊరుకుంది.

వారి మధ్య ఇక ఆ ప్రసక్తెన్నడూ రాలేదు.

కానీ సునీత వివాహం మాత్రం అనుకోని విధంగా జరిగింది.

సునీత కన్నా సీనియర్ ఒకతను ఉన్నాడు. హౌస్ సర్జన్‌గా చేస్తున్నాడు. ఒక కులం కాదు. అతన్ని ప్రేమించింది సునీత. ఒకే కులం కాని కారణం చేత తమ వివాహం జరగదనీ జగన్నాధంగారు ఒప్పుకోరనీ వాళ్ళకి తెలుసు. అందుకే కేవలం స్నేహితులుగా విడిపోదామని నిశ్చయించుకొన్నారు.

కళ్ళ నీళ్ళతో సుజాతకి విషయం చెప్పింది సునీత.

"నేను నాన్నగారిని అడిగి చూస్తాను" అన్నది సుజాత.

"ఒద్దక్కా" అన్నది గాభరాగా సునీత.

కానీ సుజాత ఒకనాడు చెప్పేసింది జగన్నాధంగారితో. ఆయన ఏమీ మాట్లాడలేదు.

కానీ ఆ సాయంకాలమే సుధాకర్ యింటికి వెళ్ళి వాళ్ళ నాన్నగారితో మాట్లాడారు.

వాళ్ళు ఆశ్చర్య పోయారు.

"కానీ మన కులాలు..." అంటూ ఏదో చెప్పబోయాడు.

"అలా అనకండి. యివన్నీ మనం ఏర్పరచుకొన్న అడ్డుగోడలే కదా. మా సునీత మీకు కోడలిగా నచ్చుతుందా లేదా అని ఆలోచించండి చాలు" అన్నారు జగన్నాథంగారు.

పక్కనే ఉన్న సుధాకర్ కేసి చూశారు.

చిరునవ్వు నవ్వి తల పక్కకు తిప్పుకున్నాడు సుధాకర్

అతని ఆనందానికి అవధులు లేవు.

పెళ్ళి తమ యింట్లోనే సకల మర్యాదలతో జరిపించారు జగన్నాథంగారు.

"మీరు ఒప్పుకుంటారనుకోలేదు నాన్నా. కానీ మీరు అర్థం చేసుకొని మమ్మల్ని ఆశీర్వదించారు" కళ్ళనీళ్ళతో భర్తతో కలిసి తండ్రికి నమస్కరిస్తూ అన్నది సునీత.

"లేమ్మా సుఖంగా ఉండండి" యిద్దర్నీ లేపి చెరో చేయి వాళ్ళ భుజం చుట్టూ వేశారాయన.


"ఆదర్శ వివాహం" అన్నారంతా.

"ఆదర్శమేముంది. యిందులో నా గొప్ప ఏముంది".

"అమ్మాయి యిష్ట పడింది, చేశాను. కాకపోతే కులం ఒకటి కాదు. మనం ఏర్పరచుకొన్న కులాలు మతాలు చివరికి మనకే శాంతి లేకుండా చేస్తున్నాయి. మా అమ్మాయి సుఖంగా ఉంటుందని చేశాను. నేను ఆదర్శపరుణ్ణి కాను స్వార్థపరుణ్ణి" అన్నారాయన.

అంతా నవ్వారు ఆనందంగా.

సునీత పెళ్ళిలో యింట్లో కొంత మార్పు వచ్చింది.



అంతదాకా మన్ను తిన్న పాముల్లా ఎవరి గదుల్లో వాళ్ళు ఉండేవాళ్ళు.

సునీత సుధాకర్‌లు సరదా అయిన మనుషులు. సెలవు దొరికినా ఖాళీ దొరికినా వెంటనే వచ్చేవారు. అప్పటికప్పుడు ఏదో ఒక ప్రోగ్రామ్ వేసేవాళ్ళు.

జోక్స్‌తో ఛలోక్తులతో యింటి వాతావరణమే మారిపోయేది.

సుజాతకు సునీత పెళ్ళిఅయ్యాక కాస్త ప్రశాంతి చిక్కింది.

అంతవరకు సునీతకు ఎలాంటి వరుడు దొరుకుతాడో యింకెంత బాధ పెడతాడోనని భయంభయంగా ఉండేది. తన కాపురం భగ్న మైనందుకే విచారిస్తున్న తల్లిదండ్రులు యిక సునీత పరిస్థితి కూడా అలాగే అయితే ఏమౌతారు?

భగవాన్ అలా మాత్రం చేయకు అని దేవుడికి నమస్కరించేది సుజాత.

సునీత దాంపత్యం అనుకూలమైనది కావటంతో సుజాతకు చాలా రిలీఫ్‌గా అనిపించింది. అమ్మయ్య ఒక భయం తీరింది అనుకొంది.

సుధాకర్ చాలా మంచి వ్యక్తి. సుజాతకు వదిన గారిలా కాకుండా ఒక అక్కలా ఆదరించేవాడు. అతన్ని చూస్తే సుజాతకు చాలా సంతోషంగా ఉండేది.

సుజాత రీసెర్చ్ వర్క్ పూర్తి అవుతోంది.

అది కాగానే ఫారిన్ వెళ్ళి ఏదైనా ఉద్యోగం చేయాలని ఉంది సుజాతకు.

* * *

లాబ్‌లో కూర్చుని పని చేసుకుంటోంది సుజాత విజయేంద్ర రావటం చూసింది.

''కూర్చో విజయ్'' అంది.

కూర్చున్నాడు విజయేంద్ర.

అతని మొహం కొంచెం సీరియస్‌గా ఉంది.

''విజయ్ ఏంటి అలా ఉన్నావు'' అంది.

''ఎలా ఉన్నాను''

''ఏంటోగా ఉన్నావు''

''నిన్నొకటి అడిగితే ఏమీ అనుకోవుగా సుజా''

''నువ్వే మడిగినా ఏమీ అనుకోను'' నవ్వింది సుజాత.

''రీసెర్చ్ అయ్యాక ఏం చేద్దామని ఉంది''

''యిది అడగటానికేనా అంత మొహమాటం పడుతున్నావు'' పకపక నవ్వింది సుజాత.

అతని మొహం ఎర్రబడింది.

''అహ. కాదు'' అన్నాడు.

''మరేంటో చెప్పు''

''ఇలా ఎన్నాళ్ళు ఉంటావు సుజా''

''ఎలా''

''యిలాగే ఉంటావా. అర్థం కానట్లు నటించకు. రీసెర్చ్ అయిపోతుంది. ఛాన్స్ వస్తే ఫారిన్ వెళతావు. తర్వాత యింకేమన్నా చేస్తావు. యింతేనా వేరే ఆలోచనలు ఏమీ లేవా''

సుజాత తల తిప్పుకొంది.

''ఏంటో సూటిగా అడుగు విజయ్. నాకు నిజంగా అర్థం కావటంలేదు''

''నువ్వు యిలా ఉండటం నాకేమీ నచ్చలేదు సుజా. అతను సుఖంగా మళ్ళీ పెళ్ళి చేసుకొని హాయిగా ఉన్నాడు.

''అతను మొగవాడు''

''నువ్వు ఆడదానివి. అంతేగా. ఎవరైనా మనుషులేగా. నీకేమీ అభ్యంతరం లేకపోతే...''

లేకపోతే సుజాత కెందుకో గుండె ఝల్లుమంది. అతనికేసి చూసింది.

అతను సూటిగా చూస్తున్నాడు తన కళ్ళలోకి.

చూపు తిప్పేసుకొంది సుజాత.

''నీకభ్యంతరం లేకపోతే మీ నాన్నగారితో మాట్లాడతాను సుజా. మన పెళ్ళి గురించీ మీ విడాకుల గురించి ఆయన ఒప్పుకోరేమోనని సందేహించానిన్నాళ్ళూ కానీ సునీత పెళ్ళితో నా సందేహాలన్నీ పటాపంచలైనాయి. నువ్వొప్పుకుంటే ఆయన్ని అడుగుతాను. నీ అభిప్రాయం చెప్పు'' అన్నాడు విజయ్.

''నేను ఆలోచించుకోవాలి విజయ్'' అంది సుజాత.

విజయ్ నిసుగ్గా చూశాడు.

''సరే నీ యిష్టం. కానీ ఏ అభ్యంతరాలు చెప్పకు'' అన్నాడు. మౌనంగా ఊరుకొంది సుజాత.

## చికిత్స



భార్య అసలు నిద్రపోవడంలేదని ఎందరో డాక్టర్లకు చూపించాడు గంగాధరం. చివరికి ఓ హిప్నాటిస్టు దగ్గరకు వెళ్ళాడు. అంతా విన్న ఆ హిప్నాటిస్టు హిప్నటిజం ద్వారా చికిత్స ప్రారంభించాడు.

''నువ్వు నిద్రపోతావు... ప్రశాంతంగా.. నిద్ర పోతున్నావు... నిద్ర వస్తుంది... గాఢంగా వస్తుంది'' ఇలా ఎంతో సేపన్నా ఆవిడగారికి నిద్రరాలేదు. విసిగిపోయిన హిప్నాటిస్టుని చూసి గబగబా వెళ్ళి—

''అయ్యా చెప్పడం మరిచాను. మాయావిడకి చెవుడు కూడా వుందండి'' తాపీగా చెప్పాడు గంగాధరం.

—హెచ్.ఎస్. సురేశ్‌కుమార్ (సూళ్లూరుపేట)

"సోమవారం మధ్యాహ్నం వస్తాను. చెపితే సాయంత్రం మీ నాన్నగారితో మాట్లాడతాను".

"సరే"

"వెళ్తానింక. నువ్వు వస్తావా యింటి దగ్గర దింపుతాను"

"లేదు నాకింకా కొద్దిగా పని ఉంది"

"వెళ్తున్నాను" బయటకు వెళ్ళిపోయాడు విజయ్.

అతను వెళ్ళి పోగానే పనంతా కట్టిపెట్టి ఆలోచిస్తూ కూర్చుంది సుజాత.

పిచ్చి విజయ్ తను నిజంగా ఆలోచించుకోవాలి అనుకొంటున్నాడు.

విజయ్ లాంటి వ్యక్తి పెళ్ళి చేసుకొంటాను అంటుంటే ఆలోచించటానికేముంది.

కానీ తన ఆలోచన అది కాదు.

తన తల్లీ తండ్రీ ఒప్పుకోవచ్చు.

కానీ విజయ్ తల్లి తండ్రులేమంటారో.

విజయ్ ఒక్కగానొక్క కొడుకు వాళ్ళకి. ఏ అవలక్షణాలు లేవు. పెళ్ళి కొడుక్కి ఉండాలని ఆడపిల్లలు ఆశించే అన్నీ ఉన్నాయి అతనికి.

మరి అలాంటపుడు వాళ్ళు తనని కోడలిగా అంగీకరిస్తారా. రాబోయే కోడలి పట్ల అందరికీ కొన్ని ఆశలు అభిప్రాయాలు ఉంటాయి.

అవి తను లక్ష్య పెట్టకుండా ఉండలేదు.

రేపే భీమశంకరంగార్ని కలిసి అడగాలి .

సంకోచించి లాభంలేదు.

ఆ నిశ్చయానికి వచ్చింది సుజాత.

* * *

సుజాత ఫోన్ తీసింది.

విజయ్ యింటి నంబర్ తిప్పింది.

"హలో" భీమశంకరంగారి కంఠం వినిపించింది.

"హలో... భీమశంకరంగారిని..."

"మాట్లాడుతున్నాను"

"నమస్తే అంకుల్. నేను సుజాతను మీతో మాట్లాడాలి. మీకు ఎప్పుడు వీలౌతుంది"

"సాయంత్రం నాలుగింటికి రామ్మా" ఆయన కంఠంలో ఆశ్చర్యం ధ్వనించింది.

"ఆ టైమ్లో విజయ్ ఉండడా అంకుల్"

"విజయ్ ఊళ్ళో లేడమ్మా"

"సరే అంకుల్ నాలుగ్గంటలకు వస్తాను" నమస్తే



"నమస్తే"
ఫోన్ పెట్టేసిన శబ్దం వినిపించింది.
సోఫాలో వెనక్కు వాలి విశ్రాంతి తీసుకొంది సుజాత.
విజయ్ యింట్లోకి అడుగు పెడుతుంటే గుండె దడగా అనిపించింది.

లోపలకు అడుగు పెట్టింది.

"రామ్మా" భీమ శంకరంగారు హాల్లోనే సోఫాలో కూర్చుని ఉన్నారు.

సుజాత నమస్కరించింది.

ప్రతి నమస్కారం చేసి సోఫా చూపించారాయన కూర్చోమని.

సుజాతకు బెరుకుగా భయంగా సిగ్గుగా ఉంది.

యిదివరకు తన కోడలు కమ్మని ప్రార్థించాడాయన. ఆ ప్రార్ధన ఆనాడు తను వినలేదు. ఈనాడు ఆయన అభిప్రాయం తెలుసుకోవాలని వచ్చింది.

విధి ఎంత విచిత్రమైనది.

చిన్న చిన్న విషయాల్లో కూడా యిది అనుభవమౌతూనే ఉంటుంది. మనకు అక్కర్లేని సమయంలో లభ్యమైనవి తీరా మనం కావాలనుకొంటే దొరకవు.

తనలో తను నవ్వుకొంది సుజాత.

కాఫీ వచ్చింది.

మౌనంగా సుజాతకు కప్పు అందించారు భీమశంకరంగారు. మాట్లాడకుండా అందుకొంది సుజాత.

భీమశంకరంగారు ఆమెను గమనిస్తూనే ఉన్నారు. ఏదో సీరియస్‌గా చర్చించటానికే వచ్చిందని గ్రహించా రు.

"ఎలా ఉందమ్మా నీ రీసెర్చ్ వర్క్"

"అయి పోవచ్చిందండీ"

"యిదయ్యాక ఏం చేస్తావమ్మా" యధాలాపంగా అడిగారు ఆయన.

"ఏం చేయమంటారు" వెంటనే ఎదురు ప్రశ్న వేసింది సుజాత.

"నీ యిష్టం వచ్చినట్లు చేయి" నవ్వుతూ అన్నారు ఆయన.

"అది అడగటానికే వచ్చాను అంకుల్".

"చెప్పమ్మా ఏం అడగాలి" పైప్ వెలిగిస్తూ అన్నారాయన.

"విజయ్ నన్ను పెళ్ళి చేసుకుంటానంటున్నాడు అంకుల్" ఆయన మొహంలోకి చూసింది సుజాత.

అందులో ఏమీ ఆశ్చర్యం కనిపించలేదు.

ఈ మాటలు ఊహించి వీటి కోసమే ఎదురుచూస్తున్నట్లు ఉంది.

[redacted]

"ఏమీ అనలేదు. మీ అభిప్రాయం తెలుసుకోకుండా ఏమీ అనదలుచుకోలేదు".

ఆయన నిట్టూర్చారు.

"నా పరిస్థితి అంతా చెపుతాను సుజాతా. విని నువే ఆలోచించుకో. బొంబాయిలో రావ్

అని ఒకతను ఉన్నాడు. పెద్ద బిజినెస్ మాన్. చాలా దూరపు చుట్టరికం కూడా ఉంది. అతనికి ఒక్కత్తే కూతురు. పేరు మధురిమ. బొంబాయిలో బియ్యే చదువుతోంది'' ఆపారాయన.

సుజాత మౌనంగా వింటోంది.

''నేను విజయ్‌కి చెప్పలేదు సరిగా. యిప్పుడు బిజినెస్‌లో చాలా అప్పుల్లో మునిగివున్నాను. అంటే యివన్నీ అప్పులని కూడా కాదు. నేను విడమరిచి నీకు వివరించి చెప్పలేనమ్మ. బిజినెస్సంటే ఎన్నో ప్రాబ్లమ్స్ ఉంటాయి. నువు అర్థం చేసుకోగలవనుకొంటాను. నాకు సహాయపడేది రావు ఒక్కడే. రావు నాకు సహాయపడేది ఊరికే కాదు. అతని కూతురు మధురిమ మన విజయ్‌ని చాలా లైక్ చేస్తుంది. ఆ అమ్మాయిని విజయ్‌కిచ్చి చేయాలని అతని ఉద్దేశం. దానితో రెండు బిజినెస్‌లు కలిసి బాగా వృద్ధి అవుతాయి. అదీగాక నేను గుండె జబ్బు మనిషిని. ఏ క్షణంలో పోతానో. విజయ్ మధురిమను చేసుకొంటే నా తర్వాత బిజినెస్ ఎలా చేసుకొంటాడోనని బాధ ఉండదు. రావు తన అల్లుడిని కంటికి రెప్పలా చూసుకుంటాడు''.

సుజాత అర్థం చేసుకొంది. ఏ తండ్రైనా తన తదనంతరం కూడా తన కొడుకు సుఖంగా ఉండాలి అని అనుకుంటాడు. విజయ్ మధురిమను చేసుకొంటే యిక అతనికీ అతని వ్యాపార జీవితానికీ ఢోకా ఉండదు.

''అర్థమయింది అంకుల్. విజయ్‌తో నాకిష్టం లేదని చెపుతాను'' లేచింది సుజాత.

ఆయన జాలిగా నిస్సహాయంగా చూశారు.

''నన్ను క్షమించమ్మా'' అన్నారు.

''అంత మాట అనకండి అంకుల్. నాకు మీ బాధ అర్థమయింది. అదీగాక విజయ్ సుఖపరంగా ఆలోచిస్తే అతను మధురిమను చేసుకోవటమే ఉత్తమం'' అంది సుజాత.



## పనికిరాని చెట్టు!

ప్రాచీన వైద్యానికి ఈ నాటికీ మనం ఎంతో ప్రాముఖ్యత నిస్తున్నాం! మన చుట్టూ ఉన్న ప్రకృతి వనరుల్ని పూర్తిగా వినియోగించుకోవటంలో ఈ నాటికీ మనం పూర్తి విజయం సాధించలేదు! ప్రాచీన వైద్యానికి చెందిన చరకుడ్ని ఓసారి ఆయన గురువు.... పనికిరాని చెట్టొకదాన్ని తీసికొని రమ్మాన్నాడట! చరకుడు కాళ్ళు అరిగేలా తిరిగాడట! అయినా... చరకుడికి అలాటి పనికి రాని చెట్టు కన్పించడం లేదనే తన 'గురువు'కు విన్నవించుకొన్నాడట! నిజంగా నిజమే సార్!

జూపిటర్

"వెళ్ళొస్తాను అంకుల్. నమస్తే" అంది.

ఆయనకూడా లేచి నిలబడ్డారు.

"నా కారులో యింటిదాకా దింపుతానమ్మా. చీకటి పడుతోంది. ఒక్కదానివీ వెళ్ళలేవు" అన్నారు.

"వద్దు అంకుల్ ఒక్కదాన్నే వెళతాను" బయల్దేరింది సుజాత.

తను ఒక్కతే జీవితమంతా నడవాలిక. చీకటంటే భయం ఎందుకు.

బయటకు రాగానే దుఃఖం పొంగి రాబోయింది. బలవంతాన ఆపుకొంది.

తనకి అలవాటేగా ఆశాభంగాలు.

అయినా ఎందుకింత బాధ. యింటి వచ్చి స్నానం చేసింది.

భోజనం ముగించి తన గదిలోకి వచ్చి కూర్చుంది.

రేపే సోమవారం.

విజయ్ వస్తాడు. తన సమాధానం అడుగుతాడు.

భారంగా నిట్టూర్చింది సుజాత.

రెండోసారి తిరస్కరించాలా అతడ్ని.

తప్పదు.

రెండుసార్లూ బాధ పడుతూనే తిరస్కరించాల్సి వచ్చింది.

ఒకసారి తన వాళ్ళకోసం. రెండోసారి అతని వాళ్ళకోసం.

తన నోటితో అతనికి తను చెప్పలేదు.

ఉత్తరం రాయాలి.

కాగితం, కలం తీసింది. రాయటం మొదలుపెట్టింది.

"విజయ్,

నువు అడిగిన విషయం ఆలోచించాను. నాకు ఎందుకో ఆ విషయం వైపు దృష్టి పోవటం లేదు. విదేశాలకు వెళ్ళి ఉద్యోగం చేయాలని ఉంది. నన్ను క్షమిస్తావు కదూ, నీ పెళ్ళికి తప్పక పిలవాలి.

సుజాత"

ఉత్తరం ముగించి కవర్లో పెట్టి అంటించింది.

మర్నాడు పొద్దుటే లాబ్‌కి వెళ్ళింది.

లాబ్‌బాయ్ రంగయ్యను పిలిచింది.

"విజయేంద్ర తెలుసుగా. ఆయన వస్తే ఈ కవరు యిచ్చెయ్యి మర్చిపోకు"

"అలాగేనమ్మా" కవరు తీసుకున్నాడు రంగయ్య.

"నేనింటికి వెళ్ళిపోతాను. ఒంట్లో బాగాలేదు. కవరు యివ్వడం మర్చిపోకు" యింకోసారి హెచ్చరించి యింటికి వచ్చేసింది సుజాత.

తన గదిలో కొచ్చి కూర్చుంది.

మధ్యాహ్నం రెండు గంటలౌతోంది.

"విజయ్ ఫోన్ చేశాడమ్మా వెళ్ళి మాట్లాడు" సుభద్రమ్మ గారు వచ్చి చెప్పారు.

"పడుకున్నానని చెప్పమ్మా" అంది సుజాత.

"సరే" వెళ్ళిపోయారు సుభద్రమ్మగారు.

కళ్ళు మూసుకుంది సుజాత.

మళ్ళీ వచ్చారు సుభద్రమ్మగారు.

"ఏదో అర్జెంటుగా మాట్లాడాలిట సుజా. లేస్తే గనక ఫోన్ దగ్గరకు రమ్మన్నాడు. లేకుంటే ఒక గంటాగి తనే వస్తాడుట."

"పదమ్మా వస్తున్నాను" కంగారుగా బయల్దేరింది సుజాత.

రిసీవర్ తీసుకుంటే చేతులు వణికాయి.


గట్టిగా పట్టుకొని చెవులకానించుకొంది.

"హలో" అంది.

"హలో సుజాతా" అన్నాడు విజయ్.

"అవును"

"ఆ ఉత్తరం నువు రాసిందేనా"



''అవును''

''యిష్టపూర్వకంగానే రాశావా''

''అవును''

''నిజంగా నీకు యిష్టం లేదా''

''అవును.''

''సుజా. అలా అనకు సుజా. బాగా ఆలోచించుకో సుజా'' అతని కంఠంలో ప్రార్థన ఉంది.

''బాగా ఆలోచించే రాశాను.''

''అంతేనంటావా''

''అవును అంతే. అయినా ఏమిటిది. ఏదో స్నేహితులని గౌరవమిస్తే యిలా అవమానిస్తారా. నేనంత చులకనగా కన్పిస్తున్నానా. నాకూ యిష్టాయిష్టాలంటూ ఉండవా. మీరు చెప్పగానే ఒప్పేసుకోవాలా. ఛీ... మీరు యిట్లాంటి వాళ్ళని తెలిస్తే అసలు మీతో స్నేహమే చేయకపోయేదాన్ని.''

''అలాగా. గుడ్‌బై'' అతను కోపంగా ఫోన్ పెట్టేశాడు.

సుజాత నిస్పృహగా నవ్వుకొంది.

యిక ఈ కోపంతో మధురిమను తప్పక పెళ్ళి చేసుకుంటాడు.

తన మీదున్న కోపాన్నంతా మధురిమ మీద ప్రేమగా కురిపిస్తాడు.

కొన్నాళ్ళు గడిస్తే జీవితంలో సర్దుకుపోతాడు. పిల్లలు పుడతారు, భార్యా పిల్లల గొడవలో పడితే సుజాత అనే స్నేహితురాలు ఉండేదనే జ్ఞాపకమే ఉండదు.

ఆలోచిస్తున్న సుజాతకు గుండె నెప్పిగా అనిపించింది. ఆలోచనలు బలవంతాన మానుకొని తన గదిలోకి దారితీసింది.

* * *

ఆరోజే విజయ్ పెళ్ళి.

ఉదయంనుంచీ ఆలోచిస్తూనే ఉంది సుజాత పెళ్ళికి వెళ్ళాలా వద్దా అని.

జగన్నాధంగారి కుటుంబాన్నంతా భీమశంకరంగారు స్వయంగా వచ్చి ఆహ్వానించారు.

వెళ్ళకపోతే బాగుండదన్నారు జగన్నాధంగారు. జగన్నాధంగారు సుజాత కలిసి వెళ్ళారు. భీమశంకరంగారి యింట్లోనే పెళ్ళి.

అందంగా అలంకరించిన పందిరి. దానిలో దేదీప్యమానంగా లైట్లలో పూలతో మెరుస్తున్న

కళ్యాణమండపంట.

వెళ్ళేసరికి విజయ్ పీటలమీద కూర్చుని ఉన్నాడు.

జరీపంచ, సిల్కుచొక్కా, కండువా, కళ్ళకు కొద్దిగా కాటుక బుగ్గన చుక్క, పెళ్ళికొడుకు వేషంలో మెరిసిపోతున్నాడు విజయేంద్ర.

పెళ్ళికూతురు మధురిమ అద్భుతంగా ఉంది. సహజంగా చాలా అందగత్తె అయి ఉంటుంది. బ్యూటీ క్లినిక్ నుంచి పిలిపించుకొందిట మేకప్ చేసేవాళ్ళను. శ్రద్ధగా చేసిన పెళ్ళికూతురి అలంకరణలో రంభలా మెరిసిపోతోంది.

విజయ్ మధురిమ మెడలో తాళి కడుతుంటే సుజాతకు భరించలేనట్లు అనిపించింది.

అయిపోయింది. తనకున్న ఒక్క ఆసరా కూడా తీరిపోయింది.

తనకు అత్యంత ప్రియతముడు, ప్రాణ స్నేహితుడు అయిన విజయ్ కాడిక. అతను మధురిమ భర్త.

ప్రేమించిన మనిషి దూరం అవుతుంటే నిజంగా ఎంత బాధగా ఉంటుందో తెలిసిందిప్పుడు.

ఆ బాధ ఎవరైతే దూరం అవుతున్నారో వారికన్నా ఎవరికి దూరమౌతున్నారా వారికే ఎక్కువ. ప్రేమికులు విడిపోతే ఎవరు ముందు పెళ్ళి చేసుకుంటే ఆ చేసుకొన్న వారికన్నా వేరొకరికే ఎక్కువ బాధ. ఆ బాధ లైలాకన్నా మజ్నూ ఎక్కువపడుండాలి. పార్వతికన్నా దేవదాసు ఎక్కువ పడుండాలి. అందుకే వారి ప్రేయసులు మామూలుగా ఉండిపోయినా వారుమాత్రం తాగుడికి బానిసలై పోయారు. పిచ్చివాళ్ళై పోయారు.

గిలగిలలాడింది సుజాత మనసు. మళ్ళీ గుండెల్లో నెప్పిగా అనిపించింది.

ప్రెజంటేషన్ చేతికిచ్చి అభినందనలు తెలిపారు సుజాత జగన్నాథంగారు.

"థాంక్స్" సీరియస్‌గా అన్నాడు విజయేంద్ర.

"మా క్లాస్‌మేట్ సుజాతగారు. వారు ఆవిడ తండ్రి జగన్నాథంగారు".

"ఓ ఐసీ, నమస్తే" చేతులు జోడించింది మధురిమ.



## గొంతు

సంగీతం నేర్చుకోవడానికొచ్చింది కామాక్షి.

"ఏం మాస్టారూ నా గొంతు బావుందా... నేను పైకి వెళ్ళే అదృష్టం ఉందా?" అడిగిది మాస్టార్ని.

"ఎందుకు లేదమ్మా. నువ్వే కాదు. నీ గొంతువల్ల ఎంతోమంది పైకి వెళ్తారు' చెప్పాడు మాస్టారు.

—ఐ. అంజనీదేవి (ఒంగోలు)

ఆమె ముహంలో చిటకారాన్ని పసికట్టింది సుజాత, అదిగాక అందరితో మామూలుగా మాట్లాడిన మధురిమ తనతో కొంచెం విరాగ్గా మాట్లాడుతున్నది.

తనలో తనే నవ్వుకొంది.

ఏముంది. ఎవరో చెప్పి ఉంటారు తన సంగతి. అదీగాక ఒకనాడు తన భర్తకు అత్యంత ఆప్తురాలు అని తెలిస్తే ఏ భార్య మాత్రం సహిస్తుంది. బొంబాయిలో బి.ఏ చదివినా, అమెరికాలో ఎం.బి.ఏ చదివినా ఆడమనసు ఆడమనసే.

వెళ్ళొస్తామని శలవు తీసుకున్నారు సుజాత జగన్నాథంగారు.

* * *

కాలానికి మనుషుల సుఖాలతో దుఃఖాలతో నిమిత్తం లేదు.

మనిషి దుఃఖంలో ఉన్నా సుఖంలో ఉన్నా రోజుకు యిరవై నాలుగు గంటలే.

ఆ కాలచక్రం అలాగ తిరుగుతూనే ఉంటుంది.

అలాగే కొద్దికాలం గడిచింది.

ఆ కాలంలో చెప్పుకోదగ్గ మార్పులే జరిగాయి.

విజయ్ దాంపత్యం బాగానే ఉంది.

సుజాత వారి పెళ్ళి తర్వాత మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళలేదు.

ఒకటి రెండుసార్లు బజార్లో కలిసినా మధురిమ పొడి పొడిగా మాట్లాడటంతో సుజాత కూడా వారితో ఎక్కువ రాకపోకలు పెట్టుకోలేదు.

బాంధవ్యాలు మమతలు నిలబెట్టుకొంటేనే నిలిచేవి. పడగొట్టుకుంటే ఒక్క తృటిలో పడిపోతాయి.

విజయ్‌కి సుజాతకు మధ్య బాంధవ్యాన్ని సుజాత అలాగే పడగొట్టింది. అది యిక తిరిగి నిలవదు.

సుభద్రమ్మగారు జగన్నాథం గారు ఒక్క నెల తేడాతో ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయారు.

సుజాత రీసెర్చ్ వర్క్ పూర్తయింది.

ఆమె యిప్పుడు పూర్తిగా సంఘసేవ, దైవపూజ మొదలైన వాటిల్లో మునిగిపోయింది.

సహజంగా భక్తిపరుల యింట పుట్టిన కారణంచేత ఆమెకు దైవభక్తి ఎక్కువే. ఎక్కడ భక్తి ఉపన్యాసాలు జరిగినా హాజరయేది.

అందుకే ఆ ఊరికొచ్చిన స్వామి దయానందగారి ఉపన్యాసాలు వినటానికి వెళ్లటం, అవి

విని ఆయనతో మాట్లాడి తనకున్న ఆసక్తిని వెల్లడించటం ఆయన ఆమెకు తన మిషన్‌లో చేర్చుకోవటం జరిగాయి.

ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడగలవారిని ఆయన విదేశాలకు పంపుతారు, ఉపన్యాసాలకి. సుజాత కాన్వెంటులో చదివినదీ. బాగా చదువుకొన్నదీ కావటం వల్ల ఇంగ్లీషు తడబడకుండా పొల్లుపోకుండా స్వచ్ఛంగా మాట్లాడటం వచ్చు. దానితో ఆమెకు విదేశాలకు వెళ్ళే అవకాశం కూడా కలిగింది. క్రమంగా ఆమెకు ఆరోగ్యం క్షీణించడం వల్ల ఆమె ప్రస్తుతం యిక్కడే ఆశ్రమంలోనే ఉంటోంది. ఏ ప్రయాణాలు వద్దని డాక్టర్లు హెచ్చరించారు. ఆశ్రమంలోనే ఉంటూ స్వామివారికి సహాయపడుతూ ఉన్నది ఆమె.

* * *

TANGUDU RANGA RAO
NEWS AGENT.
MADAPAM.

తెల్లవారింది.

ఆశ్రమంలో సుప్రభాతం చదువుతున్నారు.

అతను లేచాడు.

గతాన్ని తలుచుకొంటూ రాత్రి అంతా నిద్రలేదు అతనికి.

లేచి బాత్‌రూమ్‌కి వెళ్ళి మొహం కడుక్కొని స్నానం చేశాడు. సంచిలోనుండి ఉతికిన బట్టలు తీసి కట్టుకొన్నాడు.

దేవుని పటం ముందు నిల్చుని భక్తితో నమస్కరించి స్వామివారి దర్శనానికి బయల్దేరాడు.

దార్వం దగ్గర మనిషి ఆటకాయించాడు.

ఒక కాగితం యిచ్చాడు.



## మూఢభక్తి ముసుగు

ఎవరి పిచ్చి వారికానందం అని ఊరుకునే సంఘటన కాదది! మూఢ నమ్మకపు ముసుగులో జరిగిన అమాయక ప్రాణ త్యాగం అది! థాయ్‌లాండ్‌కు చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు తాము దేవుడి కిచ్చిన వాగ్దానం మేరకు సంతోషంగా తమకు తామే ఉరి వేసుకుంటున్నట్లు టాప్ చేసి మరీ ప్రాణ త్యాగం చేశారు.

అంతేకాదు! తమకారుగురికీ ఒకేచోట సమాధి నిర్మించమని కూడా వారు కోరారు! 35 సంవత్సరాల 'సోమ చాయ్ నిల్ ప్రాఫన్' తన ఇద్దరు భార్యలూ, ముగ్గురు పిల్లలతో ఈ దారుణానికి ఒడి గట్టాడట! పాపం శమించుగాక!

జూపిటర్

"మీ పేరు, ఊరు రాయండి" అన్నాడు.

అతడు రాశాడు. "శేఖర్. విశాఖపట్నం".

"అలా కూర్చోండి కుర్చీలో. ఆయన మిమ్మల్ని చూడటానికి అంగీకరిస్తే వెళ్ళవచ్చు" అన్నాడతను.

అతను తల ఊపాడు.

లోపల్నుంచి బయటకు వచ్చి "రమ్మంటున్నారు" అన్నాడు. అతను మెల్లిగా లేచి లోపలి గదిలోకి నడిచాడు.

పెద్దగది.

ఒక మూల శ్రీకృష్ణుడి విగ్రహం ఉంది. మెడలో పూలమాలలు, యింకొక పక్క అందరి దేవుళ్ళ పటాలు ఉన్నాయి. అగరువత్తుల పరిమళం గదంతా అలుముకొని ఉంది.

అంతటా నిశ్శబ్దం.

ప్రశాంత గంభీర వాతావరణం.

"కూర్చో నాయనా"

అతనా మాటలు వినిపించిన వైపు చూశాడు.

ఒక కుర్చీలో స్వామివారు కూర్చుని వున్నారు. దబ్బపండు వంటి ఛాయ, ప్రశాంతమైన మొహం వెండితీగెల్లా మెరుస్తున్న తలా, గడ్డం. కాషాయ వస్త్రాల్లో ఉన్నారాయన.

వేరొక కుర్చీలో కూర్చున్నాడు అతను.

"శేఖర్ అంటే సుజాత..." స్వామివారు అర్ధాంతరంగా ఆగారు.

"అవును సుజాత భర్తను."

"అలాగా నీవు మళ్ళీ పెళ్ళి చేసుకొన్నావని విన్నాను."

"అవును. కానీ ఆమె నన్ను కాదని వేరొకడితో పారిపోయింది."

"సుజాతను కూడా యిట్లాగే అన్నట్లున్నావు."

"వచ్చిన పామునింకా చంపకండి. సుజాత మీద కోపంతో ఏదో అన్నది నిజమే. కానీ ఈమె నిజంగానే నన్ను విడిచి వెళ్ళిపోయింది. సినిమాలలో చేరాలని ఆశ. పక్కింట్లో ఎవరో సినిమాల తాలూకు వాళ్ళుంటే వాళ్ళతో వెళ్ళిపోయింది. నన్ను ఎన్నడూ చూడటానికి కూడా రావద్దని చెప్పి మరీ పోయింది. నేను యిప్పుడు రాయేదో రత్నమేదో గ్రహించాను. సుజాతను తీసుకువెళదామని వచ్చాను. ఆమెను బాగా చూసుకొంటాను. నన్ను నమ్మండి" ఒకసారి సుజాతను పిలుస్తే ఆమెతో మాట్లాడతాను."

కొద్దిసేపు స్వామిగారు ఏం మాట్లాడలేదు.

"అయితే యిప్పుడు సుజాత భర్తగా నీ విధులు నెరవేరుస్తావన్న మాట" అన్నారు.

"తప్పకుండా స్వామీ. ఆమెకు నేనెంతో అన్యాయం చేశాను. చేసిన వాటికి పరిహారం చెల్లించుకుంటాను. ఆమెకోసం ఏం చేయమన్నా చేస్తాను. ఒక్కసారి ఆమెను పిలవండి" ప్రార్థించాడు అతను.


స్వామి కొద్దిసేపు మౌనంగా ఉన్నారు. అతనివైపు చూశారు.

ఆ కళ్ళల్లో నిజాయితీ పశ్చాత్తాపం కన్పించాయి.

తర్వాత ఒక శిష్యుడిని పిలిచి ఏదో చెప్పారు చిన్నగా.

అతను తల ఊపి వెళ్ళిపోయాడు. స్వామి సుజాతను పిలుచుకు రమ్మని పంపినట్లున్నారు. శేఖర్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నాడు. కొద్దిసేపు గడిచింది.

శిష్యుడు చేతిలో ఒక మూటతో ప్రవేశించాడు. శేఖర్ నిరాశ చెందాడు సుజాతను



తీసుకొని రావనందుకు.

స్వామివారు చెప్పారు.

"సుజాత భర్తగా నీ విధులు నీవు నిర్వర్తిస్తానన్నావు. చాలా సంతోషం నాయనా. ఇలారా" అంటూ మూట విప్పారు.

ఆ వస్త్రపు మూటలో ఉన్నవి కొద్దిగా బూడిద, ఎముకలు.

"ఏమిటివి" తడబాటుగా ప్రశ్నించాడు అతను.

"నీ భార్య సుజాత భౌతిక దేహపు ఎముకలు, చితా భస్మం".

"సుజాతా" దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు అతను.

లోయ దద్దరిల్లింది. ఆ ప్రశాంత వాతావరణంలో అతను వేసిన కేక భయంకరంగా ప్రతిధ్వనించింది.

"యిది చూడటానికేనా యింత దూరం వచ్చింది. నిన్ను తీసుకు వెళదామనుకొన్నాను సుజాత. నేను రాకముందే వెళ్ళి పోయావా" అతను భోరున ఏడుస్తున్నాడు అస్థికల మూట గుండెకు హత్తుకొని.

అతని తలమీద చేయివేసి ఓదార్చారు స్వామివారు. "కొద్దిగా ఆలస్యంగా వచ్చావు నాయనా. మనసు కుదుటపరచుకో. పదిహేను రోజుల క్రితం గుండెపోటుతో మరణించింది. ఆమె తన మరణం ఎవరికీ తెలియబరచక్కర్లేదని చెప్పింది. ఆమెను యిక్కడే దహనం చేశాము. నేను రేపు కాశీకి వెళుతున్నాను. పవిత్ర భాగీరథీ జలాల్లో ఆమె అస్థికలు కలపాలనుకొన్నాను. నీవు ఆమె భర్తవి. నీ విధి నీవు నిర్వర్తించు. ఈ పని నువ్వు చేస్తేనే బాగుంటుంది."

అస్థికలమూట శేఖర్ చేతికిచ్చి భుజం తట్టారాయన.

భోరున విలపిస్తూ దాన్ని అందుకొన్నాడు శేఖర్.

"తప్పకుండా చేస్తాను. ఆమె బతికి ఉండగా భర్తగా ఏమీ చేయలేకపోయాను. కనీసం మరణించిన తర్వాతైనా ఆమెకోసం ఒక్కటైనా చేస్తున్నాను వెళ్ళొస్తాను."

"మంచిది."

సమయానికి చేయకపోతే ఏ పని అయినా అంతే. సుజాత జీవించి ఉండగా ఆమెను సుఖపెట్టలేక పోయాడు. మరణించాక ఏమనుకొని ఏం లాభం. సజీవమైన సుజాతను తీసుకొని విందు జీవితంలోకి అడుగు పెట్టాలనుకొన్నాడు అతను.



నిర్జీవమైన అస్థికల మూటతో శూన్యమైన ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు.
అతను కొండ దిగుతున్నాడు.
అతని హృదయంలో చెలరేగుతున్నాయి మంటలు.
ఆశ్రమంలోని ఆలయంలో ఆగకుండా మోగుతున్నాయి గంటలు.

(అయిపోయింది)